www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 143
వెల (Price) : Rs. 6.50
మంగళవారం | 29-7-2025 | పేజీలు: 14
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి రా.12:47 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తర రా.7:28 తదుపరి హస్త, వర్జ్యం: తె. 4:42-6:28, దుర్ముహూర్తం: ఉ. 8:31-9:22, రా.10:25-11:08, అమృతఘడియలు: ఉ.11:42-1:25, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:57, సూర్యాస్తమయం: 6:45 | గుంటూరు సిటీ
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



దివ్య.. విశ్వ విజేత

పుణె టీనేజర్‌కు చెస్ వరల్డ్ కప్
ఫైనల్లో హంపిపై విజయం
గ్రాండ్‌మాస్టర్ హోదా కైవసం

10



అదానీకి అనుమతులు రద్దు

జగన్ జమానాలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు
గిరిజనులకు అన్యాయం చేస్తూ
ఆంధ్రా, ఒడిసా సరిహద్దులో కేటాయింపు
కురుకుట్టి, కర్రివలసలో ఏర్పాటుకు ఆమోదం
వాటిని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

11



'మెగా పీటీఎం'.. గిన్నిస్ రికార్డు!

డేటా ఆడిట్ తర్వాత గిన్నిస్ బృందం ధ్రువీకరణ
61 వేల పాఠశాలల సమాచారం విశ్లేషణ
ఈనెల 10న మెగా పీటీఎం-2.0లో పాల్గొన్న 53.4 లక్షల మంది తల్లిదండ్రులు, టీచర్లు
ఆగస్టు రెండో వారంలో పత్రం అందజేత
ఈ రికార్డు టీచర్లకు అంకితం: లోకేశ్

12

వీఐపీలు ఏడాదిలో ఒక్కసారే తిరుమలకు రావాలి



అప్పుడే మరింతమంది సామాన్యులకు శ్రీవారి దర్శనం
దేవస్థానం నిధుల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు
మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

3

కారిడార్లు, క్లస్టర్లు, పార్కుల విస్తరణ ద్వారా పారిశ్రామిక పెట్టుబడులకు విస్తారమైన అవకాశాలు కల్పిస్తున్నాం. విశాఖ-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు-చెన్నై కారిడార్లు పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయి. త్వరలో ఆంధ్ర-సింగపూర్ స్టార్టప్ ఫెస్టివల్ నిర్వహిస్తాం. - చంద్రబాబు



సింగపూర్ బిడదారి పార్క్‌లోని సరస్సును, దానిని ఆనుకుని ప్రకృతితో మమేకమై నిర్మించిన భారీ భవంతులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

మీ పెట్టుబడులకు మాదీ పూచీ

ఆంధ్రా-సింగపూర్ బిజినెస్ ఫోరం భేటీలో చంద్రబాబు భరోసా

పెట్టుబడి అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
నవంబరులో విశాఖ భాగస్వామ్య సదస్సుకు రండి
పెట్టుబడులే కాదు.. పేదలకు సాయమూ చేయండి
పేద-ధనిక అంతరం తగ్గించడానికే పీ-4
త్వరలో ఏపీ-సింగపూర్ స్టార్టప్ ఫెస్టివల్
రాష్ట్రంలో పెట్టుబడులకు ఆకాశమే హద్దు
నైపుణ్యమున్న వర్క్‌ఫోర్స్‌ను సిద్ధం చేస్తాం
ఏపీలో 6 పోర్టులు, 7ఎయిర్‌పోర్టులు
త్వరలో అందుబాటులోకి మరో 4 రేవులు, ఇంకో 9 గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు: సీఎం

ఆ తప్పులు పునరావృతం కావు

జగన్ ప్రభుత్వంలో జరిగిన వాటిని సరిదిద్దడానికే సింగపూర్ వచ్చా
ఆ దేశ మంత్రి లాంగ్‌తో చంద్రబాబు

అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ఎంపికగా ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులకు అత్యంత భద్రత ఉంటుందని పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. సింగపూర్ పర్యటనలో భాగంగా రెండోరోజు సోమవారం ఆయన ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం తరపున నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. దీనికి సింగపూర్ కంపెనీలతోపాటు ఏపీ నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రతినిధులు హాజరయ్యారు. ఈ ఏడాది నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పారిశ్రామిక, పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు రావాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రాజెక్టులు, పెట్టుబడుల అవకాశాలు, ఇస్తున్న ప్రోత్సాహకాలు. స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలపై

మిగతా 13వ పేజీలో...

ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పిస్తాం

రాష్ట్రంలో ఎంఆర్‌ఓ హబ్‌కు సహకరించండి.. ఎయిర్‌బస్‌కు మంత్రి లోకేశ్ ఆహ్వానం
ఆసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీతో భేటీ.. ఎవర్ వోల్ట్ చైర్మన్ సైమన్ టాన్‌తోనూ సమావేశం
ఏపీలో బ్యాటరీ సెల్ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి.. రెన్యూవబుల్ ఎనర్జీలో నైపుణ్య శిక్షణకు టాన్ ఓకే
బలమైన విద్యా వ్యవస్థకు సింగపూర్ సహకారం కావాలి.. విద్యావేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్
అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దయాస్పోరా వలంటీర్లకు మంత్రి పిలుపు

13

పహల్గాం ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్

ఆపరేషన్ మహదేవ్..



సులేమాన్ షా, అబూ హమ్జా, యాసిర్

సులేమాన్ సహా ముగ్గురి హతం
ఉగ్రవాదుల వద్ద చైనా శాటిలైట్ కమ్యూనికేషన్ పరికరాలు
14 రోజులుగా ట్రాక్ చేసిన బలగాలు
దాచిగామ్ అడవుల్లో వేట.. మెరుపు దాడితో ఆట కట్టించిన భద్రతా దళాలు

శ్రీనగర్, జూలై 28: పహల్గాం ఉగ్రదాడితో 26 మందిని పొట్టనబెట్టుకున్న ముష్కరులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. 'ఆపరేషన్ మహదేవ్' పేరుతో సోమవారం ఉదయం చేపట్టిన దాడుల్లో.. పహల్గాం మాస్టర్‌మైండ్ సులేమాన్ షా అలియాస్ హాషిం మూసా అలియాస్ అబూ సులేమాన్, మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతిచెందిన మిగతా ఇద్దరు ఉగ్రవాదులను యాసిర్ అలియాస్ హారిస్, అబూ హమ్జాగా అనుమానిస్తున్నారు. నెల రోజుల కిందట భద్రతాబలగాలు సులేమాన్, ఇతర ఉగ్రవాదుల కోసం వేటను ప్రారంభించాయి. ఈ క్రమంలో దాచిగామ్ అడవులను జల్లెడ పట్టాయి. దట్టమైన అడవుల్లో.. హర్వాన్ ప్రాంతంలో శాటిలైట్ సిగ్నల్స్ వెళ్తున్నట్లు గుర్తించిన బలగాలు.. 14 రోజులుగా ఆ ప్రాంతంపై నిఘా పెట్టి, ఉగ్రవాదులను ట్రాక్ చేశాయి. రెండ్రోజుల క్రితం ఉగ్రవాదుల షెల్టర్ వద్ద దాడికి వ్యూహాన్ని రచించాయి. ఈ క్రమంలో స్థానిక సంచార జాతుల సహాయం తీసుకున్నాయి. ఉగ్రవాదులు పైన టెంట్ వేసుకుని, భూమిలో తవ్విన గొయ్యిలో నక్కినట్లు గుర్తించాయి. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన 24 బృందాలు, నాలుగు పారా రెజిమెంట్ బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో సంయుక్తంగా 'ఆపరేషన్ మహదేవ్'ను చేపట్టాయి. ఉగ్రవాదుల షెల్టర్‌పై కాల్పులు జరిపాయి. ఈ దాడిలో సులేమాన్ సహా.. ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. డ్రోన్ కెమెరాల ద్వారా.. ఉగ్రవాదులను గుర్తించినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలిలో రెండు ఏకే-47

మిగతా 2వ పేజీలో...



ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతవరకైనా వెళ్తాం

22 నిమిషాల్లో పాక్‌లోని 7 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం
మన దాడులతో కాళ్ల బేరానికి పాక్.. ట్రంప్ ప్రమేయం లేదు
దాయాది తోక జాడిస్తే మళ్లీ సిందూర్.. లోక్‌సభ చర్చలో రాజ్‌నాథ్
మన విమానాలు ఎన్ని కూలాయో చెప్పాలి: కాంగ్రెస్

2

ఎవరు మార్గదర్శులు?

పీ4పై కలెక్టర్ల ఆదేశాలతో గజిబిజి

స్వచ్ఛంద కార్యక్రమంపై నిర్బంధ ఉత్తర్వులు
కొన్ని జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులకు టార్గెట్లు
లిక్కర్ లైసెన్సీలపైనా ఒత్తిడి తెచ్చే యత్నం
టీచర్లపై జారీ చేసిన ఉత్తర్వులు రద్దు
'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన
నమోదు, సాయం స్వచ్ఛందమే: ప్రభుత్వం

అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఉద్దేశం ఒకటి! కొందరు అధికారులు చేస్తున్నది మరొకటి! 'పీ4'లో భాగంగా పేద కుటుంబాల బాగోగుల బాధ్యతను తీసుకునే 'మార్గదర్శు'లపై గందరగోళం ఏర్పడుతోంది. ఈ కార్యక్రమం పూర్తిగా స్వచ్ఛందమని ప్రభుత్వం చెబుతుండగా... కొందరు అధికారులేమో ఉద్యోగులకు టార్గెట్లు విధించడం వివాదాస్పదంగా మారుతోంది. 'మార్గదర్శులుగా టీచర్లు', 'మార్గదర్శులుగా లిక్కర్ లైసెన్సీలు' అంటూ ఆదేశాలు ఇస్తున్నారు. ఇటీవల ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీఈవో ఉపాధ్యాయులను మార్గదర్శులుగా నమోదు చేయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు కలెక్టర్లు ఎక్సైజ్ శాఖకు ఈ పథకంలో లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. మద్యం లైసెన్సీలను మార్గదర్శులను చేయించే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు స్థానిక మద్యం లైసెన్సీలకు పీ4 పేరుతో టార్గెట్లు పెడుతున్నట్లు తెలిసింది. ఈ గందరగోళమంతా అవగాహన లోపం వల్లే జరుగుతోందని అర్థమవుతోంది. పీ4 కార్యక్రమంలో ఒక కుటుంబాన్ని ఎవరైనా దత్తత తీసుకోవడం అనేది పూర్తిగా స్వచ్ఛందం. ఎవరికైనా ఈ కార్యక్రమంపై ఆసక్తి ఉంటే పేదలను పైకి తీసుకొచ్చే సదుద్దేశంతో

మిగతా 13వ పేజీలో...



'అన్నదాత సుఖీభవ' జమ 2న

పీఎం కిసాన్ సొమ్ముతోపాటు రైతుల ఖాతాల్లోకి
రాష్ట్రంలోని 46.64 లక్షల కుటుంబాలకు లబ్ధి

14

ఎస్‌బీఐలో చోరీ

రూ.37.92 లక్షల సొమ్ము, 10 కిలోల ఆభరణాలు
హిందూపురంలో ఘటన

14

అంతర్గత కమిటీ ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమా?



అలాగైతే దాని ముందు ఎందుకు హాజరయ్యారు?
విచారణ పూర్తయ్యేదాకా ఎందుకు వేచి చూశారు?
జస్టిస్ యశ్వంత్ వర్మను నిలదీసిన సుప్రీంకోర్టు
పిటిషన్‌లో తన పేరు దాచి 'ఎక్స్‌ఎక్స్‌ఎక్స్'గా పేర్కొన్న వర్మ

న్యూఢిల్లీ, జూలై 28: తన అధికారిక నివాసంలో కట్టలు కట్టలుగా డబ్బు దొరికిన వ్యవహారంలో పార్లమెంటు అభిశంసనను ఎదుర్కోబోతున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టు కొన్ని సూటి ప్రశ్నలు సంధించింది. నాడు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వర్మ ఇంట్లో (ఢిల్లీలో) ఈ ఏడాది మార్చి 14వ తేదీ సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. మంటలార్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి కట్టలకొద్దీ డబ్బు దొరికింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ అంశంపై విచారణకు అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా.. పంజాబ్-హరియాణా

మిగతా 2వ పేజీలో...

అడ్మిషన్లు 18 శాతం పెరిగాయ్

ఇంటర్ ప్రవేశాలపై రోతపత్రికలో అబద్ధాలు
2023-24లో 1,24,818 మంది చేరిక
2025-26లో 1,46,332 మంది చేరారు
నెలాఖరు వరకు అడ్మిషన్లకు గడువుంది



తప్పుడు రాతలపై చట్టపరంగా చర్యలు
జగన్ పత్రిక కథనంపై లోకేశ్ మండిపాటు

12



హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దేవానంద్ ప్రమాణం


నలుగురు అదనపు జడ్జీలకు శాశ్వత న్యాయమూర్తుల హోదా
జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్ పేర్లను సిఫారసు చేసిన సుప్రీం కొలీజియం

14

పాదరసంతో బంగారం!

» సిలికాన్ వ్యాలీ స్టార్టప్ ప్రకటన

» న్యూక్లియర్ ట్రాన్స్‌మ్యుటేషన్‌తో మేలిమి బంగారం తయారీ



శాన్‌ఫ్రాన్సిస్కో, జూలై 28: సిలికాన్ వ్యాలీకి చెందిన మారథాన్ ఫ్యూజన్ అనే స్టార్టప్ కంపెనీ సంచలన ప్రకటన చేసింది. పాదరసాన్ని బంగారంగా మార్చే సాంకేతికతను అభివృద్ధి చేశామని వెల్లడించింది. తమ ప్రయోగాలు కార్యరూపు దాలిస్తే.. బంగారం ధరలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలున్నట్లు తెలిపింది. అయితే.. పాదరసంతో తాము తయారు చేసేది మేలిమి బంగారమే అయినా.. ఫ్యూజన్ రియాక్టర్ వినియోగం కారణంగా.. 14-18 ఏళ్ల వరకు అందులో రేడియో ధార్మికత ఉండే ప్రమాదముందని.. అప్పటి వరకు దీన్ని వాణిజ్యపరంగా వినియోగించేందుకు అవకాశముండదని స్పష్టం చేసింది. పాదరసం-198 అనే ఐసోటోప్‌ను తొలుత పాదరసం-197గా మార్చాల్సి ఉంటుందని, ఆ తర్వాత దాన్ని బంగారం-197 ఐసోటోప్‌గా రూపాంతరం చెందేలా చేయవచ్చని మారథాన్ ఫ్యూజన్ వెల్లడించింది. మూలకాల మార్పిడి(న్యూక్లియర్ ట్రాన్స్‌మ్యుటేషన్) ద్వారా ఇది సాధ్యమని పేర్కొంది. ఈ ప్రక్రియ ద్వారా ఏటా 5 వేల కిలోల మేర బంగారాన్ని ఉత్పత్తి చేయవచ్చని తెలిపింది. మారథాన్ ఫ్యూజన్ స్టార్టప్ ఇప్పటి వరకు 6 మిలియన్ డాలర్ల పెట్టుబడులు, 4 మిలియన్ డాలర్ల ప్రభుత్వ నిధులను సాధించడం గమనార్హం..!

గూగుల్ స్ట్రీట్ వ్యూలో అర్జెంటీనా వ్యక్తి నగ్న ఫొటో

» రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు

బ్యూనస్ ఎయిర్స్, జూలై 28: తన నగ్న చిత్రాన్ని గూగుల్ స్ట్రీట్ వ్యూ ఫొటోల్లో ఉంచారంటూ అర్జెంటీనాకు చెందిన ఓ వ్యక్తి కోర్టుకెక్కి పరిహారం పొందారు. సదరు వ్యక్తి నగ్న ఫొటోను చిత్రీకరించి స్ట్రీట్ వ్యూ ఫొటోల్లో ఉంచినందుకు గూగుల్‌ను దోషిగా నిర్ధారించి.. బాధితుడికి నష్ట పరిహారంగా 12,500 అమెరికా డాలర్లు (రూ.10,81,750) చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. పోలీసు అధికారి అయిన బాధితుడు బ్రాగాడో పట్టణంలో ఉండే వారు. అయితే 2017లో ఆయన తన ఇంటి ముందు పెరటిలో పనిచేస్తుండగా వీధి గుండా గూగుల్ స్ట్రీట్ వ్యూ వాహనం ఫొటోలు తీస్తూ వెళ్లింది. ఈ సమయంలోనే ఆయన బట్టలు లేకుండా ఉన్న ఫొటోను కూడా తీసింది. అనంతరం ఆ ఫొటోను ఆన్‌లైన్‌లో పోస్టు చేసింది. అందులో అతడి ఇంటి నంబర్‌తో పాటు వీధి పేరు కూడా స్పష్టంగా కనిపించింది. కొద్ది రోజుల్లోనే సోషల్ మీడియాలో ఇది వైరల్‌గా మారింది. టీవీ చానెళ్లలోనూ కథనాలు వెలువడ్డాయి. దీంతో తన పరువుకు భంగం కలిగిందంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు.

బిహార్‌లో కుక్కకు రెసిడెన్స్ సర్టిఫికెట్!

» 'డాగ్‌బాబు' పేరుతో అప్లికేషన్.. అమోదించిన ఆఫీసర్లు

పట్నా, జూలై 28: కుక్క ఫొటోతో అధికారులు ఓ నివాస ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఫొటోకు తగ్గట్లుగా పేరు, తల్లిదండ్రుల పేర్లూ ఉండటం ఇక్కడ మరింత విశేషం!! దరఖాస్తుదారు పేరు 'డాగ్ బాబు', తండ్రి పేరు 'కుత్తా బాబు', తల్లి పేరు 'కుతియా దేవి' అని ఆ పత్రంలో పొందుపరిచారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో జరిగిందీ చోద్యం. సర్టిఫికెట్‌లో రెవెన్యూ అధికారి మురారీ చౌహాన్ డిజిటల్ సంతకం కూడా ఉంది. ఆ పత్రంలో చిరునామాను మొహల్లా కౌలిచౌక్, వార్డు నంబరు 15, మసౌర్హి నగర పరిషత్‌గా పేర్కొన్నారు. ఈ 'శునక నివాస ధ్రువీకరణ పత్రం' కోసం ఢిల్లీకి చెందిన ఓ మహిళ, ఆమె భర్త ఆధార్ కార్డులు, ఇతర పత్రాలను జత చేస్తూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం మరో విశేషం. జూలై 24న ఈ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పట్నా జిల్లా మెజిస్ట్రేట్ త్యాగరాజన్ పేర్కొన్నారు. జారీ చేసిన రెండు నిమిషాల్లోనే సర్టిఫికెట్‌ను రద్దు చేశామని, ప్రమేయం ఉన్న అధికారులను సస్పెండ్ చేశామని చెప్పారు.

బ్యాంకాక్‌లో కాల్పులు.. ఆరుగురి మృతి

బ్యాంకాక్, జూలై 28: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఓర్ టోర్ కోర్ మార్కెట్లో సోమవారం ఓ గుర్తుతెలియని దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఆ తర్వాత తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ ఘటనలో దుండగుడితో పాటు మొత్తం ఆరుగురు మరణించినట్లు పోలీసులు తెలిపారు. వారిలో నలుగురు సెక్యూరిటీ గార్డులు, ఒక మహిళ ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం థాయ్‌లాండ్ - కంబోడియా సరిహద్దుల్లో ఏర్పడ్డ ఘర్షణలకు ఈ కాల్పులకు సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

థాయ్‌లాండ్, కాంబోడియా కాల్పుల విరమణ

బ్యాంకాక్, జూలై 28: థాయ్‌లాండ్, కాంబోడియా కాల్పుల విరమణకు అంగీకరించాయి. మలేషియా మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చల్లో బేషరతుగా, తక్షణమే కాల్పుల విరమణకు ఇరుదేశాలూ అంగీకారం తెలిపాయి. మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఇబ్రహీం నివాసంలో సోమవారం జరిపిన చర్చల్లో కాంబోడియా ప్రధానమంత్రి హున్ మానెట్, థాయ్‌లాండ్ తాత్కాలిక ప్రధానమంత్రి ఫుంతం వెచయచాయ్‌లతోపాటు మలేషియాలోని చైనా, అమెరికా రాయబారులు కూడా పాల్గొన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చొరవతో ఈ చర్చలు జరిగాయి' అని మానెట్ పేర్కొన్నారు.

రేపే నింగిలోకి 'నిసార్'

సూళ్లూరుపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): నాసా-ఇస్రో సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టనుంది. ఈ రాకెట్ ద్వారా బుధవారం సాయంత్రం 'నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్' (నిసార్) ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపనుంది. ఈ ప్రయోగానికి కౌంట్‌డౌన్‌ను మంగళవారం మధ్నాహ్నం 2:10 గంటలకు ప్రారంభించి.. 27:30 గంటలపాటు కొనసాగించనున్నారు. ఆ తర్వాత షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి బుధవారం సాయంత్రం 5:40 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ సోమవారం షార్‌కు చేరుకుని ప్రయోగ సన్నాహాల్లో పాల్గొన్నారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థల పనితీరు, తదితర అంశాలపై చర్చించిన అనంతరం ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నాసా-ఇస్రో సంయుక్తంగా రూపొందించిన ఉపగ్రహం కావడంతో అమెరికా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు చేరుకున్నారు.

భూ పరిశీలన, విపత్తుల అంచనా..

నిసార్ ఉపగ్రహం మొత్తం 12 రోజుల్లో భూమిని మ్యాప్ చేయగలదని ఇస్రో చైర్మన్ నారాయణన్ అన్నారు. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. 'నిసార్ ఉపగ్రహంలో ఎస్ బ్యాండ్ సింథటిక్ అపెర్చర్‌ను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశాం. ఎల్ బ్యాండ్ సింథటిక్ అపెర్చర్‌ను నాసా రూపొందించింది. నిసార్ ఉపగ్రహం మేఘాలు ఆవరించినా, వర్షం కురిసినా, అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ 24 గంటలూ స్పష్టమైన ఫొటోలు తీసి భూమికి పంపగలదు. మట్టి పెళ్లలు విరిగిపడటం, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను గుర్తించి అప్రమత్తం చేయగలదు. పంటల పెరుగుదల, నీటి వినియోగ సమాచారం కూడా అందించగలదు. ప్రతి 12 రోజులకోసారి భూమిని చుట్టి స్పష్టమైన ఫొటోలు పంపిస్తుంది' అని నారాయణన్ వివరించారు.

డిసెంబరులో అంతరిక్షంలోకి 'వ్యోమమిత్ర'

చెన్నై, జూలై 28(ఆంధ్రజ్యోతి): వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఈ ఏడాది డిసెంబరులో ముందుగా 'వ్యోమమిత్ర' అనే రోబోను అంతరిక్షంలోకి పంపుతామని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ డిసెంబరులో రోబోను నింగిలోకి పంపుతాం. ఈ ప్రయోగం విజయవంతమైతే వచ్చే ఏడాది మరో రెండు మానవ రహిత (అన్‌క్రూడ్ మిషన్) ప్రయోగాలు చేపడతాం. 2027లో వ్యోమగాములతో కూడిన గగన్‌యాన్ మిషన్ ఉంటుంది' అని వెల్లడించారు.

ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతవరకైనా వెళ్తాం

22 నిమిషాల్లో పాక్‌లోని 7 ఉగ్రస్థావరాలు ధ్వంసం

» మన సైనికుల పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది

» కాల్పుల విరమణలో ట్రంప్ ప్రమేయం లేదు

» సైనికుల సత్తాపై విపక్షాలకు అనుమానమా?

» పాక్ విమానాలు ఎన్ని కూల్చారని ప్రశ్నించరేం?

» లోక్‌సభలో విపక్షాలపై రాజ్‌నాథ్ ధ్వజం



ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, జూలై 28: ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకలించివేసేందుకు నవీన భారతదేశం ఎంత వరకైనా వెళ్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. భారత సాయుధ దళాలు ఉగ్రవాద స్థావరాల ధ్వంసం విషయంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంతో ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చామని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ మాట్లాడారు. పాకిస్థాన్‌పై తీసుకున్న సైనిక చర్యతో భారత్ తన రక్షణ కోసం ఎంతకైనా తెగిస్తుందని ఉగ్రవాదులు, వారి మద్దతుదారులకు గట్టి సందేశం ఇచ్చినట్లయిందని చెప్పారు. శాంతి వచనాలను అర్థం చేసుకోలేని వారిపై కఠిన చర్యలు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. "మే 7న రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయి. పీవోకే, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపాయి. ఏడు ఉగ్ర శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశాయి. కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశాయి. సైన్యానికి అభినందనలు. దేశ ప్రజలను రక్షించడం మా ప్రభుత్వ బాధ్యత" అని రాజ్‌నాథ్ తెలిపారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చింది తానేనన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. మనపై ఎవరి ఒత్తిడీ లేదని స్పష్టం చేశారు. పాక్ మళ్లీ తోక జాడిస్తే మళ్లీ ఆపరేషన్‌ను కొనసాగిస్తామన్నారు. "ఆపరేషన్ సిందూర్‌తో మన వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది. ఉగ్ర శిబిరాల్లోకి చొచ్చుకెళ్లి మరీ ఉగ్రవాదులను హతమార్చాం" అని రాజ్‌నాథ్ చెప్పారు. "మనం చేసిన దాడులతో పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మనకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణ చేసుకుందామని మన డీజీఎంవోను కోరారు" అని స్పష్టం చేశారు.

పాక్ విమానాల గురించి అడగరేం?

మన సైనికుల సత్తాపై అనుమానాలు వ్యక్తం చేయడం, ప్రశ్నించడం సరికాదని రాజ్‌నాథ్ విపక్షాలకు హితవు పలికారు. "ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల పని. కానీ, మన ప్రతిపక్ష సభ్యులు మాత్రం మన యుద్ధ విమానాలు ఎన్ని కూలిపోయాయని పదేపదే ప్రశ్నిస్తుంటారు. మన దళాలు ఎన్ని పాకిస్థానీ విమానాలను కూల్చేశారని మాత్రం అడగరు" అని విపక్షాలపై ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నామని.. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదని అన్నారు. 'ఏ పరీక్షలో అయినా ఫలితం ముఖ్యం. అంతేకానీ పెన్సిల్ విరిగిందా?, పెన్ను పోయిందా? అన్నది విషయం కాదు' అని వ్యాఖ్యానించారు. మన వైమానిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని పాక్ క్షిపణులు, డ్రోన్లు ఇతర దీర్ఘశ్రేణి ఆయుధాలను వాడిందని.. వాటన్నింటినీ మన బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయని చెప్పారు.

అమెరికాకు సంబంధమే లేదు: జైశంకర్

ఆపరేషన్ సిందూర్‌కు, అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. వాణిజ్యంపై ఏ దశలోనూ, ఎన్నడూ అమెరికాతో చర్చలే జరపలేదని లోక్‌సభలో తెలిపారు. అలాగే అమెరికా అధ్యక్షుడి నుంచి ప్రధాని మోదీకి ఎలాంటి ఫోన్ కాల్ రాలేదని తేల్చిచెప్పారు. పాక్ డీజీఎంవో నుంచి విజ్ఞప్తి వచ్చిన తర్వాతే కాల్పుల విరమణ పాటించినట్లు చెప్పారు. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యల నేపథ్యంలో జైశంకర్ ఈ మేరకు వివరణ ఇచ్చారు. ఐక్యరాజ్య సమితిలో 190 దేశాలకు గాను 187 దేశాలు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చాయని గుర్తుచేశారు. జైశంకర్ మాట్లాడుతుండగా.. ప్రతిపక్ష సభ్యులు అంతరాయం కలిగిస్తుండడంతో హోంమంత్రి అమిత్ షా కల్పించుకున్నారు. తన సీటు నుంచి లేచి నిలబడి మాట్లాడుతూ.. "మన విదేశాంగ శాఖ మంత్రిపై ప్రతిపక్షాలకు నమ్మకం లేదు. వారికి వేరే దేశంపై ఉంది. వారి పార్టీలో విదేశానికి ఉండే ప్రాధాన్యం నాకు తెలుసు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.


మన యుద్ధ విమానాలు ఎన్ని కూలాయి



గౌరవ్ గొగోయ్

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై చేసిన దాడుల్లో మన యుద్ధ విమానాలు ఎన్ని కూలాయని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ ప్రశ్నించారు. నిఘా వర్గాల వైఫల్యం వల్లే పహల్గాం ఉగ్రదాడి జరిగిందని, దీనికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. "పహల్గాంకు ఉగ్రవాదులు వచ్చి ఎలా దాడి చేయగలిగారో రాజ్‌నాథ్ చెప్పలేదు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు మేం తప్పకుండా కొన్ని ప్రశ్నలు అడుగుతాం. ప్రభుత్వం వాటికి కచ్చితంగా సమాధానం చెప్పాలి" అని గొగోయ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోయి 100 రోజులు గడిచిందని.. ఇప్పటివరకు దాడికి కారకులను ప్రభుత్వం పట్టుకోలేకపోయిందని ప్రశ్నించారు. "ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని చెబుతున్నారు. అలాంటప్పుడు ఇది విజయవంతమైందని ఎలా ప్రకటిస్తున్నారు" అని అడిగారు. పాకిస్థాన్ మనదేశం ముందు మోకరిల్లేందుకు సిద్ధమైనప్పుడు.. 'మీరెందుకు యుద్ధాన్ని ఆపారు? ఎవరికి లొంగిపోయారు?' అన్న విషయాన్ని ప్రధాని మోదీ వెల్లడించాలని డిమాండ్ చేశారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 26 సార్లు ప్రకటించారని, ఐదారు యుద్ధ విమానాలు కూలిపోయాయని కూడా చెప్పారని గుర్తు చేశారు.

లోకం తీరు



పహల్గాం ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

తుపాకులు, ఒక ఎం4 కార్బైన్, 17 గ్రనేడ్లు, తూటాలు, చైనాకు చెందిన శాటిలైట్ కమ్యూనికేషన్ పరికరాలు, ఇతర సామగ్రిని భద్రతాబలగాలు సీజ్ చేశాయి. ఉగ్రవాదులు కోలుకునేలోపే.. భద్రతాబలగాలు ఆపరేషన్‌ను పూర్తిచేసినట్లు తెలుస్తోంది. కాగా.. పహల్గాం ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన పర్వేజ్ అహ్మద్ జోథార్, బషీర్ అహ్మద్‌లను పోలీసులు గత నెలలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే..! అయితే.. 'ఆపరేషన్ మహాదేవ్' గురించి భద్రతాబలగాలు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మృతదేహాల పోస్టుమార్టం పూర్తయ్యాక.. వారిని సులేమాన్, అబూహమ్జా, యాసిర్‌గా తేలితే.. అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలను నార్తర్న్ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ అభినందించారు.

ఎవరీ సులేమాన్?

పాక్ ఆర్మీకి చెందిన స్పెషల్ సర్వీస్ గ్రూప్‌లో పనిచేసిన సులేమాన్.. ఆ తర్వాత లష్కరే తాయిబా శిక్షణ పొందాడు. 2023లో భారత్‌లోకి చొరబడ్డాడు. బారాముల్లా సహా.. పలు ఉగ్రదాడులకు ఇతడు నాయకత్వం వహించాడు. ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో ఉగ్రదాడి జరిపి.. 26 మందిని పొట్టనబెట్టుకున్నాడు. ఈ దాడికి ఎల్ఈటీ అనుబంధ ద రెసిస్టెన్స్ ఫ్రంట్ బాధ్యత వహించింది. అప్పట్లోనే ఉగ్రవాదులను భద్రతాబలగాలు ట్రాక్ చేసినా.. వారు అడవుల్లో తప్పించుకున్నారు.

మహాదేవ్ పేరెందుకు?

దాచిగామ్ సమీపంలో మహాదేవ్ పర్వతం ఉంది. అందుకే.. ఈ ఆపరేషన్‌కు మహాదేవ్‌గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది.

నడిరోడ్డులో ఐటీ ఉద్యోగి హతం

» తమిళనాడులో పరువుహత్య

చెన్నై, జూలై 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఓ యువకుడు సోమవారం పరువు హత్యకు గురయ్యాడు. తూత్తుకుడి జిల్లాలోని ఆరుముగమంగళం ప్రాంతానికి కవిన్‌కుమార్(26) చెన్నై ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల సెలవులకు స్వస్థలానికి వెళ్ళిన కవిన్‌కుమార్ తన తాతకు అస్వస్థతగా ఉండటంతో ఆదివారం ఉదయం పాళయంకోటలో ఉన్న సిద్ధ వైద్య ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కవిన్‌కుమార్ ఆస్పత్రి బయట నిలబడి ఉండగా బైకుపై వచ్చిన ఓ యువకుడు అతడిని పిలిచి, కొంత దూరం తీసుకువెళ్లి కత్తితో దాడి చేయడంతో కవిన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పాళయంకోట పోలీసులు వెళ్ళి కవిన్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా ఈ హత్య చేసింది పాళయం కోట కేటీసీ నగర్ ప్రాంతానికి చెందిన సుర్జిత్ (24)గా గుర్తించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం పోలీసులు సుర్జిత్‌ను అరెస్టుచేసి, రహస్య ప్రదేశానికి తీసుకెళ్ళి విచారించగా కవిన్‌కుమార్‌ది పరువుహత్యగా తేలింది. విచారణ అనంతరం సుర్జిత్‌పై హత్య, అంటరానితనం నిరోధక చట్టం సహా నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

బిహార్ ఓటరు జాబితా సవరణలో ఆధార్‌ను అంగీకరించాల్సిందే

» ఎన్నికల సంఘానికి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, జూలై 28: బిహార్ ఎన్నికల నేపథ్యంలో.. ఓటరు జాబితా సవరణకు ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను చెల్లుబాటయ్యే పత్రాలుగా అంగీకరించేందుకు విముఖత చూపుతున్న భారత ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టు సోమవారం సీరియస్ అయింది. 'ఒకవేళ ఫోర్జరీ చేయదలచుకుంటే ఎలాంటి పత్రాలనైనా చేయొచ్చు కదా..?' అని ప్రశ్నించింది. ఆధార్‌తోపాటు ఓటరు ఐడీ కార్డుని చెల్లుబాటయ్యే డాక్యుమెంట్లుగా పరిగణించాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే.. ఎన్నికలకు ముందు బిహార్‌లో ఓటరు ముసాయిదా జాబితా ప్రచురణపై మధ్యంతర స్టే ఇవ్వడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈసీ చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై మంగళవారం (జూలై 29న) జరిగే విచారణ సందర్భంగా దీనిపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం వెల్లడించింది. మరోవైపు, ఈసీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదనలు వినిపిస్తూ.. ఆధార్ పౌరసత్వానికి రుజువు కాదని, ఇది ఓటరు జాబితాను సవరించే అంశం కాబట్టి.. ఓటర్ ఐడీ కార్డులపై ఆధారపడడం లేదని అన్నారు. ఇక రేషన్ కార్డు విషయానికి వస్తే వాటికి నకిలీలు సృష్టించే అవకాశం లేకపోలేదని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఆధార్‌ను కేవలం గుర్తింపు పత్రంగానే పరిగణిస్తామని వెల్లడించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఈ భూమిపై ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేరో చెప్పాలని ఈసీని ప్రశ్నించింది. బిహార్ ఎస్ఐఆర్‌లో ఆధార్, ఓటర్ ఐడీలను చెల్లుబాటయ్యే డాక్యుమెంట్ల కింద చేర్చాలని స్పష్టం చేసింది. 'రేషన్ కార్డులను సులభంగా ఫోర్జరీ చేయొచ్చని మేం చెప్పగలం. కానీ.. ఆధార్, ఓటర్ ఐడీ కార్డులు అలా కాదు. వాటికి కొంత విశ్వసనీయత ఉంది. కాబట్టి ఈ పత్రాలను అంగీకరించండి' అని ధర్మాసనం పేర్కొంది.

అంతర్గత కమిటీ రాజ్యాంగ విరుద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)



హైకోర్టు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ శీల్ నాగు, జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్‌తో (మార్చి 22న) అంతర్గత కమిటీని నియమించడం రాజ్యాంగ విరుద్ధమైనపుడు దాని ముందు విచారణకు ఆయన ఎందుకు హాజరయ్యారని కోర్టు ఆయన్ను నిలదీసింది. ఆ కమిటీని వేసినప్పుడే దాని చట్టబద్ధతను ఎందుకు సవాల్ చేయలేదని ప్రశ్నించింది. విచారణ పూర్తయ్యేదాకా ఎందుకు ఎదురుచూశారని అడిగింది. ఆ డబ్బు ఎవరిదో కమిటీ కనుగొంటుందన్న ఉద్దేశంతోనే దాని ముందు ఆయన హాజరయ్యారని జస్టిస్ వర్మ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. డబ్బు వ్యవహారంలో జస్టిస్ వర్మను అంతర్గత కమిటీ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. ఈ మేరకు మే 4వ తేదీన తన నివేదికను చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సమర్పించింది. దరిమిలా పదవికి రాజీనామా చేయాలని.. లేదంటే తప్పనిసరి స్వచ్ఛంద పదవీవిరమణ చేయాలని జస్టిస్ వర్మకు సీజేఐ సూచించారు. తానే తప్పూ చేయలేదంటూ ఆయన అందుకు నిరాకరించడంతో కమిటీ నివేదికను రాష్ట్రపతి, ప్రధానమంత్రికి సీజేఐ పంపించారు. దీనిపై కేంద్రం జస్టిస్ వర్మను పార్లమెంటు ఉభయ సభల్లో అభిశంసన తీర్మానం ద్వారా తొలగించాలని నిర్ణయించింది. ప్రస్తుత సమావేశాల్లోనే తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో అంతర్గత కమిటీ ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమని, న్యాయమూర్తిగా తనను తొలగించాల్సిందిగా సీజేఐ సిఫారసు చేయడాన్ని కూడా రాజ్యాంగవిరుద్ధం, ఆయన అధికార పరిధికి మించినదిగా ప్రకటించాలని కోరుతూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఎలాంటి ఫిర్యాదూ లేకుండానే జస్టిస్ వర్మపై అంతర్గత విచారణ ప్రారంభించారని సిబల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే ఆయనపై ఆరోపణలను పత్రికా ప్రకటన ద్వారా బహిరంగ పరచడంతో అసాధారణ మీడియా ట్రయల్ జరిగిందని తెలిపారు. 'ఆ డబ్బు ఎవరిదో, ఎంత దొరికిందో తన నివేదికలో కమిటీ స్పష్టం చేయలేదు. తగు గడువివ్వకుండానే రాజీనామానో, స్వచ్ఛంద పదవీవిరమణో చేయాలని.. లేదంటో తొలగింపు ప్రక్రియ మొదలుపెడతామని సీజేఐ హెచ్చరించారు' అని పేర్కొన్నారు. అయితే ఆయన పిటిషన్‌లో మూడు లోపాలను ధర్మాసనం ప్రస్తావించింది. 'పిటిషన్ ఇలా దాఖలుచేసి ఉండాల్సింది కాదు. సెక్రటరీ జనరల్ కాకుండా సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను కక్షిదారుగా చేర్చారు. మొదటి కక్షిదారుగా సుప్రీంకోర్టు. మీ వంటి సీనియర్ న్యాయవాది నుంచి మేం ఇది ఆశించలేదు. అంతర్గత కమిటీ రిపోర్టును పిటిషన్‌తో జతచేయలేదు. దానిపై మీరు వాదనలు వినిపించాలనుకుంటే అది కచ్చితంగా ఉండాల్సిందే' అని స్పష్టంచేసింది. నివేదికను జతచేస్తామని సిబల్ తెలిపారు. జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రక్రియ ఏ విధంగా రాజ్యాంగ విరుద్ధమో వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఈ సందర్భంగా సూచించింది. వ్యవస్థీకృత చట్టప్రక్రియ ద్వారా తప్ప మరే విధంగానూ న్యాయమూర్తి ప్రవర్తనపై విచారణ జరడానికి వీల్లేదని ఆయన బదులిచ్చారు.

ట్రిపుల్ ఎక్స్ వర్సెస్ కేంద్రం

జస్టిస్ వర్మ తన పిటిషన్‌లో తన పేరును పొందుపరచలేదు. 'ఎక్స్‌ఎక్స్‌ఎక్స్ వర్సెస్ కేంద్రప్రభుత్వం'గా పేర్కొన్నారు. పిటిషన్‌లో ఇలా గుర్తింపు దాచుకోవడం అసాధారణమేమీ కాదు. సాధారణంగా అత్యాచార, లైంగిక వేధింపుల బాధితులు, మైనర్లు, జువెనైల్స్ తమ గుర్తింపు బహిర్గతం కాకుండా 'ట్రిపుల్ ఎక్స్' అని పేర్కొంటుంటారు. ఇక్కడ జస్టిస్ వర్మ తన గుర్తింపును దాచిపెట్టడం గమనార్హం.

అనుకూల ఆదేశాల కోసమే వెళ్లారా?

అంతర్గత కమిటీ విచారణ జరపడానికి వీల్లేదని రాజ్యాంగ ధర్మాసనం చెబుతోందా అని కోర్టు అడిగింది. తనకు అనుకూలమైన ఆదేశాలు వస్తాయనే ఉద్దేశంతోనే జస్టిస్ వర్మ విచారణకు హాజరైనట్లుగా ఉందని వ్యాఖ్యానించింది. కమిటీ నివేదిక అభిశంసన తీర్మానానికి ఆధారం కారాదని సిబల్ అన్నారు. అభిశంసనకు ఆదే ఆధారమని ఎవరు చెప్పారని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. సీజేఐ లేఖను సిబల్ ప్రస్తావించారు. 'లేఖలు పంపడం అంటే పార్లమెంటే అభిశంసించాలని చెప్పడం ఎలా అవుతుంది' అని ధర్మాసనం ప్రశ్నించింది. వాదనలను నిర్దిష్ట పాయింట్లతో ఒక్క పేజీలో సమర్పించాలని.. కక్షిదారుల మెమోను కూడా సవరించుకుని రావాలని ఆదేశించింది.

భాషా ఉగ్రవాదంపై ఉద్యమం!

» బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై వివక్ష

» పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ ధ్వజం



బోల్‌పూర్, జూలై 28: దేశవ్యాప్తంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీల మీద దాడులు జరుగుతున్నాయని, అది భాషా ఉగ్రవాదంతో సమానమని పశ్చిమ బెంగాల్ సీఎం మమత ధ్వజమెత్తారు. 'వివిధ రాష్ట్రాలకు వలస వెళ్లిన బెంగాలీలను ఓటరు లిస్టులోంచి తొలగించి, ఎన్నార్సీ (దేశ పౌరుల జాబితా)ని దొడ్డిదారిన అమలు చేయటానికి కేంద్రం, ఎన్నికల సంఘం కుట్ర పన్నుతున్నాయి. నేను ప్రాణత్యాగానికైనా సిద్ధపడతాగానీ.. బెంగాలీ అస్తిత్వాన్ని లాక్కోవటానికి ఎవర్నీ అనుమతించను' అని పేర్కొన్నారు. తాను జీవించి ఉన్నంతకాలం బెంగాల్‌లో ఎన్నార్సీని అమలు చేయనియ్యబోనని, నిర్బంధ శిబిరాలను ఏర్పాటు కానివ్వబోనని మమత స్పష్టం చేశారు. బెంగాలీల మీద వివక్షకు వ్యతిరేకంగా మమత సోమవారం రాష్ట్రవ్యాప్త భాషా ఉద్యమాన్ని పశ్చిమ బెంగాల్‌లోని బోల్‌పూర్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'మాకు ఏ భాషతోనూ శతృత్వం లేదు. భిన్నత్వంలో ఏకత్వమే మన దేశానికి పునాది. కానీ, మా భాషను సంస్కృతిని ధ్వంసం చేయటానికి చూస్తే మాత్రం మేం శాంతియుతంగా, శక్తిమంతంగా, రాజకీయంగా ఎదుర్కొంటాం' అని తెలిపారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణను ఉద్దేశించి మాట్లాడుతూ, కేంద్రం తరపున ఓ మాజీ కేంద్రమంత్రి అసలైన ఓటర్లను కూడా ఓటరు లిస్టులోంచి తొలగిస్తున్నారని, బెంగాలీలు తమ సొంతదేశంలో నిర్వాసితులు కావటాన్ని తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దేశ స్వాతంత్ర్యోద్యమానికి, అనేక సంఘ సంస్కరణ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన బెంగాల్.. తన సొంత అస్తిత్వం కోసం కూడా పోరాడగలదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వేధింపులకు గురవుతున్న బెంగాలీలు తిరిగి సొంతరాష్ట్రానికి రావాలని మమత పిలుపునిచ్చారు.

భారత్-పాక్ పోరును నేనే ఆపా

నేను అమెరికా అధ్యక్షుడిని కాకపోతే ఆరు యుద్ధాలు జరుగుతుండేవి: ట్రంప్

లండన్, జూలై 28: భారత్-పాక్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చెప్పారు. తాను అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కాకపోయి ఉంటే ప్రస్తుతం ప్రపంచంలో ఆరు యుద్ధాలు జరుగుతుండేవని అన్నారు. స్కాట్‌లాండ్‌లో సోమవారం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను లేకపోయి ఉంటే ఈ రోజున ఆరు ప్రధాన యుద్ధాలు జరుగుతుండేవి. భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతుండేది. వాణిజ్య సుంకాలను అస్త్రంగా చేసుకొని థాయిలాండ్-కంబోడియాల మధ్య యుద్ధాన్ని ఆపించా. రవాండా-డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో మధ్య శాంతి ఒప్పందం కుదిరేలా చేశా. సెర్బియా-కొసావోల మధ్య ఘర్షణ తలెత్తకుండా చూశా" అని చెప్పారు. గాజాలో ప్రస్తుత పరిస్థితి ఏమిటని ఓ విలేకరి ప్రశ్నించినప్పుడు 'గాజాకు సహాయంగా అమెరికా చాలా ధనం పంపించింది. కానీ హమాస్ దాన్ని అపహరించింది' అన్నారు.

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో విఫలం

» చిన్న ఆస్పత్రుల నుంచి వారానికొక్కసారే తరలింపు
» పెద్దాస్పత్రుల్లో మాత్రమే కాస్త మెరుగ్గా నిర్వహణ
» వ్యర్థాల నిర్వహణపై ఫిర్యాదులకు 104 కాల్ సెంటర్
» బయో వ్యర్థాల నిర్వహణ సలహా కమిటీ సమావేశంలో నిర్ణయం

అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో విఫలమవుతున్నామని ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు అన్నారు. రాష్ట్రంలోని పెద్దాస్పత్రుల్లో నిర్వహణ కాస్త మెరుగ్గానే ఉన్నప్పటికీ.. చిన్న ఆస్పత్రుల్లో మాత్రం వారానికొక్కసారే ఈ వ్యర్థాలను తీసుకెళ్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో సోమవారం బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ రాష్ట్రస్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అనేక అంశాలపై చర్చించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఫిర్యాదుల కోసం 104 కాల్ సెంటర్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వ్యర్థాల నిర్వహణను పరిశీలించేందుకు స్వతంత్ర సంస్థను నియమించాలని సూచించారు. జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీలు తరచూ సమావేశాలు నిర్వహించేలా చూసేందుకు కలెక్టర్లకు లేఖలు రాయాలన్నారు. జిల్లాల్లో ఆస్పత్రుల్ని సందర్శించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రతినిధుల్ని కూడా ఆహ్వానించాలని కృష్ణబాబు సూచించారు. కేరళలో బయోమెడికల్ వ్యర్థాలను పూర్తిగా ఐఎంఏ నిర్వహిస్తోందని, ఒక బృందం అక్కడకు వెళ్లి పరిశీలించాలని ఆయన తెలిపారు. ప్రతి ఆస్పత్రిలోనూ వార్షిక నివేదిక తయారు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యర్థాల నిర్వహణను సరిగా చేపట్టని ఏజెన్సీలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్లను సమన్వయం చేసుకుని బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సమావేశాలు నిర్వహించేలా డీఎంహెచ్‌వోలకు తగు ఆదేశాలివ్వాలని కృష్ణబాబును పీసీబీ చైర్మన్ కృష్ణయ్య కోరారు. పీసీబీలో సిబ్బంది కొరత ఉందని.. రెండు, మూడు జిల్లాలకు ఒక ఆర్వో ఉన్నారని, ఆరోగ్యశాఖ సహకరిస్తే తప్ప బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించలేమని కృష్ణయ్య తెలిపారు. సమావేశంలో రాష్ట్రస్థాయి సలహా కమిటీ మెంబర్ కన్వీనర్, రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ స్పెషల్ సెక్రటరీ ఎస్.శ్రీశరవణన్, ఆరోగ్యశాఖ కమిషనర్ జీ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ సిరి, డీఎంఈ నరసింహం ఇతర అధికారులు పాల్గొన్నారు.


నిండుకుండలా మారిన నాగార్జునసాగర్ జలాశయం


శ్రీశైలం డ్యాం నాలుగు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు


పోలవరం వద్ద గోదావరి వరద ఉధృతి

కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలానికి భారీగా వరద.. నాలుగు గేట్లు ఎత్తివేత

» నిండు కుండలా నాగార్జునసాగర్
» నేడు గేట్లెత్తి పులిచింతలకు నీటి విడుదల
» గోదావరికి వరద తగ్గుముఖం
» సముద్రంలోకి 5,85,246 క్యూసెక్కుల విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం డ్యాం కళకళలాడుతోంది. దీంతో నాలుగు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు 1,08,260 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పాదన నిమిత్తం మరో 66,896 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే, తెలంగాణలోని కల్వకుర్తికి 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,48,279, సుంకేసుల నుంచి 94,445 క్యూసెక్కుల వరద శ్రీశైలం డ్యాంలోకి వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.80 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 203.4290 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శ్రీశైలానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. జలాశయం వద్ద సందర్శకుల తాకిడి పెరిగింది. నాగార్జున సాగర్ జలాశయం నిండు కుండలా దర్శనమిస్తోంది. డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 585 అడుగులకు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలకు గాను ప్రస్తుతం 297 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ డ్యాంలోకి 1,47,195 క్యూసెక్కుల వరద వస్తోంది. కుడి, ఎడమ కాలువలతో పాటు విద్యుదుత్పత్తికి 42,913 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జవహర్ కుడికాలువకు నీటి విడుదలను 500 క్యూసెక్కుల నుంచి 5000 క్యూసెక్కులకు పెంచినట్లు జలవనరులశాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు. కుడి కాలువ పరిధిలోని సాగు, తాగు అవసరాలకు 132 టీఎంసీల నీటిని కేటాయించారు. మరో 24 టీఎంసీలు కేటాయించాలని కోరుతూ జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జులైలోనే పుష్కలంగా సాగు నీరు సరఫరా చేయడం 18 ఏళ్లలో ఇదే తొలిసారి. దీంతో పంటల సాగు ఊపందుకుంది. సాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతల జలాశయానికి 25 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల డ్యాం గరిష్ఠ నీటిమట్టం 175 అడుగులు కాగా ప్రస్తుతం 160.3 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను ప్రస్తుతం 25.9 టీఎంసీల నీరు చేరింది. మంగళవారం సాగర్ గేట్లు ఎత్తనుండటంతో మరో మూడు రోజుల్లో పులిచింతల డ్యాం కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారుల అంచనా. ఈ నెలలోనే పులిచింతల గేట్లు కూడా తెరచుకోనున్నాయి.

గోదావరిలో స్వల్పంగా తగ్గిన నీటిమట్టం

గోదావరిలో వరద ఉధృతి క్రమంగా తగ్గుతోంది. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు ఎగువన సోమవారం నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. ఉప నదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, పర్ణ, ఇంద్రావతి నదుల నుంచి అదనంగా వస్తున్న 6,42,370 క్యూసెక్కుల వరదను స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ఎగువన 30.900 మీటర్లు, దిగువన 21.890 మీటర్లు నమోదైనట్టు అధికారులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులు ఉంది. కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 5,85,246 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

గోదారిలో వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

గోదావరిలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు ప్రాణాలు కోల్పోయారు. రాజమహేంద్రవరం జాలరిపేటకు చెందిన సవదాల సత్యారావు(45) సోమవారం తెల్లవారుజామున కాటన్ బ్యారేజ్ దిగువనున్న పాత ఆనకట్ట స్కవర్ స్లూయిజ్ మీదుగా నడుస్తూ ప్రమాదవశాత్తూ స్కవర్ స్లూయిజ్ గేట్లు ఉండే రాతి కట్టడంలోకి పడిపోయారు. వరద ఉధృతిలో పైకి రాలేక ప్రాణాలు కోల్పోయారు.

దసరా శరన్నవరాత్రులు 11 రోజులు

» ఇంద్రకీలాద్రిపై సెప్టెంబరు 22 నుంచి నవరాత్రి మహోత్సవాలు
» ఈ ఏడాది ఒక రోజు పెరిగిన ఉత్సవం
» కొత్తగా 'కాత్యాయని' అలంకారం
» తిథుల వృద్ధే కారణమంటున్న పండితులు

విజయవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇంద్రకీలాద్రిపై నిర్వహించే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ ఏడాది 11 రోజులపాటు జరగబోతున్నాయి. సెప్టెంబరు 22వ తేదీన ప్రారంభమయ్యే శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబరు రెండో తేదీ వరకు నిర్వహించనున్నారు. వివరాలను శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థాన ఈవో వీకే శీనానాయక్, స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, ప్రధానార్చకుడు దుర్గాప్రసాద్ సోమవారం వెల్లడించారు. ఈ ఏడాది తిథి వృద్ధి చెందడంతో 11 రోజులపాటు మహోత్సవాలు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది. అమ్మవారికి ప్రతి ఏడాది శరన్నవరాత్రుల్లో పది అలంకారాలు వేస్తారు. ఈ ఏడాది కొత్తగా కాత్యాయని అమ్మవారి అలంకారాన్ని చేస్తారు. సెప్టెంబరు 25వ తేదీన అమ్మవారు కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిస్తారు. కాగా, 29వ తేదీన అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రం రోజున సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. అదే రోజున సీఎం చంద్రబాబు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

ఢిల్లీ శ్రీవారి ఆలయంలో అధికారుల అత్యుత్సాహం

» టీటీడీ అనుమతి లేకుండా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ
» ఉన్నతాధికారులకు విజిలెన్స్ నివేదిక

తిరుమల, జూలై28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని టీటీడీ శ్రీవారి ఆలయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వివాదాస్పదమవుతోంది. ఢిల్లీలోని గోల్మార్కెట్‌లో టీటీడీ అధీనంలో బాలాజీ టెంపుల్ ఉంది. అక్కడున్న ప్రత్యేకాధికారి, అధికారులు, అర్చకులు, వేదపారాయణదారులు మే నెలలో నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు అక్కడున్న కొంతమంది సిబ్బంది నుంచి టీటీడీ ఉన్నతాధికారులకు సమాచారమందింది. దీంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించిన క్రమంలో అధికారుల బృందం గతనెల్లో విచారణ చేపట్టి టీటీడీకి నివేదికను సమర్పించింది. టీటీడీ ఆగమ సలహా మండలి, ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అనుమతులు లేకుండానే వైజాగ్ నుంచి విగ్రహాన్ని తెప్పించి ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠించారని నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. ఈక్రమంలో కొందరిని బాధ్యులను చేస్తూ రిపోర్టు రాశారు. వీటితో పాటు 2013లో జరిగిన కొన్ని అవినీతి అక్రమాలు కూడా వెలుగులోకి వచ్చినట్టు సమాచారం.

ప్రకాశం బ్యారేజీలో ఇసుక సేకరణ టెండర్లకు కమిటీ

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణానికి అవసరమైన ఇసుకను సేకరించేందుకు ప్రకాశం బ్యారేజీ, గుంటూరు జిల్లాలోని పలు రీచ్‌ల నుంచి పూడిక తీయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. దీనికోసం టెండర్లు పిలవనుంది. ఇందుకోసం అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. కమిటీలో సీఆర్‌డీఏ కమిషనర్/అదనపు కమిషనర్ చైర్‌పర్సన్‌గా, ఆర్థికశాఖ డిప్యూటీ ఫైనాన్సియల్ సలహాదారు, మున్సిపల్ శాఖ జేడీ, కృష్ణా డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్, గుంటూరు జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి, ఏపీపీసీబీ గుంటూరు జిల్లా ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, గుంటూరు ఆర్డీవో, గుంటూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి, ఏపీసీఆర్‌డీఏ యూఎస్ఐ గ్రూపు డైరెక్టర్, ఏడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉంటారు. సీఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. బిడ్ డాక్యుమెంట్లను ఈ కమిటీ పరిశీలించి ఆమోదిస్తుంది.

టీచర్లతో సంబంధం లేని పనులు చేయించొద్దు!

» పాఠశాల విద్యాశాఖ స్పష్టీకరణ

పాఠశాలలకు ప్రత్యక్షంగా సంబంధం లేని ఇతర శాఖల పనులను ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, టీచర్లకు అప్పగించొద్దని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అధికారులకు స్పష్టం చేశారు. దీనిపై సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కొన్ని జిల్లాల్లో స్కూళ్లకు సంబంధం లేని పనులను ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలలకు అప్పగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఇకపై హెచ్‌వోడీల అనుమతి లేకుండా ఎవరూ శాఖకు సంబంధం లేని ఇతర పనులు చేయకూడదన్నారు. శాఖకు సంబంధం లేని పనులను పాఠశాలలకు అప్పగించడం వల్ల బోధన పనులకు అడ్డంకి ఏర్పడుతోందని పేర్కొన్నారు.


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, పక్కన గిరిజనులు సాంబశివ, మానస, జేసీ అభిషేక్‌గౌడ

పీ4లో మార్గదర్శిగా అల్లూరి కలెక్టర్

» బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న దినేశ్‌కుమార్
» గిరిజన బాలికను డాక్టర్ చేసేందుకు తోడ్పాటు
» ఆమె తండ్రికి వైద్యం.. వ్యాపార నిమిత్తం రుణం కూడా..
» అదే బాటలో జేసీ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్

పాడేరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పీ4(మార్గదర్శి-బంగారు కుటుంబం) కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ మార్గదర్శిగా మారారు. ఒక బంగారు(పేద) కుటుంబాన్ని ఆయన దత్తత తీసుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. పాడేరు మండలం ఐనాడ పంచాయతీ కేంద్రానికి చెందిన గిరిజనుడు వంతినిభ సాంబశివ, ఆయన కుమార్తె మానసలను తాను దత్తత తీసుకున్నట్టు దినేశ్‌కుమార్ తెలిపారు. మానస ఇంటర్‌లో చక్కని ప్రతిభ కనబరిచినప్పటికీ నీట్‌లో ఆశించిన ర్యాంకు రాకపోవడంతో చదువుకు స్వస్తి పలికారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆ బాలిక ఉన్నత చదువుకు తన వంతు సహకారం అందించడంతో పాటు ఆమె డాక్టర్ అయ్యేందుకు కృషిచేస్తానని ప్రకటించారు. ఆమె తండ్రి సాంబశివకు ఆరోగ్య, ఇతర సమస్యలు ఉన్నాయని, ఆయన ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతోపాటు సొంతంగా ఏదైనా వ్యాపారం చేసుకునేందుకు రుణం మంజూరు చేయిస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ కూడా అదే బాటలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. పాడేరు మండలం గుత్తులపుట్టులోని ఓ కుటుంబాన్ని తాను దత్తత తీసుకుంటున్నట్టు అభిషేక్‌గౌడ ప్రకటించగా, తన కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఫాతిమా కుటుంబాన్ని దత్తత తీసుకునేందుకు శౌర్యమన్‌పటేల్ ముందుకువచ్చారు.

ఏపీ, తెలంగాణ జల విద్యుత్ వివాదంపై విచారణ 19కి వాయిదా

» సుప్రీంలో ఏపీ ప్రభుత్వం పిటిషన్లు

న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నెలకొన్న జల విద్యుత్ వివాదంపై విచారణను సుప్రీంకోర్టు వచ్చే నెల 19వ తేదీకి వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం అనుమతులు లేకుండా విద్యుదుత్పత్తి చేస్తోందంటూ 2021 ఏడాది మొదట్లో కేంద్రానికి ఏపీ ఫిర్యాదు చేసింది. అదే ఏడాది జూలై 14న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే జల విద్యుదుత్పత్తిపై తెలంగాణ సర్కారు జారీ చేసిన జీవో 34ను రద్దు చేయాలని కోరుతూ గతేడాది సెప్టెంబరు 7న సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేసింది. ఆ రెండు పిటిషన్లను కలిపి సోమవారం జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ అంశంలో సుదీర్ఘ వాదనలు వినాల్సిన అవసరం ఉన్నందున కేసు విచారణను వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.

'హద్దులు' చెరిపి..

జగన్ సర్వేరాళ్ల బిల్లుల కోసం వైసీపీ నేత ఎత్తు

» కూటమి నేతలతో చెలిమికి తీవ్ర ప్రయత్నాలు
» వైసీపీ హయాంలో అడ్డగోలుగా కాంట్రాక్ట్ పట్టారు
» చాలావరకు బిల్లులు అప్పుడే లాగేసుకున్నారు
» మిగతాదీ రాబట్టుకునేందుకు వింత విన్యాసం
» గుంటూరు జిల్లాలో ఆ నాయకుని తీరుపై చర్చ

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

జగనన్న భూరక్ష పేరుతో ఆనాడు చేపట్టిన హద్దు రాళ్ల సరఫరా కాంట్రాక్టును ఆయన చేజిక్కించుకుని.. చాలావరకు బిల్లులు చేరుకున్నారు. ఇంకా తనకు ఆరు కోట్లు రావాల్సి ఉందని చెబుతున్న ఆయన.. ఆ మొత్తం రాబట్టుకునేందుకు వింత రాజకీయ విన్యాసం మొదలు పెట్టారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులతో సఖ్యతగా ఉండేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. దీనికోసం గుంటూరు జిల్లా సమీక్షామండలి, జిల్లాపరిషత్తు తదితర సమావేశాలకు ఠంచనుగా హాజరవుతున్నారని తెలిసింది. ఒకదశలో ఆయన వైసీపీని వీడతారని కూడా ప్రచారం జరిగింది. ఆయన సన్నిహితులు ఇప్పటికే టీడీపీలో చేరిపోయారు. ఆ వివరాల్లోకి వెళితే.. జగనన్న భూరక్ష పథకం అమలులో నాటి జగన్ ప్రభుత్వం అన్ని నిబంధనలను తుంగలోకి తొక్కింది. గుంటూరు జిల్లాలో 58 గ్రామాల్లో రీసర్వే చేసి 83,770 హద్దురాళ్లను జగన్ బొమ్మతో ఏర్పాటు చేసింది. అలానే బాపట్ల జిల్లాలో 110 గ్రామాల్లో 1,60,147 హద్దురాళ్లను రైతుల భూముల్లో పాతింది. పల్నాడు జిల్లాలో అయితే అత్యధికంగా 214 గ్రామాల్లో 4 లక్షల 16 వేల 64 హద్దు రాళ్లను వేసింది. ఇందుకోసం రూ. 55 కోట్ల వరకు ఖర్చు పెట్టినట్లు సమాచారం. సాధారణంగా ప్రభుత్వం ఏదైనా పనిని చేపట్టాలన్నా, ఏవైనా సమకూర్చుకోవాలన్నా ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని అవలంబించాలి. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్వే హద్దురాళ్ల సరఫరా చేసేందుకు ఆ పార్టీకి చెందిన నేతలకే దక్కేలా నిబంధనలను సవరించారు. వేరొకరిని టెండర్లు వేయకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ఆ విధంగా కొన్ని జిల్లాలకు సర్వే హద్దు రాళ్ల సరఫరా చేసే కాంట్రాక్టుని గుంటూరు నగరానికి చెందిన ఆ వైసీపీ నేతకు దక్కిం ది. వైసీపీ ప్రభుత్వంలో ఆయన నామినేటెడ్ పదవులు పొందారు. 2019 ఎన్నికల సమయంలో తాను ఆర్థికంగా నష్టపోయానని చెప్పి గుట్టుచప్పుడు కాకుండా భూముల రీసర్వే ప్రాజెక్టులో హద్దురాళ్ల సరఫరా కాంట్రాక్టును పొందారు. ప్రకాశం జిల్లా బల్లికురవలో ఒక ఫ్యాక్టరీని తీసుకొని హద్దురాళ్లను కొన్ని జిల్లాలకు సరఫరా చేశారు. ఈ క్రమంలో తాడేపల్లి ప్యాలెస్‌కు కూడా పర్సంటేజీలు చేరాయి. ఆయన ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకొని ప్రకాశం జిల్లా బల్లికురవలోని గనుల నుంచి ముడి పదార్థాన్ని సేకరించి అక్కడే హద్దురాళ్లను తయారు చేసి వాటిపై జగన్ బొమ్మలు ముద్రించి సరఫరా చేశారు. ఇందుకోసం రూ. కోట్లలోనే లబ్ధి పొందారు. బిల్లులను ఎన్నికలకు ముందుగానే పాస్ చేయించుకొన్నారు. కొన్ని పెండింగ్‌లో ఉండటంతో ఎలాగైనా పొందాలన్న ఉద్దేశంతోనే ఆయన కూటమి నేతలతో సఖ్యతగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతున్నది.

వీఐపీలు ఏడాదిలో ఒక్కసారే తిరుమలకు రావాలి

» అప్పుడే మరింతమంది సామాన్యులకు శ్రీవారి దర్శనం లభిస్తుంది
» దేవస్థానం నిధుల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు
» మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు


శ్రీవారి ఆలయం వెలుపల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తిరుమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): వీఐపీలు సంవత్సరానికి ఒక్కసారే శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు రావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. అప్పుడే మరింత మంది సామాన్య భక్తులకు దర్శన అవకాశం లభిస్తుందని చెప్పారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిరోజు సుమారు 80 వేల మందికి దర్శనం కల్పిస్తున్నామని టీటీడీ అధికారులు చెబుతున్నారని అన్నారు. బయట ఎన్ని ఏర్పాట్లు చేసినా ఆలయంలోపల దర్శనానికి ఉండే సమయం, స్థలం మాత్రం పరిమితంగానే ఉందనే విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వీఐపీలు తమ వారిని పరిమితంగా తీసుకురావడం, ఏడాదిలో ఒక్కసారే వచ్చే పద్ధతిని పెట్టుకోవడం వంటివి చేస్తే ఆలయ నిర్వహణకు ఇబ్బంది కలగకుండా ఉంటుందని సలహా ఇచ్చారు. ప్రజాప్రతినిధులు దేవాలయాలకు వచ్చినప్పుడు మరింత బాధ్యతగా, హుందాగా వ్యవహరించాలన్నారు. భక్తులు సమర్పించే కానుకలను పూర్తిగా ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, భక్తుల సౌకర్యాల కల్పనకే ప్రధానంగా ఖర్చు చేయాలన్నారు. దేవస్థానం నిధుల్లో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. హిందూ ధార్మిక ఆలోచనలు మరింత పెంపొందించాలన్నదే హుండీలో కానుకలు సమర్పించడం వెనుకున్న ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకే మన ప్రాచీన సంప్రదాయం ప్రకారం ప్రతి ఊరిలో ఒక గుడి ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల కోసం ప్రముఖ దేవస్థానాలు, ముఖ్యంగా టీటీడీ వంటివి ముందుకు రావాలన్నారు. గుడి, బడి లేని ఊరు ఉండకూడదన్నారు. బడి కట్టించడం ప్రభుత్వ కర్తవ్యమని, గుడి కట్టించడం భక్తులు, దేవస్థానాల ప్రధాన కర్తవ్యం కావాలన్నారు. దేవస్థానం నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించడంతో పాటు ఇతర వాటికి మళ్లించాలనే ఆలోచన చేయకూడదన్నారు. స్వామిని దర్శించుకున్న వెంకయ్యనాయుడికి రంగ నాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.

మరో 20 ఏళ్ల వరకూ వైసీపీకి అధికారం దక్కదు

» సహనం, ఓర్పుతో ఉన్నవారికే పదవులు
» వ్యక్తిగత స్వార్థంతో కూటమిలో విభేదాలు సృష్టించొద్దు
» నెలలో ఐదు నుంచి పది రోజులు ఉత్తరాంధ్రలో ఉంటా
» కార్యకర్తల సమావేశంలో జనసేన ఎమ్మెల్సీ నాగబాబు


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ఎమ్మెల్సీ నాగబాబు. చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, పంచకర్ల, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు తదితరులు

విశాఖపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఇంకో ఇరవై ఏళ్ల వరకూ వైసీపీకి అధికారం దక్కదు. కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది' అని జనసేన ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. "వైసీపీ అనేక కుట్రలు చేస్తోంది. వాటిని తిప్పికొట్టాలి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. కల్తీ మద్యంతో అనేక మంది ప్రాణాలు బలిగొన్నారు. వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసం కూటమిలో ఎవరూ చిచ్చు పెట్టవద్దు. అధికారంలోకి వచ్చి ఇంకా ఏడాది మాత్రమే అయింది. అందరికీ పదవులు లభించాలంటే కొంతకాలం ఓపిక పట్టాలి. ఓర్పు ఉన్నవారే గొప్ప నాయకులు అవుతారు. కూటమి మరో 20 ఏళ్లు బలంగా ఉంటుంది. బీజేపీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు స్పష్టమైన అవగాహనతో రాష్ట్ర శ్రేయస్సు కోసం పనిచేస్తున్నారు. వారికి అండగా ఉండాలి. కులమతాలకు అతీతంగా తీసిన 'హరిహర వీరమల్లు' సినిమాపై కూడా వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారు. వాటిని తిప్పి కొట్టాలి. వైసీపీయే ప్రధాన శత్రువు. ఆ పార్టీ మీదే పోరాటం చేయాలి. నేను ఉత్తరాంధ్ర ప్రజలకు అందుబాటులో ఉంటా. ప్రతి నెలా ఇక్కడకు వచ్చి ఐదు నుంచి పది రోజులు ఉంటా. ప్రతి కార్యకర్తను కలుస్తా. నా ఎమ్మెల్సీ కోటాలో వచ్చే నిధులు ఉత్తరాంధ్ర అభివృద్ధికే ఉపయోగిస్తా" అని నాగబాబు అన్నారు. ఈ సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ డీసీసీబీ అధ్యక్షులు కోన తాతారావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మార్పులేని మణిపూర్

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతిపాలనను మరో ఆర్నెల్లు పొడిగించాలని కేంద్రం నిర్ణయించుకుంది. రాష్ట్రంలో పరిస్థితులు మెరుగుపడ్డాయన్న కేంద్రం వాదన సరైనదే అయినప్పుడు ఈ కొనసాగింపు అవసరం నిజానికి ఉండకూడదు. పగ్గాలు మరో ఆర్నెల్లు కేంద్రం చేతిలోనే ఉండాలని అనుకుంటున్నారంటే, రాష్ట్రం ఇంకా గాడినపడలేదని ఒప్పుకున్నట్టే. తమకు ఎంతో ప్రీతిపాత్రుడైన బీరేన్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికంటే మణిపూర్ తొలి ఆర్నెల్ల రాష్ట్రపతి పాలనలో మెరుగుపడిందనీ, మరికొంతకాలం ఇలాగే తమ చేతుల్లోనే కొనసాగితే పూర్తిగా బాగుపడిపోతుందని కేంద్రం తాను నమ్ముతూ, మననూ నమ్మమంటున్నదేమో!

వచ్చే ఏడాది ఫిబ్రవరి 13వరకూ వర్తించబోయే ఈ కొనసాగింపుతో మణిపూర్ ఏడాది రాష్ట్రపతిపాలన పూర్తిచేసుకుంటుంది. రెండేళ్లపాటు మతాల మధ్య చిచ్చురాజేసి, రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చేసిన ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఈ ఏడాది ఫిబ్రవరి 13న రాజీనామా చేయడంతోనే రాష్ట్రపతిపాలన అమలులోకి వచ్చింది. ప్రభుత్వ వ్యవస్థలన్నీ కుప్పకూలి, యంత్రాంగం నిర్వీర్యమై, అరాచకం ప్రబలిపోవడంతో ఇక నేరుగా రాష్ట్రాన్ని గుప్పిట్లోకి తీసుకోకతప్పదని కేంద్రం భావించింది. సంక్షోభ నివారణకు ఉద్దేశించిన తాత్కాలిక చర్యగా ప్రజలు రాష్ట్రపతిపాలనను భావిస్తారు కనుక, సాధ్యమైనంత త్వరలో దానిని ఎత్తివేసి ప్రజాప్రభుత్వాన్ని నెలకొల్పే పని మొదలవుతుందని కూడా ఆశిస్తారు. అయితే, మణిపూర్ విషయంలో కేంద్రం నిర్ణయం ఇందుకు విరుద్ధంగా ఉన్నందున, రాష్ట్రంలో శాంతిభద్రతలను ప్రతిష్ఠించి, సమాజాన్ని సాధారణస్థితికి తెచ్చే కృషిలో ప్రభుత్వ ప్రయత్నాలు పరిపూర్ణంగా ఫలించలేదని అనుకోవాలి.

బీరేన్‌సింగ్ దిగినవెంటనే రాష్ట్రంలో పరిస్థితులు మారిపోతాయన్న భ్రమలు ఎవరికీ లేవు. ఆఖరునిముషం వరకూ ఆయన ముఖ్యమంత్రిగా కాక, ఒక మీతీ నాయకుడిలాగానే వ్యవహరించడంతో, రాష్ట్రం మతవిద్వేషాలతో భగ్గుమన్నది, మీతీలకూ కుకీ–జో తెగలకు మధ్య అవిశ్వాసం పతాకస్థాయికి చేరింది. పోలీసు బలగాలను మీతీ మిలిటెంట్ గ్రూపుల జోలికి పోకుండా నిరోధించారాయన. 'వాళ్ళను ఆయుధాలు దోచుకోనివ్వండి' అంటూ మీతీలపక్షాన ఆయన చేసిన వ్యాఖ్యలు ఆడియోటేపుల రూపంలో లీకై, వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ పోయి, ఆ గొంతు బీరేన్‌దేనని నిర్ధారణ జరిగి, తనతోపాటు బీజేపీ పెద్దలు పరువుకూడా తీశారు. బీరేన్‌ను తప్పిస్తే తప్ప, హింసకు అడ్డుకట్టపడదని, పరిస్థితులు మారవని మీతీయేతర జాతులూ తెగలూ 2023 నుంచీ మొత్తుకుంటూనే ఉన్నాయి. అయినా, ఢిల్లీ పెద్దలు దిగిరాలేదు. రెండేళ్ళపాటు ఆయన చిత్తం వచ్చినట్టు వ్యవహరించాడు. ఎప్పుడైతే బీరేన్‌కు వ్యతిరేకంగా పార్టీలోనే నిప్పురాజుకొని, స్పీకర్ కేంద్రంగా తిరుగుబాటు రాజకీయం సాగి, కాంగ్రెస్ ఎత్తులతో బీజేపీప్రభుత్వం కూలిపోవడం ఖాయమని తేలిపోయిందో, కేంద్రం ఆయనను నిర్దాక్షిణ్యంగా వదిలించుకుంది. అవిశ్వాసతీర్మానానికి తావులేకుండా ఢిల్లీపెద్దలు రాష్ట్రపతిపాలన విధించి, రాష్ట్రం చేజారిపోకుండా జాగ్రత్తపడ్డారు. బీరేన్ నిష్క్రమణ తరువాత, హింస క్రమంగా నియంత్రణలోకి వచ్చింది, ఆయుధాల స్వాధీనం కూడా జోరందుకుంది. ఇటీవల మీతీ రాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' నాయకుడు కనాన్ సింగ్‌ను సైతం సీబీఐ అరెస్టు చేసింది. అప్పుడు కాస్తంత హింస రేగినా, గతంతో పోల్చితే మీతీల జోరుతగ్గి, కుకీ–జో తెగల విశ్వాసం పెరిగింది.

సాధ్యమైనంత త్వరలో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడుతుందని, అందుకు కేంద్రహోంమంత్రి సానుకూలంగా ఉన్నారని బీరేన్‌సింగ్ ఈ మధ్య తరచుగా తెరమీద కనిపిస్తూ హామీలు ఇస్తున్నారు. తొలి ఆర్నెల్ల రాష్ట్రపతిపాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడినప్పటికీ, బీరేన్ కారణంగా నిలువునా చీలిన సమాజాన్ని దగ్గరచేసే ప్రయత్నాలు జరగలేదు. పౌరసమాజ భాగస్వామ్యంతో పాటు, రాష్ట్రంలో రాజకీయవాతావరణం నెలకొన్నపక్షంలో ఆ అగాధాన్ని పూడ్చడానికి వీలుపడుతుంది. సాధ్యమైనంత వేగంగా రాష్ట్రపతి పాలనకు స్వస్తిచెప్పి, అన్ని జాతులు, తెగల సముచిత ప్రాతినిధ్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినపక్షంలో మణిపూర్‌లో మార్పు చూడగలం.

శోకధ్రువ ప్రపంచంలో గాజాకాష్ఠం!

గాజాను తలచుకుంటే తల తిరిగి పడిపోతామేమో, గుండె పగిలి చస్తామేమో నన్న భయంతో ప్రపంచం అటువైపు కన్నెత్తి చూడడం లేదనిపిస్తోంది. ఇరవై మాసాల కాలంలో 70,000 మందిని, అత్యధికంగా పిల్లలను, మహిళలను బలి తీసుకున్న ఇజ్రాయెల్, దాని వెన్నుదన్ను అమెరికా అచ్చోసిన ఆంబోతుల్లా విశ్వం నడివీధుల్లో బోర విరుచుకు తిరుగుతున్నాయి. ఈ ఘన కార్యానికి గాను ట్రంప్‌కి ఈ ఏడాది నోబెల్ బహుమతి ఇవ్వాలని నరహంతకుల్లో నంబర్ వన్ జాబితాలో చేరిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సిఫారసు చేశాడు, పులికి తోడేలు వంత పాడినట్టు!

గాజా నేడొక నరరక్త జీవనది. ఈ రోజుటి లెక్క రేపటికి మాయమై మృతుల కొత్త సంఖ్య తెర మీదికి వస్తున్నది. చైనా, రష్యా సహా ఎవరూ దీనికి అడ్డుకట్ట వేయలేక పోవడం కంటే దయనీయస్థితి ఉండదు. అందుకే గాజాలో ఈ నిరంతర అగ్నివర్షం ఒక కలలా అనిపిస్తున్నది, మనం మానవేతర అమానుష సమాజంలో బతుకుతున్నామనే నమ్మలేని నిజం కళ్లకు కడుతున్నది. ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలతో అమెరికా విశ్వవిద్యాలయాలు అట్టుడికి పోతే ట్రంప్ ప్రభుత్వం ఆ ప్రదర్శనలలో పాల్గొన్న విదేశీ విద్యార్థులను బంధించి స్వదేశాలకు పంపించివేయటమే గాక, హార్వర్డ్ వర్సిటీకి నిధులను నిలిపివేసింది. కొలంబియా, కార్నల్, నార్త్ వెస్ట్రన్ వంటి ప్రముఖ కళాశాలలపై కక్షతో వ్యవహరించింది. గాజన్ల రక్తంలో ట్రంప్ తనివితీరా స్నానం చేయడం ఎంతవరకు వెళ్లిందంటే వేలాదిమంది పాలస్తీనియన్లను బలి తీసుకోవడాన్ని ఖండించిన ఐక్యరాజ్యసమితి నియమిత హక్కుల స్వతంత్ర ఉద్యమకారిణి ఫ్రాన్సెస్కా ఆల్బనీస్‌పై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది.

ట్రంప్ రెండోసారి సారథ్యంలో అమెరికా తన పునాది ఆదర్శాలైన స్వేచ్ఛ, అవకాశాలు, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, సమానత్వం అనే మహత్తర అంశాలకు స్వస్తి చెబుతున్నది. ఒకప్పుడు అలీనోద్యమాన్ని నిర్మించిన ఇండియా ఇప్పుడు ట్రంప్‌కి ఇజ్రాయెల్‌కి దాసోహమంటున్నది. అమానుషాలను ప్రతిఘటించడంలో ప్రపంచం రోజురోజుకీ బలహీనమైపోతున్నది. దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సంఘటితం కాలేకపోతున్న అశక్తత నలువైపులా తాండవిస్తున్నది. దీనికి కారణాలను వెతికి అరికట్టకపోతే పాత రాచరికాలు ఆధునిక రూపంలో తిరిగి పుంజుకునే ప్రమాదం కనిపిస్తున్నది. అప్పుడు నియమబద్ధ అంతర్జాతీయ వ్యవస్థకు అంతిమ దినాలు దాపురిస్తాయి. ట్రంప్ ఆగ్రహ అనుగ్రహాలను బట్టి ప్రతి ఒక్కరూ బతకవలసి వస్తుంది. ట్రిగ్గర్ మీద వేలుపెట్టి దేశదేశాలను భయపెడుతున్న ట్రంప్ విధానాలను అదుపులో ఉంచే దిశగా మానవాళి లోతుగా ఆలోచించాలి. జనరల్ అసెంబ్లీ అభీష్టాన్ని కాలరాసే భద్రతా మండలికి శాశ్వతంగా తెరపడాలి.

బలవంతులు యూదు మత విశ్వాసాల ఆధారంగా ఇజ్రాయెల్ దేశానికి పాలస్తీనాలో ఉనికి కల్పించినప్పుడు అరబ్ దేశాలు సంఘటితంగా ప్రతిఘటించాయి. ఈజిప్ట్, సిరియా, లెబనాన్, ఇరాక్‌లు అరబ్ లీగ్ పతాకం కింద పోరాడాయి. అటువంటి అరబ్ ఐక్యత ఇప్పుడు గాలికి



ఏ దేశ సార్వభౌమాధికార పరిధులనూ గౌరవించే సంస్కారం, మర్యాద అమెరికాకు లేవు. ట్రిగ్గర్ మీద వేలుపెట్టి దేశదేశాలను భయపెడుతున్న ట్రంప్ విధానాలను అదుపులో ఉంచే దిశగా మానవాళి లోతుగా ఆలోచించాలి. నాటి సోవియట్ యూనియన్‌లా అమెరికాకు ఒక ప్రత్యామ్నాయ ధ్రువం తయారు కావడం నేటి తక్షణావసరం. కనీసం అలీనోద్యమం మాదిరిగా శాంతికాముక దేశాలన్నీ ఏకమై ట్రంపరితనాన్ని గట్టిగా ఎదిరించాలి. పిల్లి మెడపై కత్తిని వేలాడదీసే ఎలుకలు కావాలిప్పుడు.

పేలపిండి అయిపోయింది. వాస్తవానికి యూదులకు అవసరమైన దానికంటే ఎక్కువ పాలస్తీనా భూభాగాన్ని మొదట్లోనే వారికి కట్టబెట్టారు. అప్పట్లో పాలస్తీనా జనాభాలో సగం మంది కంటే తక్కువమందిగా ఉన్న యూదులకు సగం పాలస్తీనా కంటే ఎక్కువ భూభాగం లభించింది. 1967లో ఆరు రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్ తన భూభాగాన్ని విశేషంగా విస్తరించుకున్నది. జోర్డాన్, ఈజిప్ట్, సిరియాలలో భాగాలను, జెరూసలేం పాత నగరాన్ని, సినాయి ద్వీపకల్పాన్ని, గాజాను, జోర్డాన్ నది పశ్చిమ తీరాన్ని, గోలన్ హైట్స్‌ను దురాక్రమించుకున్నది. అగ్గికి ఆజ్యంలా టెల్ అవివ్‌కి బదులు జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించి అమెరికా తన రాయబార కార్యాలయాన్ని అక్కడికి తరలించింది.

ఇజ్రాయెల్ పుట్టినప్పటి నుంచి ఇంతవరకు అమెరికా దానికి చేసిన సాయం 300 బిలియన్ డాలర్ల దాకా ఉంటుంది. ఇందులో ఎక్కువ భాగం సైనిక సాయమే. 2023 అక్టోబర్ 7న హమాస్ మెరుపు దాడి చేసిన తర్వాత ఇజ్రాయెల్‌కు అమెరికా చేసిన అదనపు సైనిక సాయం విలువ 4.86 బిలియన్ డాలర్లు. మరొక సమాచారం ప్రకారం 2023 అక్టోబర్ 7 అనంతరం ఇజ్రాయెల్‌కు అమెరికా 17.19 బిలియన్ డాలర్ల సైనిక సాయం అందించడానికి నిర్ణయించింది. ఈ పొగరుతో ఇజ్రాయెల్ ఒక్క పాలస్తీనియన్ల పైనే కాదు ఇతర అరబ్ దేశాలపైనా దాడులకు దిగుతోంది. తాజాగా, సిరియాలోని డ్రూజ్ అనే మైనారిటీ వర్గంతో శాంతి చర్చలు విఫలం కావడంతో ఆ వర్గానికి దన్నుగా, సిరియా రాజధాని డమాస్కస్ పైనే ఇజ్రాయెల్ దాడులు చేపట్టింది. ఇటీవలనే ఇరాన్ నాయకులను కొందరిని హతమార్చిన అమెరికా ఇంతకుముందు 2020 జనవరిలో ట్రంప్ మొదటి విడత పరిపాలనా కాలంలో ఇరాన్ ముఖ్య సైనికాధికారి సోలేమానిని డ్రోన్ దాడి ద్వారా హత మార్చింది. మొన్న మొన్న మరికొందరు కీలక ఇరాన్ అధికారులను పొట్టనపెట్టుకున్నది. దేశాధినేత అలీ ఖమేనీనే హతమార్చాలని చూసింది. ఆయన కొన్ని రోజులు బంకర్‌లో తల దాచుకున్నారు. ఏ దేశ సార్వభౌమాధికార పరిధులనూ గౌరవించే సంస్కారం, మర్యాద అమెరికాకు లేవు. దానిని, దాని విష పుత్రిక ఇజ్రాయెల్‌నూ ఎదుర్కోడం దక్షిణాసియా దేశాలకు సాధ్యం కాదు. అక్కడి పాలకులు తమ ప్రజల్లోని పోరాట శక్తిని తామే చంపివేస్తున్నారు. దీనికి తోడు అంతటా ఆవహించిన పెట్టుబడిదారీ మారణాస్త్రమైన వినియోగ సంస్కృతి అక్కడా వేళ్లూనుకున్నది.

వాస్తవానికి ప్రపంచ ఆయిల్ నిల్వలలో అధిక శాతం ఉన్న పశ్చిమాసియా దేశాలు ఆర్థికంగా అత్యంత బల సంపన్నమైనవి. ప్రపంచ చమురు నిల్వల్లో 60 శాతం వరకు పశ్చిమాసియాలో ఉన్నాయని కొన్ని అంచనాలు చెబుతున్నాయి. అత్యధికంగా ఆయిల్ నిల్వలున్నది సౌదీ అరేబియా కాగా దానికి చేరువలో ఆ తర్వాత స్థానంలో ఇరాన్ ఉన్నది. ఇంకా ఇరాక్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కతర్, ఒమన్ తదితర దేశాల్లో ఆయిల్ నిల్వలు దండిగా ఉన్నాయి. ఇంత ఆర్థిక శక్తి ఉన్నందుకు, ఇందుకు తగ్గట్టు పరిశోధన రంగంలో ముందుండి అంతర్గత విభేదాలు లేకుండా ఉండి ఉంటే పశ్చిమాసియా దేశాలు అమెరికా సహా మొత్తం ప్రపంచాన్ని చెప్పుచేతల్లో ఉంచుకోగలిగేవి. ప్రధాన ఆయిల్ ఉత్పత్తి దేశాలు సౌదీ, ఇరాన్‌ల మధ్య నిన్న మొన్నటి వరకు వైషమ్యాలు తీవ్ర స్థాయిలో ఉండేవి. ఈ రెండింటి మధ్య గల సున్నీ (సౌదీ) షియా (ఇరాన్) తేడాలను అమెరికా వాడుకుంటూ వచ్చింది. సౌదీ అరేబియా అమెరికా జేబులో బొమ్మగా అమరిపోతే అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇరాన్ సవాలుగా నిలబడింది. చైనా చొరవతో ఇటీవలనే ఈ రెండు దిగ్గజ దేశాలు దగ్గర అవుతుండడం మంచి పరిణామం.


ఒకవైపు ఆయుధ బలంతో ఇంకోవైపు సుంకాల అంకుశాలతో ట్రంప్ దేశ దేశాలను వణికిస్తున్నాడు. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమాన్ని అడ్డుకునే నెపంతో అమెరికా దానిపై ఆంక్షలు విధించి దాడులకు తెగబడుతున్నది. ఇంకోవైపు అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌కు లొంగిపోయేలా చేసే ఎత్తుగడను పాటిస్తున్నది. ఈజిప్ట్–ఇజ్రాయెల్ మధ్య అమెరికా ప్రోత్సాహంతో 1977లోనే శాంతి ఒప్పందం కుదిరింది. అప్పుడు ఈజిప్ట్ అధినేత అన్వర్ సాదత్ ఒక గొప్ప సత్యాన్ని చెప్పాడు. "మధ్య (దక్షిణాసియా) ప్రాచ్యంలో 99శాతం కార్డులు వాషింగ్టన్ చేతుల్లో ఉన్నాయి. సోవియట్ యూనియన్ కుప్ప కూలడం ఆ ప్రాంతాన్నంతటినీ అమెరికా చెప్పుచేతల్లోకి నెట్టివేసింది" అని సాదత్ తేల్చి చెప్పాడు. అరబ్–ఇజ్రాయెల్ మధ్య అమెరికా కుదిర్చిన ప్రతి ఒప్పందం ఇజ్రాయెల్ శక్తిని పెంచి పాలస్తీనాను, అరబ్ ఐక్యతను దారుణంగా దెబ్బతీసింది. పాలస్తీనా అథారిటీ (పీఏ) పట్టు కోల్పోయి హమాస్‌ను అక్కడి ప్రజలు నమ్మడం బలపడిన తర్వాత వారి మధ్య అనైక్యతను చూపి అరబ్ దేశాలు పాలస్తీనా పోరాటానికి మద్దతు తగ్గించివేశాయి.

అరబ్–ఇజ్రాయెల్ మధ్య 2020లో ట్రంప్ ప్రభుత్వం కుదిర్చిన అబ్రహామ్ ఒప్పందాలు అరబ్ ఐక్యతకు పూర్తిగా తెరదించి పాలస్తీనా ప్రజలను దిక్కు మొక్కు లేనివారుగా చేశాయి. చైనా తర్వాత అయినా మరో దృఢమైన శక్తిగా ఎదగాలని చూస్తున్న ఇండియా కలలను సైతం ట్రంప్ కాల రాస్తున్నాడు. మోదీతో స్నేహం ట్రంప్ మోసకారి నాటకమే అనడానికి నిదర్శనం రష్యా ఆయిల్ కొంటున్నందుకు ట్రంప్ 100 శాతం సుంకాలు విధించదలచిన దేశాల్లో ఇండియా కూడా ఉండడమే. మరోవైపు యూరప్ దేశాలనూ ఆయన భయపెడుతున్నాడు. ఉక్రెయిన్ విషయంలో ఆయన తీసుకున్న విధానం దీనిని ఎత్తిచూపుతున్నది. అందుచేత ఇప్పుడు ప్రపంచం తక్షణం పట్టించుకోవలసిన విషయం– ప్రతి రోజూ 50 నుంచి 100 దాకా స్త్రీలూ, పిల్లల ప్రాణాలను అమెరికా–ఇజ్రాయెల్‌లకు బలి ఇచ్చుకుంటున్న గాజాను ఈ నర రక్త వరద నది నుంచి కాపాడడం. అంతేగాక నాటి సోవియట్ యూనియన్‌లా అమెరికాకు ఒక ప్రత్యామ్నాయ ధ్రువం తయారు కావడం నేటి తక్షణావసరం. కనీసం అలీనోద్యమం మాదిరిగా శాంతి కాముక దేశాలన్నీ ఏకమై ట్రంపరితనాన్ని గట్టిగా ఎదిరించాలి. పిల్లి మెడపై కత్తిని వేలాడదీసే ఎలుకలు కావాలిప్పుడు.

■ గార శ్రీరామమూర్తి
సీనియర్ పాత్రికేయులు

అమెరికా 'రియల్' సంక్షోభంలో మన ఎన్నారైలు

కొంతకాలం కిందట అమెరికాలో రియల్ ఎస్టేట్ గృహాల కొనుగోళ్లు ఒక ఉద్యమంలా నడిచాయి. కరోనా దెబ్బకు వర్క్ ఫ్రం హోం కల్చర్ వచ్చిన తర్వాత 'మూన్ లైటింగ్' పేరుతో ఏకకాలంలో రెండు మూడు ఉద్యోగాలు చేస్తూ ఇబ్బడిముబ్బడిగా సంపాదించినవారు చాలామంది ఉన్నారు. వారు ఆర్జన మొత్తం నగదుగా ఉంటే వృథా అయిపోతుందని జాగ్రత్త పడి ఇళ్లు కొనడం మొదలుపెట్టారు. అవన్నీ కూడా లోన్ ద్వారా ఈఎంఐలతో కొన్న ఇళ్లు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగ ముఖచిత్రం ఇప్పుడు సమూలంగా మారిపోయింది. పెద్ద ఉద్యోగాల్లో ఉంటున్నవారు కూడా ఎంతకాలం స్థిరంగా ఆ స్థాయిలో ఉండగలమో చెప్పలేమని ఆందోళన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో ఇళ్లు కొన్న చాలామంది ఇప్పుడు వాటిని అమ్మకానికి పెడుతున్నారు. అలాగే ఉద్యోగంలో ఉన్నప్పుడు ఇల్లు కొనేశాక, లేఆఫ్‌లు అయిన సందర్భాల్లో, మరొక ఉద్యోగం వెతుక్కునేలోగా రుణానికి ఈఎంఐలు కడుతూ ఆస్తిని నిలుపుకోలేకపోతున్నారు. ఒత్తిడికి గురవుతున్నారు. అమెరికాలో ప్రస్తుతం కుదేలవుతున్న రియల్ ఎస్టేట్, గృహనిర్మాణరంగం ఇక్కడి భారతీయ సమాజంపై తీవ్ర ప్రభావాన్నే చూపుతోంది. తగు జాగ్రత్తలు తీసుకోకుండా ఇళ్లు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు వాటిని అమ్ముకోవడం వీలుకాక అగచాట్లు పడుతున్నారు.



ఐటీ వాతావరణం నెమ్మదించిన తర్వాత ఇళ్ల కొనుగోళ్లకు రుణాలు పుట్టడం గగనంగా మారుతున్నది. ప్రత్యేకించి భారతీయ సమాజానికి ఈ పోకడ తీవ్రత బాగా తెలుస్తోంది. గతంలో చెల్లింపుల్లో తేడా వస్తే ఇల్లు దక్కుతుంది గనుక రుణసంస్థలు రుణాలు ఇచ్చేందుకు వెనకాడేవి కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. రుణాలు కట్టలేని వారి నుంచి ఇళ్లను స్వాధీనం చేసుకున్నా వాటిని మళ్లీ అమ్ముకోవడం ఆ సంస్థలకు కూడా భారమే. అందుకే ఆచితూచి అప్పులిస్తున్నాయి.

కరోనా కాలంలో గృహ కొనుగోలుకు రుణాలిచ్చే సంస్థలు చాలా ఉదారంగా వ్యవహరించాయి. అప్పట్లో ఉన్న పరిస్థితుల్లో ఆ సంస్థల వ్యాపారం మొత్తం శవాసనం వేసింది గనుక కొత్త కస్టమర్లను ఆకర్షించడానికి అతి తక్కువ వడ్డీరేట్లకు రుణాలు ఆఫర్ చేశారు. ఆ రోజుల్లో 2శాతం వడ్డీ వంతున తీసుకున్న రుణాలకే, వినియోగదారులు ఇప్పుడు 7శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఎందుకంటే కొత్త వినియోగదార్లను ఆకర్షించడానికి అడ్జస్టబుల్ మార్ట్‌గేజ్ విధానాల్లో రెండుమూడేళ్ల పాటు మాత్రమే తక్కువ వడ్డీ వర్తించేలా రుణాలిచ్చారు. ఏదైతేనేం వడ్డీ తక్కువ కదా అని ఇళ్లు కొన్నవాళ్లు, వడ్డీలు పెరిగిన తర్వాత భరించలేకపోతున్నారు.

తాహతు చూసుకోకుండా ఇళ్లు కొనేసి ఇబ్బందులు కొనితెచ్చుకోవడానికి మరో కారణం కూడా ఉంది. అమెరికాకు పిల్లల్ని పంపిన, భారతీయ నగరాల్లోని తల్లిదండ్రులు "అక్కడ ఎప్పుడు ఇల్లు కొంటున్నావు" అంటూ వెంటపడతారు. పరిచయస్తుల్లో ఎవరి పిల్లలైనా ఇల్లు కొంటే వెంటనే తమ పిల్లలను కూడా ఇల్లు కొనాలని ప్రేరేపిస్తున్నారు. ఇలాంటి ఒత్తిడుల మధ్య అవసరాన్ని, తాహతును చూసుకోకుండా ఇల్లు కొనేసిన వాళ్లు ఇప్పుడు అమ్మకాలకు సిద్ధమవుతున్నారు. అమ్మేవాళ్లు రోజురోజుకూ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నారు గానీ కొనేవాళ్లే కనిపించడం లేదు. ఇందుకు మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. ఐటీ వాతావరణం నెమ్మదించిన తర్వాత ఇళ్ల కొనుగోళ్లకు రుణాలు పుట్టడం గగనంగా మారుతున్నది. ప్రత్యేకించి భారతీయ సమాజానికి ఈ పోకడ తీవ్రత బాగా తెలుస్తోంది. ఇళ్ల మార్కెట్ స్తంభించడానికి ఉన్న కారణాల్లో గంటల వారీ చెల్లించే వేతనాలు బాగా తగ్గడం కూడా ఒక కారణం. హెచ్1 ఉన్న వారికి ఇప్పటికీ రుణం వస్తుంది గానీ రుణ ప్రక్రియ క్లిష్టంగా మారింది. వారి ఉద్యోగాల కాంట్రాక్టు ఎప్పటిదాకా ఉందో గమనించి గానీ రుణం ఇవ్వడం లేదు. గతంలో చెల్లింపుల్లో తేడా వస్తే ఇల్లు దక్కుతుంది గనుక రుణసంస్థలు రుణాలు ఇచ్చేందుకు వెనకాడేవి కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. రుణాలు కట్టలేని వారి నుంచి ఇళ్లను స్వాధీనం చేసుకున్నా వాటిని మళ్లీ అమ్ముకోవడం ఆ సంస్థలకు కూడా భారమే. అందుకే ఆచితూచి అప్పులిస్తున్నాయి.

ఈ సమస్యకు మూలకారణం భారతీయ సమాజం ఆలోచనా ధోరణిలో కూడా ఉన్నదని చెప్పాలి. ఎన్నారైలు ఆర్థిక ఒత్తిడిని భరించగలమా లేదా అనే ఆచరణాత్మక దృక్పథం లేకుండా కొనుగోళ్లకు వెళుతున్నారు. కొత్తగా ఉద్యోగం ప్రారంభించిన యువతరం కూడా బీఎండబ్ల్యూ, బెంజి కార్లు కొనాలనుకుంటున్నారే తప్ప మధ్యశ్రేణి కార్లను తీసుకుని, ఆర్థికంగా స్థిరపడిన తర్వాత అప్‌గ్రేడ్ అవుదాం అనుకోవడం లేదు. ఇళ్ల కొనుగోలు విషయంలోనూ ఇదే జరుగుతున్నది. తమ తాహతు చూసుకోకుండా కొనేయడం అన్నది వారిని అనివార్యంగా కష్టాల్లోకి నెడుతున్నది. ఇప్పుడు కొనకపోతే మళ్లీ ఇళ్లు దొరకవేమో అన్నంత ఆత్రంగా ఎగబడి కొంటున్నారు. నిజానికి అమెరికా చాలా విశాలమైన దేశం. అయినప్పటికీ ఇళ్ల కోసం విచక్షణ లేకుండా ఎగబడటం వలన ఇప్పుడు మార్కెట్ దారుణంగా తయారైంది.

తమ సంపాదన వృథా కాకుండా పెట్టుబడులుగా మార్చుకోవాలనుకునే ఆలోచన మంచిదే గానీ.. ఆ పెట్టుబడులను స్వదేశంలో పెట్టుకోవటం మంచిది. భారత్‌లో రియల్ ఎస్టేట్ మార్కెట్ చాలావరకు స్థిరంగా ఉంది. అమెరికాలో ఉన్నంత డోలాయమాన పరిస్థితులు లేవు. ఆచితూచి అడుగు వేస్తే నష్టపోకుండా ఉంటారు.

○ కృష్ణమోహన్ దాసరి
జర్నలిస్ట్, డల్లాస్

నవ్య నాటకబ్రహ్మ రతన్ థియాం

ప్రముఖ నాటక ప్రయోక్త, భారతీయ నాటకరంగ స్రష్ట అనదగ్గ దర్శకుడు పద్మశ్రీ రతన్ థియాం ఈ నెల 23న కన్నుమూశారు. రతన్ థియాంను పోలిష్ నాటక ప్రయోక్త గ్రోటోవిస్కితోను, బ్రిటిష్ నాటక దర్శకుడు పీటర్ బ్రూక్‌తోనూ పోలుస్తారు. థియాం బహుముఖ ప్రజ్ఞాశాలి. చిత్రకారుడు, రచయిత, మణిపురి నృత్యకారుడే కాక హిందూస్థానీ సంగీతంలోనూ ఆయన నిపుణుడు. థియాం 1948లో జన్మించారు. 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'లో శిక్షణ పొందారు (అనంతర కాలంలో ఆ సంస్థకు డైరెక్టర్‌గా పనిచేశారు). థియాం యువకుడిగా ఉన్నప్పుడు క్యూబా వెళ్లి చెగువేరాలా విప్లవకారుడు అవ్వాలి అనుకున్నారట! ఆయన నాటకాల్లో విప్లవభావాలు కనిపిస్తుంటాయి. సంప్రదాయాన్ని, సమకాలీనతను రెంటినీ థియాం సమ్మిళితం చేశారు. 70, 80వ దశకాలలో వచ్చిన 'థియేటర్ ఆఫ్ రూట్స్' ఉద్యమం ఆ కాలపు నాటక ప్రయోక్తలను ఎంతగానో ప్రభావితం చేసింది. మీతీ భాషలో థియాం రాసిన 'చక్రవ్యూహం' అనే నాటకం ఆనాటి నాటకవేత్తలకు ఓ కొత్త మార్గాన్ని చూపింది. సంస్కృత నాటక రచనను కానీ, పాశ్చాత్య రచనను కానీ థియాం తన సాంస్కృతిక నేపథ్యం నుంచి కొత్తగా చూసి, దానికి తనదైన ప్రదర్శనా భాషను అందిస్తారు. ఆయన ఇంఫాల్‌లో 'కోరస్ రిపర్టరి'ని స్థాపించారు.



ఒకసారి.. ఇబ్సెన్ రాసిన 'వెన్ వుయ్ డెడ్ అవేకెన్' ప్రదర్శనను భారత నాటకరంగ మహోత్సవంలో భాగంగా ఢిల్లీలోని కమాని ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్నారు. ఆడిటోరియం ప్రేక్షకులతో కిక్కిరిసిపోయి ఉంది. నటుల సంభాషణలు అర్థం కావడం లేదు. కానీ ప్రేక్షకులు మాత్రం నిశ్శబ్దంగా, కుతూహలంగా చూస్తున్నారు. ఒక్కో సీన్‌లోని దృశ్యాలు ప్రేక్షకులను ఓ కొత్త ఊహాలోకంలోకి తీసుకెళ్తున్నాయి. చీకటిలో, నిశ్శబ్దంలో పారదర్శకమైన కాంతి– కదులుతున్న బోటు మీదనో, ఒక ఆయుధం మీదనో, ఒక నటి తలపైనో పడుతుంటే ప్రేక్షకులు కొత్త అనుభవం పొందుతున్నారు. స్టేజీ మీద పావురాల జంటలు ఎగురుతుంటాయి. ఒక సీన్‌లో నీడలాంటి సాల్వేడార్ డాలి చిత్రం, కరిగిపోతున్న గడియారం కనిపిస్తుంది. ఇలా.. థియాం నాటకాలు చూస్తుంటే పెయింటింగ్స్ జీవం పోసుకుని కదులుతున్నట్టుగా ఉంటాయి. రతన్ థియాం నాటక ప్రయోగంలో రెండు ముఖ్యమైన అంశాలు ఉంటాయి. ఒకటి– చీకటి, రెండు– నిశ్శబ్దం. ఈ రెండూ రంగస్థలంపై చాలా ముఖ్యమైనవి. 'వెర్బల్ డ్రామా'లో చిక్కుకున్న మన నాటక పరిషత్‌లు ఆయన నాటకాల నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.

– జి.ఆర్ శివ్వాల

ప్రాంతీయ అస్తిత్వం: భ్రమలూ, వాస్తవాలూ!

'ప్రాంతేతరుల విగ్రహాల ఏర్పాటు తెలంగాణ అస్తిత్వానికి వ్యతిరేకం' అని ఈ మధ్య ఒక వార్త చదివాను. ఈ వార్త, 'తెలంగాణ పరిరక్షణ వేదిక' వారికి సంబంధించినది. "టాంక్ బండ్‌పై ఉన్న ఆంధ్ర ప్రాంత వైతాళికుల విగ్రహాలను గౌరవంగా ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని తీర్మానించారు. వాటి స్థానంలో తెలంగాణ స్ఫూర్తిప్రదాతల విగ్రహాలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు" అని కూడా, ఆ వార్తలో ఉంది. "ఇంకెన్నాళ్ళు ఆంధ్రోళ్ళకు జాగా? మాకెందుకు మీ విగ్రహాలు?" అంటూ కూడా, ఆ సమావేశం జరిగినట్టు ఆ వార్తలో ఉంది. ఆ వార్త, ప్రాంతీయ అస్తిత్వం గురించీ, దానికి ఒక గుర్తుగా భావించే విగ్రహాల గురించీ, మరోసారి ఆలోచించేలా చేస్తుంది.

ప్రాంతీయ అస్తిత్వ స్పృహ కలిగించే ఒక భ్రమ ఏమిటంటే, ఒక ప్రాంతం అంతా, ఒకే రాయినించీ చెక్కిన శిల్పం అని! ఆ భ్రమలో పడినప్పుడు, ఆ ప్రాంతంలోనే ఉన్న అసమానతలూ, వైరుధ్యాలూ కనపడవు. అవి ఏవంటే: ప్రతీ ప్రాంతంలోనూ (ప్రస్తుత విగ్రహ తరలింపు ఉద్యమకారులు ప్రస్తావిస్తున్న 'ఆంధ్రోళ్ళ'న్న ఆంధ్రప్రదేశ్‌తో సహా, అన్ని ప్రాంతాలలోనూ), ఏ శ్రమలూ చెయ్యని ఆస్తిపర వర్గాలూ– ప్రధానంగా శ్రమల మీదే జీవించే శ్రామిక వర్గాలూ ఉంటాయి. అంటే, ఒక ప్రాంతంలో జనాభా, భూములూ, పరిశ్రమలూ, గనులూ, రవాణా వంటి అనేక రకాల ఉత్పత్తి సాధనాలను ఆస్తిగా కలిగిన వారిగానూ; అవేవీ లేనివారిగానూ, ఉన్నా అతి తక్కువ స్థాయిలో కలిగివున్న వారిగానూ, విడిపోయి ఉంటారు. 'ఉన్నత స్థాయి' మేధా శ్రమలు చేసేవారూ, 'అట్టడుగు స్థాయి' శారీరక శ్రమలు చేసేవారూ ఉంటారు. ప్రతీ ప్రాంతంలోనూ, అనేక కులాలు, వాటి మధ్య ఎన్నో అసమానతలుండడమూ చూడవచ్చు. ఒకే ప్రాంతంలో, మళ్ళీ కొన్ని ప్రాంతాలు 'అభివృద్ధి' చెందినవనీ, 'వెనకబడినవి' అనీ కొన్ని తేడాలు కనిపిస్తాయి. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో, స్త్రీ–పురుష అసమానత్వమూ ఉంటుంది. స్థానికంగా ఉన్న ఇన్ని రకాల అసమానత్వాల్నీ, వైరుధ్యాల్నీ, ప్రాంతీయ అస్తిత్వ స్పృహ అనే మాయతెర కప్పివేస్తుంది. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమం జరిగిన కాలంలో, కొంత బలహీనంగానైనా, కొన్ని అసమానతల గురించీ, అణచివేతల గురించీ స్పృహ ఉండేది. అందుకే అప్పట్లో 'సామాజిక తెలంగాణ' కావాలనీ, 'ప్రజాస్వామిక తెలంగాణ' రావాలనీ, నినాదాలు కొన్ని వినవచ్చాయి. అలా అన్న ఉద్యమకారుల్లో కొందరు మేధావులు, ఆకర్షణీయమైన 'నియామకాలు' పొంది, పదేళ్ళ పాటు అప్పటి కొత్త పాలకుల ఒడిలో, బరువెక్కిన 'పర్సు'లతో, సేద తీరారు. మరికొందరు ఇప్పటి పాలకుల ఒడిలో సేద తీరుతున్నారు.


ఇప్పుడు ఈ కొత్త వార్త ప్రకారం, ఆ నినాదాలు తెరమరుగై, స్థానిక విగ్రహారాధనా నినాదం మొదలైంది. 'గౌరవంగా'నే అయినా, స్థానికేతరుల విగ్రహాలను తరలించాలన్నప్పుడు, 'ఆంధ్రోళ్ళు' మాత్రమే స్థానికేతరులా అనే ప్రశ్న వస్తుంది. తెలంగాణలో పుట్టిపెరిగిన వారు కానివారందరూ, స్థానికేతరులే అవుతారు గదా? అలాంటప్పుడు, అంబేద్కర్ విగ్రహాన్ని మధ్యప్రదేశ్‌లోని మహోవ పట్టణానికీ, పూలే విగ్రహాన్ని మహారాష్ట్రలోని పూణే నగరానికీ, జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని బిహారులోని చాంద్వా గ్రామానికీ, గాంధీ విగ్రహాన్ని గుజరాత్‌లోని పోరుబందరుకీ, ఇలా 'గౌరవంగా'నే తరలించాల్సిందే గదా?

2009లో టాంక్ బండ్ ఘటన తర్వాత, ఈ వార్త వల్ల, మరోసారి తేలింది ఏమంటే: విగ్రహాలకు ప్రాంతీయ భేదాలుంటాయి అని! అంతేకాదు, వాటికి కులపరమైనా, రాజకీయపరమైనా భేదాలూ, శతృత్వాలూ ఉంటాయి! ఈ విషయం, విగ్రహారాధకులకు తెలియనిది కాదు. దేశంలో కొన్ని చోట్ల, అంబేద్కర్ విగ్రహాల్నీ, పెరియార్ విగ్రహాల్నీ వికృత పరిచినప్పుడూ, విరగ్గొట్టినప్పుడూ; త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసినప్పుడూ, ఆ శతృత్వాల గురించి వినలేదా, చూడలేదా? యాభై ఏళ్ళనాడు, కలకత్తాలో, గత కాలపు సంఘసంస్కర్తల విగ్రహాలను, నక్సల్బరీ ఉద్యమకారులు విరగ్గొట్టలేదా?

స్థానిక విగ్రహారాధకులు అందరూ, అందరి విగ్రహాలనీ అంగీకరిస్తారని ఏమీ లేదు. వారి రాజకీయ వైఖరిని బట్టో, మత విశ్వాసాల్ని బట్టో, కులాభిమానాన్ని బట్టో, కులమతాల దామాషాలను బట్టో, వాదనలు చేసే అవకాశం ఉంది. స్ఫూర్తిప్రదాతల విగ్రహాలలో 'ఫలానా మతం వారివి ఇన్నీ, ఫలానా కులం వారివి ఇన్నీ, మళ్ళీ అందులో ఫలానా వారే స్ఫూర్తిప్రదాతలు'– ఇలా ప్రతిపాదనలు చేయడానికి అవకాశం ఉంది. ఒకరు నిజాం విగ్రహం వద్దు, పటేల్ విగ్రహం ఉండాలనొచ్చు! ఇంకొకరు రాజా వెంకట్రామారెడ్డి విగ్రహం వద్దు, భాగ్యరెడ్డి వర్మ విగ్రహం ఉండాలనొచ్చు.

విగ్రహాల తయారీ అనేది, నిస్సందేహంగా ఒక గొప్ప కళే! అయినా, వాటిని బహిరంగ ప్రదేశాలలో పెట్టడం వల్ల, విగ్రహాల రూపంలో ఉన్న ఆ వ్యక్తులకి అవమానమే! దుమ్మూ, ధూళితో; పిట్టల రెట్టలతో కొన్నాళ్ళు – జయంతులలో, వర్ధంతులలో వచ్చేవరకూ – అలా అశుభ్రంగా పడివుండడం ఒక అవమానం. ఆ విగ్రహాల అసలు మనుషుల భావజాలాన్ని వ్యతిరేకించేవారి దాడులు, ఇంకో రకం అవమానం! వర్గాలుగా, వర్గ విభాగాలుగా; వందల కులాలుగా, వేల ఉపకులాలుగా, చీలిపోయివున్న సమాజంలో, విగ్రహాలు– అవి స్థానికులవైనా, జాతీయస్థాయి వారివైనా, అంతర్జాతీయస్థాయి వారివైనా– దాడులకూ, అగౌరవాలకూ గురికావలిసిందే! అందుకే, ఆ విగ్రహాలను, వాటి ఆరాధకులు, స్వంత మ్యూజియంలలోనో, ఇళ్ళల్లోనో, తమ సంస్థల ఆవరణల్లోనో పెట్టుకుని 'పరిరక్షించు'కోవాలి. అంతేగానీ, బహిరంగ ప్రదేశాలలో పెట్టడం సరికాదు!

స్థానికేతరుల విగ్రహాలను తరలించాలన్నప్పుడు, 'ఆంధ్రోళ్ళు' మాత్రమే స్థానికేతరులా అనే ప్రశ్న వస్తుంది. తెలంగాణలో పుట్టిపెరిగినవారు కానివారందరూ, స్థానికేతరులే అవుతారు గదా? అలాంటప్పుడు, అంబేద్కర్ విగ్రహాన్ని మధ్యప్రదేశ్‌లోని మహోవ పట్టణానికీ, పూలే విగ్రహాన్ని మహారాష్ట్రలోని పూణే నగరానికీ, జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని బిహారులోని చాంద్వా గ్రామానికీ, గాంధీ విగ్రహాన్ని గుజరాత్‌లోని పోరుబందరుకీ, ఇలా 'గౌరవంగా'నే తరలించాల్సిందే గదా?




అసలు, 'వైతాళికులు', 'మహానాయకులు', 'త్యాగధనులు', 'సంస్కర్తలు', 'విప్లవకారులు', 'మహా కవులు'– అనే పేర్లతో, కోట్లాది మానవుల్లో కొందరిని విడదీసి, వారి విగ్రహాలు తయారు చేయించడం సమానత్వ సూత్రానికి విరుద్ధం. ఆ 'గొప్ప, గొప్ప' వారందరూ, అలా గొప్ప స్థాయికి రావడానికి, అనేక అనుకూల పరిస్థితులుండడమే కారణం. వాళ్ళు పుట్టుకతోనే మహాత్ములు కాదు. వాళ్ళు తమకు చేతనైనదీ, చేయగలిగినదీ చేశారు. వాళ్ళనెవరూ బలవంతం చెయ్యలేదు. వాళ్ళేమీ, తమని విగ్రహాలుగా మలచమనీ, ఆరాధించమనీ కోరలేదు. పైగా, వాళ్ళల్లో కొందరి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక భావాలు, అసమానతలకూ, అణచివేతలకూ అనుకూలమైనవిగానూ, కొందరివి వ్యతిరేకమైనవిగానూ ఉంటాయి. ప్రాంతీయ అస్తిత్వం మత్తులో, అందరినీ నెత్తిన పెట్టుకోవాలా?

శిల్పకళాకారులు, భుక్తి కోసం కాక, కళా దృష్టితో, తమ కళాభినివేశాన్ని వ్యక్తపరచుకోవడానికి, శిల్పాలని చెక్కడం, విగ్రహాలను తయారు చేయడం, సహజంగా జరగవలిసిన కార్యం. అలాకాక, ప్రభుత్వాల కోసమో, ఉద్యమ సంస్థల కోసమో, కొంత 'కిరాయి'కి జరగవలిసిన కార్యం కాదు.

రైతుల ఆత్మహత్యలతో, కులోన్మాద హత్యలతో, క్రూరమైన కార్మిక వ్యతిరేక చట్టాలతో, పౌరహక్కుల్ని కాలరాసే నిర్బంధ చట్టాలతో, నిరుద్యోగ సమస్యతో, అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితికి వ్యతిరేకంగా ఏ కార్యక్రమాలు చెయ్యాలో, అసమానతలకు గురి అవుతున్న వారిని ఎలా సంఘటితపరచాలో, ఆలోచించడం మాని జరిపే ఈ స్థానిక విగ్రహారాధనా ఉద్యమం, మైకు ముందు మేధోకాలక్షేపానికి తప్ప దేనికి పనికివస్తుంది?

"ఔర్ భీ దుఖ్ హై జమానే మె మొహొబ్బత్ కే సివా" ("ప్రపంచంలో, ప్రేమని మించిన దుఃఖం ఉంది!") అన్నాడు ఫైజ్ అహమద్ ఫైజ్ అనే కవి. 'ప్రేమ' అన్న చోట, 'స్థానిక విగ్రహాల మీద ప్రేమ' అనే మాటని పెట్టుకోవాలి ఇప్పుడు!

● బి.ఆర్. బాపూజీ





10లోపు పీ4 దాతల మ్యాపింగ్ పూర్తి కావాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ4 కార్యక్రమానికి సంబంధించి గ్రామ సభలు, దాతల మ్యాపింగ్, నీడ్ అసెస్మెంట్ సర్వేను సకాలంలో పూర్తి చేసేందుకు.. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశం మందిరం నుంచి పీ4, హౌసింగ్, ఉపాధి హామీ పథకం, గ్రామ/వార్డు సచివాలయాల సర్వే తదితరాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గుర్తించిన బంగారు కుటుంబాలను నిర్దేశిత లక్ష్యం మేరకు.. దాతలతో మ్యాపింగ్ అగస్టు 10 లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇక లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను ప్రతివారం లక్ష్యాలను నిర్దేశించుకొని పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం పథకానికి వివిధ కారణాలతో దూరమై..అర్జీలు పెట్టుకున్న వారి సమస్య లను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల పాకల నిర్మాణం, దాణా, ఉద్యాన పంటల సాగుకు గ్రామాల వారీగా ఎంపీడీవోలు వెంటనే ప్రతిపాదనలు అందించాలన్నారు. ఈ సమావేశంలో సీఈఓ శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాదు, డీపీఓ సాయికుమార్, డ్వామా పీడీ శంకర్ పాల్గొన్నారు.

కుడికాల్వకు నీటి విడుదల


◆ 5 వేల క్యూసెక్కులకు పెంచిన అధికారులు
◆ సాగు, తాగు నీటి అవసరాలకు 132 టీఎంసీలు
◆ మరో 24 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదనలు
◆ నేడు సాగర్ గేట్లు తెరవనున్న తెలంగాణ మంత్రులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయం నిండుకుండలా దర్శనమిస్తోంది. దీంతో జవహర్ కుడి కాల్వకు డ్యాం నుంచి నీటి విడుదలను 500 నుంచి 5 వేల కూసెక్కులకు పెంచినట్టు జల వనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు. సాగు, తాగు అవసరాలకు 132 టీఎంసీలు నీటిని కేటాయించారు. అయితే మరో 24 టీఎంసీలు కేటాయించాలని కోరుతూ జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జూలైలోనే పుష్కలంగా సాగునీరు సరఫరా చేయడం 18 ఏళ్లలో ఇదే తొలిసారి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పత్తి, కంది, మొక్కజొన్న పంటలను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు. మరో వైపు నీరు విడుదల కావడంతో వరి సాగు పనులు ముమ్మరమయ్యాయి.

నేడు తెరచుకోనున్న సాగర్ గేట్లు

సాగర్ జలాశయంలో నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో డ్యాం క్రస్ట్ గేట్లను మంగళవారం తెరచి పులిచింతలకు నీటిని తెలంగాణ మంత్రులు (మిగతా 6వ పేజీలో)





● సాగర్ డ్యాం నుంచి కుడికాలువకు నీటి సరఫరా
● 585 అడుగుల నీటి మట్టం



ట్రాఫిక్ బ్రేకర్లు

● కనకదుర్గమ్మ వారధి వద్ద స్పీడ్ బ్రేకర్లతో అవస్థలు

రోజూ కొత్త సమస్యను సృష్టిస్తున్న స్పీడ్ బ్రేకర్లు

● లెక్కకుమించి ఏర్పాటు చేయడంతో ఆగిపోతున్న వాహనాలు
● భారీగా నిలిచిపోతున్న ట్రాఫిక్.. గంటల తరబడి కష్టాలు
● ఆరు బ్రేకర్లను మూడు చేసినా అదే సమస్య


(ఆంధ్రజ్యోతి- తాడేపల్లి)

విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్లాలన్నా.. గుంటూరు నుంచి విజయవాడకు రావాలన్నా.. కనకదుర్గమ్మ వారధి ఒక్కటే ప్రధాన మార్గం. విజయవాడ నగరంలో వారధి తర్వాత బెంజ్‌సర్కిల్‌వైపు వచ్చే... పశువుల ఆస్పత్రి రోడ్డులోకి తిరిగే చోట ఏకంగా వరుసగా ఆరు పీవీసీ (రబ్బర్) స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఈ స్పీడ్ బ్రేకర్ల దెబ్బకు ట్రాఫిక్ ఆగిపోతోంది. వారధివైపు వెళ్లే వాహనాలు (బెంజిసర్కిల్ నుంచి గుంటూరు వైపు) ఎలాంటి బ్రేకులు లేకుండా వెళ్లిపోతుండగా, దిగే వాహనాలు మాత్రం ఈ స్పీడ్ బ్రేకర్ల వల్ల గంటలకొద్దీ ఆగిపోతున్నాయి. ఈ బ్రేకర్లను దాటడానికి వాహనాలు చాలా సమయం తీసుకోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఆరు స్పీడ్ బ్రేకర్లలో సోమవారం మూడింటిని తొలగించినా సమస్య అలాగే ఉండిపోయింది. వాహనాలు వేగంగా హైవేలో అడుగుపెడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయన్న స్థానికుల వినతితో అధికారులు వీటిని ఏర్పాటు చేసినప్పటికీ.. వీటివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర విఘాతం ఏర్పడుతోంది. భారీ వాహనాల బరువు తట్టుకోలేక ఆ రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు రెండు మూడు రోజులకే కొన్నిచోట్ల (మిగతా 6వ పేజీలో)

పర్సంటేజ్‌లు ఇవ్వాల్సిందే..

ఉపాధ్యాయులు ఇంట్లో శుభకార్యాలు, గృహ నిర్మాణం, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు తదితర కారణాలతో పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తు చేస్తారు. దరఖాస్తు చేసిన మొత్తాలకు అనుగుణంగా పర్సంటేజ్ ఇవ్వాల్సి వస్తోందని ఆరోపణలు వెలువెత్తుతున్నా యి. రూ.5 లక్షల రుణానికి జడ్పీలో పీఎఫ్ విభాగాల్లో దాదాపు రూ.10 వేలకు పైగా చెల్లించుకోవాల్సి వస్తోందని ఆరోపణలున్నాయి.

హలో.. మాస్టారూ!



మీ ఫైల్ పూర్తయింది ఒక్కసారి కలవండి..!

పీఎఫ్ రుణం, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కూ పర్సంటేజీ..

● జడ్పీలో పీఎఫ్, ఆడిట్ సిబ్బంది వేధింపులు
● గగ్గోలు పెడుతున్న ఉపాధ్యాయులు

జడ్పీలో ఫైల్స్ కదలాలంటే పర్సంటేజీ ముట్టాల్సిందే. ఇది ఉపాధ్యాయులకూ తప్పడం లేదు. ఉపాధ్యాయులు పీఎఫ్ రుణం, విశ్రాంత ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఫైల్ పూర్తయింది.. తమని కలవాలంటూ పరిషత్‌లోని పీఎఫ్, ఆడిట్ విభాగాల నుంచి వారికి ఫోన్లు వస్తున్నాయి. వారితో పర్సంటేజీలు మాట్లాడుకున్న తర్వాతే..ఫైల్స్ ముందుకు కదులుతున్నాయి. లేకుంటే.. ఏదో ఒక కొర్రీ పెట్టి పెండింగ్ పెడుతున్నారు.




గుంటూరు (విద్య) జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పీఎఫ్, ఆడిట్ విభాగాల నుంచి వచ్చే ఫోన్లతో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారు. తాము దాచుకున్న డబ్బు.. రుణం రూపంలో పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దయనీయమైన స్థితి నెలకొందని ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కాళ్లు అరిగేలా జడ్పీ కార్యాలయంలోని విభాగాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇటీవల దాదాపు 55 మంది ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రీ ఆడిట్ ఫైల్‌ను వివిధ కారణాలతో తిరస్కరించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు లేని నిబంధనలు పెట్టి ఉపాధ్యాయులను ఇక్కట్ల పాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆరోగ్య సమస్యలున్నా.. వదలడం లేదు

ఉపాధ్యాయులు వివిధ అనారోగ్య సమస్యలతో రుణం కోసం దరఖాస్తు (మిగతా 6వ పేజీలో)

సంతానోత్పత్తి కేంద్రాలను.. తనిఖీ చేయండి



8

● లోపాలుంటే సమగ్ర నివేదిక అందజేయండి ● వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వ ఆదేశాలు

ఉచిత ప్రయాణంపై కసరత్తు



8

● ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న ఆర్టీసీ యంత్రాంగం
● రేపు గుంటూరులో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు సమావేశం

రియల్ మోసం

● అంపాపురంలో వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ దారుణం
● కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టి పరార్ 8
● మోసపోయిన వారిలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారు

నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించండి: ఎంపీ శ్రీకృష్ణ 6

నిర్వీర్యం దిశగా.. మత్స్య క్షేత్రం



నిడుబ్రోలు మత్స్య కేంద్రం

● ఒకప్పుడు ఏడాదికి కోటి చేప పిల్లల ఉత్పత్తి
● గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం
● వెలవెలబోతున్న నిడుబ్రోలు మత్స్య కేంద్రం

పొన్నూరుటౌన్, జూలై 28: నిడుబ్రోలు ప్రాంతంలో మత్స్యకారుల జీవన ప్రమాణాల పెంపు కోసం 60 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నిరుపయోగంగా మారే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఏడాదికి కోటి చేప పిల్లలు ఉత్పత్తి చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా మారిన నిడుబ్రోలు మత్స్య కేంద్రం ఘనం గతమైంది. పొన్నూరు పరిసర ప్రాంతాల్లో మంచి నీటి చెరువులు, నాగార్జున సాగర్‌లో ఏటా వదిలి పెట్టే చేప పిల్లలు ఇక్కడే ఉత్పత్తి అయ్యేవి. అలాంటి మత్స్య క్షేత్రం నేడు దాదాపు నిర్వీర్యమయ్యే స్థితికి చేరింది.

60 ఏళ్లుగా విశేష సేవలు

నిడుబ్రోలు మత్స్య క్షేత్రాన్ని 1964లో ఏర్పాటు చేశారు. డెల్టాలో మంచినీరు పుష్కలంగా లభించడం, భూగర్భ జలాలు అందుబాటులో ఉండడమే కాకుండా.. నాణ్యమైన చేప పిల్లల ఉత్పత్తికి ఈ ప్రాంతం అనువుగా ఉండడంతో అప్పటి పాలకులు నిడుబ్రోలు ప్రాంతాన్ని ఎంచుకుని మత్స్య క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో గ్లాస్ జార్ హేచరీని ఏర్పాటు చేశారు. బ్రీడర్ చేపల నుంచి చేప పిల్లలను ఉత్పత్తి చేసి, గ్లాస్ జార్‌లలో పెంచి ఉమ్మడి ఏపీ నలు మూలలకూ పంపిణీ చేశారు. 1992-93లో పెద్ద నీటి తొట్టెలను ఏర్పాటు చేసి చేప పిల్లల ఉత్పత్తిని గణనీయంగా పెంచారు. ఈ హేచరీలో సీజన్‌కు లక్ష చేప పిల్లలు ఉత్పత్తి చేశారు. సమీపంలోని దేవదాయశాఖకు చెందిన 20 ఎకరాల చెరువును ఈ క్షేత్రానికి కేటాయించారు. ఈ చెరువులో పెరిగే బ్రీడర్ చేపల నుంచి గుడ్లను సేకరించి, గ్లాస్ జార్‌లలో పొదిగించి పిల్లలుగా రూపాంతరం చెందిన తర్వాత తొట్టెల్లోకి మార్చేవారు. దేశీయ జాతి చేపలైన రాగండి, బొచ్చ వంటి చేప పిల్లలను ఈ తొట్టెలలో (మిగతా 6వ పేజీలో)



దేవాదాయశాఖ చెరువు

గుంటూరుకు మరో గుర్తింపు

● పారిశుధ్యం నిర్వహణలో రాష్ట్రంలో ప్రథమ స్థానం
● జీఎంసీ నుంచి 9 సచివాలయాల ఎంపిక
● కమిషనర్ పులి శ్రీనివాసులు



గుంటూరు కార్పొరేషన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి గుంటూరుకు మరోమారు గుర్తింపు లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో నిర్వహించిన ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) సర్వేలో.. మునిసిపల్ పరిధిలోని పారిశుధ్య సేవల్లో రాష్ట్రంలో ఉత్తమ 20 సచివాలయాలను ఎంపిక చేశారు. అందులో 9 గుంటూరు నగరపాలక సంస్థ సచివాలయాలు చోటు దక్కించుకున్నాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐవీఆర్ఎస్ బృందం పారిశుధ్య పనులకు సంబంధించి రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో చేపట్టిన ప్రజా అభిప్రాయ సర్వేలో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని రెడ్డిపాలెం-2, అమరావతి రోడ్ -4, వసంతరాయపురం, రెడ్డిపాలెం-10, చౌడవరం-4, బృందావన్ గార్డెన్స్-1, అమరావతి రోడ్ -3, శారదా కాలనీ-2, అడవితక్కెళ్లపాడు-2 సచివాలయాలు ఉత్తమంగా నిలిచాయని కమిషనర్ తెలిపారు. రానున్న కాలంలో 20 సచివాలాయాలు గుంటూరు నుంచే ఉండేలా సమష్టి కృషి చేస్తామన్నారు. సర్వేలో ప్రధానంగా ప్రజారోగ్య కార్మికులు.. ప్రతి రోజు ఇళ్ల నుంచి చెత్త సేకరణ, 24 గంటల్లో చెత్తకుప్పల తొలగింపు, డ్రెయిన్ల శుభ్రం చేస్తున్నారా..లేదా అనే ఈ మూడు అంశాలపై ఐవీఆర్ఎస్ బృందం సభ్యులు సర్వే చేసినట్లు తెలిపారు. నగర ప్రజల అభిప్రాయం మేరకు.. రాష్ట్రంలోనే గుంటూరు ప్రథమ స్థానంలో నిలవడం పట్ల కమిషనర్ హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో పారిశుధ్యం మెరుగ్గా జరిగేలా పలు విప్లవాత్మక చర్యలు తీసుకున్నామని కమిషనర్ పులిశ్రీనివాసులు తెలిపారు. అందులో భాగంగా 23గా ఉన్న శానిటేషన్ డివిజన్లను.. 57 ఎన్నికల వార్డులకూ ఒక్కో శానిటేషన్ డివిజన్‌గా మార్చి, ఇన్‌స్పెక్టర్‌ని కేటాయించామని చెప్పారు. ఒక్కో డివిజన్‌కు ప్రత్యేకంగా ట్రాక్టర్‌ని అందించామన్నారు. రానున్న కాలంలో నగరంలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూం, ప్రతి ఇంటికి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పారిశుధ్య నిర్వహణపై జరిగిన సర్వేలో గత నెలలో మాదిరే ఈ నెల కూడా రాష్ట్రంలో 67.6 శాతం ప్రజల పాజిటివ్ అభిప్రాయాలతో రాష్ట్రంలో తొలి స్థానాన్ని నిలబెట్టుకున్నామని తెలిపారు. అలాగే అన్న క్యాంటీన్ల విభాగంలో నల్లచెరువు క్యాంటీన్ స్థానం దక్కించుకుందన్నారు.

ముగ్గురు అక్కచెల్లెళ్లకు రూ.36 లక్షల టోకరా

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో ఇమిగ్రేషన్ ఆఫీసర్ పోస్టులు ఇప్పిస్తామంటూ కొరిటెపాడు కేంద్రంగా నడుస్తున్న ఓ శిక్షణ సంస్థ నిర్వాహకులు తమను మోసం చేశారని బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ ఘటనపై స్పందించిన ఎస్పీ సతీష్ కుమార్ పూర్తిస్థాయి విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అరండల్ పేట పోలీసులను ఆదేశించారు. బాధితుల వివరాల మేరకు.. వెంగళరావునగర్‌కు చెందిన ముగ్గురు అక్కచెల్లెలు ఎయిర్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్ కోర్స్ కోసం కొరిటెపాడు కేంద్రంగా నడుస్తున్న సదరు సంస్థను సంప్రదించారు. ఇద్దరు నిర్వాహకుల్లో ఒక యువతి తాను అమెరికాలో ఇమిగ్రేషన్ ఆఫీసర్ నని చెప్పుకుంది. అనంతరం అమెరికాలో ఇమిగ్రేషన్ కార్యాలయంలో పోస్టులు పడ్డాయని, ముగ్గురు అక్కచెల్లెళ్లకు ఇప్పిస్తానని చెప్పింది. సర్టిఫికెట్లు, దరఖాస్తుకోసం అని చెబుతూ..వారి నుంచి దాదాపు రూ.36 లక్షలు విడతల వారీగా వసూలు చేశారు. అయితే వారి చర్యలపై అనుమానం వచ్చి.. దరఖాస్తు ఫాంలు చూపాలని ఆ ముగ్గురు విద్యార్థినులు నిలదీయడంతో.. సంస్థ నిర్వాహకులు అసలు నిజం వెల్లడించారు. తాము దరఖాస్తు చేయలేదని.. ఇచ్చిన డబ్బులు తిరిగిస్తామని రాజీకొచ్చారు. అందులో భాగంగా రూ.6 లక్షలు వెనక్కి ఇచ్చారు. మిగిలిన నగదు కోసం సంస్థ కార్యాలయానికి వెళ్లగా.. అక్కడి విద్యార్థులను రెచ్చగొట్టి బాధితులపైనే అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టించారు. దీంతో ఇరువర్గాలను పోలీసులు విచారించగా.. అసలు విషయం బయటపడింది. అనంతరం సంస్థ నిర్వాహకులు బాధితులకు రూ.12 లక్షలు ఇచ్చారు. మిగిలిన డబ్బు ఇవ్వకపోవడంతో.. ముగ్గురు విద్యార్థినులు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

6

గంజాయి రహితంగా గుంటూరు

● తెనాలిలో 21 కేజీల గంజాయి స్వాధీనం, 13 మంది అరెస్ట్ ● వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్

ఘనంగా లావు రత్తయ్య పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను నిర్వహించారు. డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు మాత్రమే తారతమ్య భేదాలు లేకుండా శుభాకాంక్షలు తెలియజేస్తారని అన్నారు. విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తే తాను ఇంకా ఎక్కువ సంతోషిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో హైద రాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు, ఎన్విడా సీనియర్ ఏఎస్ఐసీ మేనేజర్ మౌనిక, వర్సిటీ వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ ఎల్ రాణి రుద్రమదేవి, సీఈవో మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, లారా ప్రిన్సిపాల్ కే ఫణీంద్రకుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జే మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రారంభం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఆచార్య నాగభూషణం, సుబ్బారావు తదితరులు

గుంటూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ఆర్థిక సౌజన్యంతో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ పావులూరి సుబ్బారావు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్యలు రిబ్బన్ కట్ చేసి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ పావులూరి సుబ్బారావుతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు.

గంజాయి రహితంగా గుంటూరు


నిందితులను చూపుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత జిల్లాగా గుంటూరును తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని.. అందులో భాగంగా ఏడు నెలల్లో తెనాలి ప్రాంతంలో 10 గంజాయి కేసుల్లో రూ.5,25,000 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని 23 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. సోమవారం తెనాలి డీఎస్పీ కార్యాలయంలో తెనాలి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి, వారి వివరాలను ఎస్పీ సతీష్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు. గతంతో పోల్చుకుంటే జిల్లాలో 85-90శాతం మేర గంజాయిని నియంత్రించడం జరిగిందన్నారు. తెనాలి మండలంలోని అంగలకుదురు శివారు ఐస్ ఫ్యాక్టరీ సమీపంలోని నిమ్మతోటల్లో గంజాయితో యువకులున్నారని రూరల్ పోలీసులకు సమాచారం అందిందన్నారు. తెనాలి రూరల్, కొల్లిపరపోలీసులు కలిసి దాడులు నిర్వహించగా 21 కేజీల గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి పంచుకుంటున్న ముఠాను గుర్తించి, అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఒడిశాలోని గంజాం జిల్లా, బరంపూర్ గ్రామానికి చెందిన బసంతినాయక్ అలియాస్ సమీర్‌నాయక్ అనే 25ఏళ్ల యువకుడు గంజాయిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు. అతను నల్లపాడులోని దాసరిపాలెం గ్రామంలో కాంక్రిట్ పనుల నిమిత్తం వచ్చాడని, అదే గ్రామానికి చెందిన 34ఏళ్ల షేక్ గౌస్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో గౌస్ మిత్రుడైన తెనాలి మండలం సంగంజాగర్లమూడికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రషీద్‌ను కలుపుకుని.. మరికొంత మందితో ఒక ముఠాగా ఏర్పడినట్లు ఎస్పీ తెలిపారు. బసంతి నాయక్ తీసుకువచ్చిన గంజాయిని ప్యాకెట్లుగా చేసి కళాశాలు, తాపీ పనిచేసే వారు, ఇతర కార్మికులకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. పెద్ద మొత్తంలో సంపాదించాలన్న ఆశతో సోమవారం ఒడిశా నుంచి వసంతనాయక్ సుమారు రూ.3లక్షల విలువైన 21కేజీల గంజాయిని తెచ్చి ముఠా సభ్యులైన 13 మంది పంచుకుంటున్నారని చెప్పారు. ఈ క్రమంలో పోలీసులు దాడులు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని సీజ్ చేయడం జరిగిందన్నారు. గంజాయి సరఫరా, విక్రయం, వినియోగం చేసే మొత్తం 13 మంది ఉండగా వీరిలో నలుగురు మైనర్లని తెలిపారు. దాసరివారి పాలేనికి చెందిన షేక్ గౌస్, ఒడిశాకు చెందిన బసంతినాయక్, గొల్లపూడి సెంటర్ విజయవాడకు చెందిన గొర్ల వెంకటేష్, సంగంజాగర్లమూడి కొత్తపేట మజీద్ సమీపంలోని మహమ్మద్ అబ్దుల్ రషీద్, తెనాలి సీఎం కాలనీకి చెందిన షేక్ నాగూర్, నందివెలుగు గ్రామంలోని కొత్తసచివాలయం ప్రాంతానికి చెందిన షేక్ నజీరుద్దీన్, తెనాలి గంగానమ్మపేటకు చెందిన నూనె విజ్ఞామణికుమార్‌సాయి, తెనాలి పట్టణంలోని ముత్తెంశెట్టిపాలేనికి చెందిన రాహుత్ సాల్మన్, తెనాలి ఐతానగర్‌కు చెందిన గుంజి నాగమల్లేశ్వరరావు, తెనాలి ఆర్‌ఆర్‌నగర్, ఫ్యాడిసన్‌పేట, గంగానమ్మపేట, ఐతానగర్‌లకు చెందిన నలుగురు మైనర్లు నిందితులుగా ఉన్నారన్నారు. వీరిలో మహమ్మద్ అబ్దుల్ రషీద్‌పై సుమారు 4 గంజాయి కేసులు, 10కి పైగా చోరీ కేసులు ఉండటంతో అతడిపై సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. షేక్ నాగూర్ పైన సుమారు 2 గంజాయి కేసులు, 5 చోరీకేసులుండటంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ షీటు, రాహూత్ సాల్మన్ గంజాయికేసు, 18కి పైగా దొంగతననం కేసులు ఉండటంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ తెరవడం జరిగిందన్నారు. బాలసాని ప్రభాస్‌పై 5కిపైగా చోరీ కేసులులలో ముద్దాయిగా ఉన్నారని వివరించారు. ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన డీఎస్పీ జనార్ధన్, రూరల్ సీఐ, ఎస్, కొల్లిపర ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలకు ఎన్‌బీఏ టైర్ - 1 గుర్తింపు

చైర్మన్ కోయ సుబ్బారావు



వట్టిచెరుకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంపరిధి వింజనంపాడు గ్రామ సమీపంలోని కిట్స్ కళాశాలకు టైర్ - 1లో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించినట్టు కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు వెల్లడించారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కోయ సుబ్బారావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి బ్రాంచ్‌లకు (సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ) గుర్తింపు లభించిందన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి మూడోసారి ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌బీఏ గుర్తింపు కళాశాలకు లభించిందని, కళాశాల పాటిస్తున్న ప్రమాణాలకు ఈ గుర్తింపు నిదర్శనమన్నారు. దీనిని సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందికి చైర్మన్ సుబ్బారావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కళాశాల కార్యదర్శి కోయ శేఖర్ మాట్లాడుతూ జాతీయ సంస్థలతో తమ కళాశాల పొందిన ఈ గుర్తింపు తాము అందిస్తున్న అత్యున్నత విద్యా ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. క్రమశిక్షణ, పారదర్శకతతో కళాశాల నిర్వహించటం ద్వారా విజయం సాధ్యమైందని ప్రిన్సిపాల్ పీ బాబు, అకడమిక్ డైరెక్టర్ ఏ హరిబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించండి: ఎంపీ లావు

న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో 377 నియమం కింద ఆయన మాట్లాడారు. 'ఈఎస్ఐసీ పథకం ప్రస్తుతం రాష్ట్రంలో 13 లక్షల మంది ఉద్యోగులకు బీమాను అందిస్తోంది. 12 ఈఎస్ఐ ఆస్పత్రులు మాత్రమే క్రియాశీలకంగా పనిచేస్తూ 17 జిల్లాల్లోని కార్మికులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఈఎస్ఐసీ పథకం పరిధిలోకి వచ్చే జనాభా అంచనా వృద్ధిని పరిగణనలోకి తీసుకుని నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం తెలపాలి' అని ఎంపీ కోరారు.

ఏఎన్‌యూ డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ కోర్సుల 2వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం తాత్కాలిక వీసీ ఆచార్య కె. గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9,991మంది హాజరు కాగా వారిలో 5,642 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఏసీఈ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫలితాలకు సంబంధించి రీవాల్యూయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు ఆగస్టు 11వ తేదీలోగా రూ.1,490 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు జీజీహెచ్‌లో సాంకేతిక అంతరాయం

గుంటూరు మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్స్ అప్‌గ్రేడేషన్ పనులు చేపట్టడంతో మంగళవారం కొద్ది గంటల పాటు సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదురవుతాయని జీజీహెచ్ అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఈ-హాస్పిటల్ సాఫ్ట్‌వేర్ నుంచి నెక్ట్స్‌జెన్ సాఫ్ట్‌వేర్‌కు అప్‌గ్రేడ్ అవుతున్నట్లు వెల్లడించారు. సాఫ్ట్‌వేర్ మార్పిడి కార్యక్రమం నేపథ్యంలో రోగుల పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకొనే ఔట్ పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ విభాగం, క్యాజువాల్టీ, ల్యాబోరేటరీ నివేదికలు, ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి పలు విభాగాల్లో వైద్య సిబ్బంది మ్యాన్యువల్‌గా (చేతిరాతతో) రోగుల పేర్లు, చిరునామా, ఇతర వివరాలు, పరీక్షల నివేదికలు పొందుపర్చాల్సి వస్తుందన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి ఎనిమిది వరకు సాఫ్ట్‌వేర్ మార్పిడి ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ సమయంలో రోగులకు కొంత ఇబ్బంది తప్పదని, వైద్య సిబ్బందికి సహకరించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి కోరారు.

గంజాయి కేసులో నిందితులకు జైలు

కర్లపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మొదటి తరగతి అదనపు జడ్జి వీ.ఎల్‌పీ సత్యవతి సోమవారం తీర్పునిచ్చారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండల కేంద్రం పాత చేపల మార్కెట్ సమీపంలో గంజాయి విక్రయిస్తూ 2014లో నిందితులు పట్టుబడ్డారు. దాసరి శ్రీనివాసరావుకు సంవత్సరం జైలు, రూ.10వేలు జరిమానా, గాలం పాపారావుకు నాలుగేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా, పోతురాజు అప్పలనాయుడుకు నాలుగేళ్ల జైలు, రూ.10వేల నగదు జరిమానా విధిస్తూ.. జడ్జి తీర్పును వెలువరించారని కర్లపాలెం ఎస్సై రవీంద్ర తెలిపారు. మరో నిందితుడు తోకల పిచ్చయ్య(71) మృతి చెందాడని చెప్పారు. నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న పోలీసు అధికారులను కోర్టువిధులు నిర్వహించే సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలో... రెండు రైళ్లకు నిలుపుదల తొలగింపు

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాత్రి వేళ గుంటూరు మీదగా పిడుగురాళ్ల, నడికుడి మీదగా సికింద్రాబాద్‌కు ప్రయాణించే చెన్నై, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు ఆగస్టు నెల మొదటి వారంలో వివిధ తేదీల నుంచి పైన పేర్కొన్న స్టేషన్లలో నిలుపుదల సదుపాయాన్ని రైల్వే శాఖ తొలగించింది. చెన్నై, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు అయితే సత్తెనపల్లి స్టేషన్‌లో కూడా నిలుపుదల తీసేశారు. చెన్నై ఎక్స్‌ప్రెస్ ఆగస్టు మూడో తేదీ నుంచి గుంటూరులో బయలుదేరిన తర్వాత చర్లపల్లి వరకు ఎలాంటి స్టాపేజ్ లేకుండా రైల్వే టైంటేబుల్‌ని సవరించారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌కి అయితే ఈ నెల 5వ తేదీ నుంచి గుంటూరు తర్వాత సికింద్రాబాద్‌లోనే నిలుపుదల కల్పించారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కి మాత్రం సత్తెనపల్లిలో స్టాపేజ్‌ని కొనసాగిస్తూ పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడలో తొలగించారు. దీనిపై ప్రయాణికులు ఫిర్యాదులు చేయడంతో విషయాన్ని తాము హెడ్‌క్వార్టర్స్‌కు నివేదిస్తామని రైల్వే అధికారులు సమాధానాలు ఇస్తున్నారు.

వైద్య ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు


నియామక పత్రాలు అందజేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వివిధ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంపికైన ఉద్యోగులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించి, నియామక పత్రాలు అందజేశారు. చిత్తశుద్ధితో పని చేసి ఆరోగ్య శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. 20 మంది ఫార్మసిస్టులు, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు, 16 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 47 ఎల్‌జీఎస్‌లు ఉన్నట్లు డీఎంహెచ్‌వో కార్యాలయ అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, పరిపాలన అధికారి లక్ష్మీకుమారి, ఆఫీస్ సూపరింటెండెంట్ భక్తవత్సలం, అకౌంట్ ఆఫీసర్ కృష్ణకుమారి, డీపీవో సైమన్ రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ 'బ్రేకర్లు'

(5వ పేజీ తరువాయి)

నలిగిపోయాయి. వాహనదారుల కష్టాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

సమస్యను గుర్తించాం..

వారధి దిగే ప్రదేశంలో, కృష్ణలంక జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట జరిగే ప్రమాదాల్లో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రదేశంలో రాత్రిపూట వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జాతీయ రహదారుల అధికారులు వాటిని ఏర్పాటు చేశారు. వాటివల్ల ఉత్పన్నమైన సమస్యను గుర్తించారు. ఆరు స్పీడు బ్రేకర్లు ఉన్నచోట మూడింటిని తొలగించాం. మూడు బ్రేకర్లు ఉన్నచోట ఒక దాన్ని తొలగించాం.

-ఏవీఎల్ ప్రసన్నకుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యద్దనపూడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై తిమ్మాపురం బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన దొప్పలపూడి హనుమకోటి(26) కేరళలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. మూడు రోజుల క్రితం అద్దంకికి చెందిన తన స్నేహితుని వివాహం నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితులు చందు, రాజ్‌పుత్ దిలీప్‌కుమార్‌లతో కలసి బుల్లెట్ వాహనంపై అద్దంకిలో రాత్రి జరిగిన తన స్నేహితుని వివాహానికి హాజరయ్యాడు. మరుసటి రోజు ఆదివారం అద్దంకి నుంచి స్వగ్రామానికి బయలు దేరారు. వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ హనుమకోటి మృతిచెందాడు. మృతునికి ఇటీవలే నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. మృతుని తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో సైక్లిస్ట్ మృతి

చిలకలూరిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట-వాడరేవు జాతీయ రహదారిపై పసుమర్రు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని బొందిలిపాలేనికి చెందిన బీకం శ్రీనివాస్ సింగ్(65) అనే వ్యక్తి మృతి చెందాడు. సైకిల్‌పై వెళ్తున్న అతనిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అక్కడికక్కడే అతడు మృతి చెందగా.. హైవే సిబ్బంది అందించిన సమాచారం మేరకు చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుడికాల్వకు నీటి విడుదల

(5వ పేజీ తరువాయి)

విడుదల చేయనున్నారు. ముగ్గురు మంత్రులు కార్యక్రమానికి హాజరవుతున్నట్లు సదరు ఇంజనీరు తెలిపారు. సాగర్ డ్యాంకు 1,47,195 కూస్కెల వరద ప్రవాహం వస్తోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతలకు నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలతో పాటు సాగర్ నుంచి దిగువకు 42,913 కూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 585 అడుకులకు చేరుకుంది. ఇంకా ఐదు అడుగులకు చేరితే.. డ్యాం పూర్తిగా నిండుతుంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా 297 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది.

పులిచింతలకు 25 వేల కూసెక్కులు

సాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతల జలాశయానికి 25 వేల కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం నీట్టి మట్టం 175 అడుగులు కాగా సోమవారం 160.3 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 25.9 టీఎంసీలకు చేరింది. మరో 19.87 టీఎంసీల నీరు వస్తే పులిచింతల నిండుతుంది. మరో మూడు రోజుల్లో పులిచింతల డ్యాం కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారుల అంచనాగా ఉంది. దీంతో ఈ నెలలోనే పులిచింతల గేట్లు తెరచుకోనున్నాయి.

హలో.. మాస్టారూ..!

(5వ పేజీ తరువాయి)

చేసుకుంటారు. ఇందుకు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ ధృవీకరణ పత్రం రుణ దరఖాస్తుకు జత చేస్తే సరిపోతుంది. అయితే జడ్పీలోని సిబ్బంది మాత్రం ప్రభుత్వ సివిల్ సర్జన్ సర్టిఫికెట్ మాత్రమే అనుమతిస్తామని ఇది లేకపోతే రుణం మంజూరు చేయమని తిరకాసు పెడుతున్నారు. మరోవైపు కాసులు చెల్లిస్తే మాత్రం అన్నింటికీ ఓకే అని చెబుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయులకు నోటీసులు..

ఇటీవల పీఎఫ్ చందాల విషయంలో తేడాలు ఉన్నాయంటూ 55 మంది ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు నోటీసులు జారీ అయ్యాయి. ఒక నెలలో ట్రెజరీ నుంచి పీఎఫ్ చందా జమ కాకపోతే ఆ మొత్తం రెండో నెలలో కలిపి జమ చేస్తారు. కొన్ని కారణాల వల్ల ఉపాధ్యాయులు సెలవులో ఉంటే చందా జీరోగా ఉంటుంది. ఇలాంటి తేడాలను ఆడిట్ సిబ్బంది సరిచేయకుండా నోటీసులు జారీ చేయడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నారు.

ఆందోళనకు సిద్ధం..

ఇలా వివిధ కారణాలతో ఉపాధ్యాయులను విశ్రాంత ఉపాధ్యాయులను జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ సిబ్బంది వేదనకు గురి చేస్తున్నారు. ఈ బాధలు భరించలేక ఇటీవల కొంతమంది జడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని, ఇక తాము జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని సీఈఓకు స్పష్టం చేశారు. జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ విభాగాల సిబ్బంది ఉపాధ్యాయులను, విశ్రాంత ఉపాధ్యాయులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నారు.

నిర్వీర్యం దిశగా.. మత్స్య క్షేత్రం

(5వ పేజీ తరువాయి)

మత్స్య కేంద్రంలోనిచేప పిల్లల ఉత్పత్తి తొట్టెలు



ఆరు నుంచి ఎనిమిది అంగుళాల పొడవు వచ్చే వరకు పెంచి విక్రయించేవారు. అత్యధికంగా ఈ చేప పిల్లలను ఫిషర్‌మెన్స్ సొసైటీలు అనుగుణంగా ఉన్న చెరువులు, సరస్సులు, నదులకు మాత్రమే కేటాయించేవారు. మిగిలిన చేప పిల్లలను చిన్న చిన్న రైతులకు సరఫరా చేసేవారు.

ఆరేళ్లుగా దిగజారిన పరిస్థితులు

నిడుబ్రోలు మత్స్య క్షేత్రం పరిస్థితి ఆరేళ్లుగా దిగజారి పోయి దీన స్థితికి చేరుకుంది. 2017-218లో మత్స్య క్షేత్రంలో దశాబ్దాల క్రితం నిర్మించిన చేప పిల్లల తొట్టెలు మరమ్మతులకు గురి కావడం, బ్లీడర్ చేపలు పెరిగే చెరువు పూడిక పేరుకుపోవడంతో మత్స్య క్షేత్రానికి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దీంతో అప్పటి అధికారులు సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ప్రభుత్వంతో సంప్రదించి, మత్స్య క్షేత్రం మరమ్మత్తులకు రూ.97 లక్షలు మంజూరు చేయించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. మత్స్య క్షేత్రంపై నాటి పాలకులు శీతకన్ను వేశారు. కేటాయించిన నిధులు ఖర్చు చేయకపోవడంతో రద్దు అయ్యాయి. ప్రస్తుతం మత్స్య క్షేత్రంలో కేవలం తిలాపియా, గంబూషియా చేప పిల్లలు మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. జిల్లాల విభజనతో గుంటూరు జిల్లాలో కేవలం 77 హెక్టార్లలో మాత్రమే చేప, రొయ్యల చెరువులున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే నిడుబ్రోలు మత్స్య క్షేత్రం పూర్తిగా కనుమరగయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

మైనార్టీల జీవితాల్లో వెలుగులు నింపుతా

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- మైనారిటీ, టీడీపీ నేతల ఆధ్వర్యంలో సత్కారం

గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మైనార్టీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అసెంబ్లీ మైనారిటీ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ముస్లిం మైనారిటీ, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నసీర్‌ను ఘనంగా సత్కరించారు. మొదటి నుంచి మైనారిటీల సంక్షేమానికి, అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్‌కు అసెంబ్లీ మైనారిటీ కమిటీ ఛైర్మన్ పదవి రావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి ఆర్థిక ప్రగతికి తన వంతు ప్రయత్నిస్తానని, అసెంబ్లీ వేదికగా పాటుపడతానని తెలిపారు. తనకు ముస్లిం అసెంబ్లీ మైనారిటీ కమిటీ ఛైర్మన్‌గా అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● విజయవాడలో సోమవారం వక్ఫ్ బోర్డ్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే నసీర్‌ను బోర్డు ఛైర్మన్ అజీజ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అర్ధరాత్రి తాగునీటి సరఫరాను రీషెడ్యూల్ చేయండి

'అర్ధరాత్రి 12 గంటలకు తాగునీరు సరఫరా చేస్తుంటే ప్రజలు ఇబ్బందులు పడతారు. ఆ సమయంలో నీళ్లు పట్టుకోవడం కష్టంగా ఉంటుంది. వెంటనే తాగునీటి సరఫరా రీషెడ్యూల్ చేయండి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడండి' అని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక 51 డివిజన్ శ్రీనగర్‌లో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాసరి రాజా మాస్టర్, మద్దిరాల మ్యాని, డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ ముప్పవరపు భారతి, బొంతల సాయిబాబు, మహంకాళి నరసింహారావు, వంగర ఏడుకొండలు, గోళ్ల ప్రభాకర్, అఫ్రోజ్, మాదవరపు, రాచకొండ లక్ష్మయ్య, రమేష్, సైదులు, మాలయాద్రి, కోటపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సుపరిపాలన కార్యక్రమంలో ప్రజలతో ఎమ్మెల్యే నసీర్

హెపటైటిస్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

గుంటూరు మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హెపటైటిస్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని ఎమ్మెల్యే, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి సంఘం కో ఛైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ హెపటైటిస్ డే సందర్భంగా ప్రభుత్వ సమగ్ర వైద్యశాల గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో శుశ్రుతహాల్‌లో నిర్వహించిన 'హెపటైటిస్ అవగాహన సదస్సు'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెపటైటిస్ బీ వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే 4వేల మంది హెపటైటిస్ బీ వ్యాక్సిన్ 2500 మందికి హెపటైటిస్ సీ వ్యాక్సిన్ ఇచ్చారని ఆయన తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది నగరంలో హెపటైటిస్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి వైద్యశిబిరం ప్రారంభించారు. శిబిరంలో 500మంది ఆరోగ్య సిబ్బందికి హెపటైటిస్ బీ వ్యాక్సిన్ అందజేశారు.

గడువులోపు అర్జీలను పరిష్కరించాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు అందించే అర్జీల పరిష్కారంపై అధికారులు మీనమేషాలు లెక్కపెట్టవద్దని, చేయగలిగిన వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 28 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

● పీజీఆర్‌ఎస్ ద్వారా పట్టణ ప్రణాళిక విభాగం 18, ఇంజనీరింగ్ విభాగం 11, రెవెన్యూ విభాగం 6, ప్రజారోగ్య విభాగం 3, ఉపా సెల్ విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 2 మొత్తం 41 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఎంహోహెచ్ (ఇన్‌చార్జి)లు రామారావు, సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

జీటీఎస్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

గుంటూరు నగరపాలక సంస్థ కంపోస్ట్ యార్డ్‌లో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఏటుకూరు రోడ్డులోని కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

ప్రజారోగ్యానికి భంగం కలిగించే ప్లాస్టిక్ సంచుల విక్రయం, వినియోగాన్ని ఆగస్టు ఒకటో తేదీ నుంచి సంపూర్ణంగా నిషేధిస్తున్నామని, నగర ప్రజలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు నగరపాలక సంస్థకు సహకరించాలని, మంగళవారం సాయంత్రం 4 గంటలకు హోటల్స్, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్స్ నిర్వాహకులతో, 5 గంటలకు ప్లాస్టిక్ సంచుల ఉత్పత్తిదారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుపై సమావేశం ఏర్పాటు చేశామని సోమవా రం ఒక ప్రకటనలో తెలిపారు.



పుష్పయాగంలో పాల్గొన్న ఆలయ కమిటీ నిర్వాహకులు, వేద పండితులు

వైభవంగా గోదా అమ్మవారి శ్రీపుష్పయాగం

గుంటూరు(తూర్పు), జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం గోదా అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా శ్రీపుష్ప యాగం వైభవోపేతంగా జరిగింది. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, మహా మంగళహారతి, సాయంత్రం 5 రకాల సుమారు 7 క్వింటాల పుష్పాలతో, సుగంధ ద్రవ్యాలతో ఆలయ పాలకవర్గం సహాయ సహకారాలతో, సూరెడ్డి రాంప్రసాద్, పద్మజ దంపతుల సౌజన్యంతో ఆలయ ప్రధాన అర్చకుడు మాధవస్వామి ఆధ్వర్యంలో వైభవంగా శ్రీ పుష్పయాగం నిర్వహించారు.

నిర్దేశిత గడువులో అర్జీలను పరిష్కరించాలి

- కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 287 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ, డీఆర్వో ఖాజావలి తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువు లోపు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమా వేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 287 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవతేజ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటి కలెక్టర్లు లక్ష్మికుమారి, గంగరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిటిషన్లు సకాలంలో పరిష్కరించకుండా బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళితే సంబంధిత అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్ అర్జీలపై సంబంధిత శాఖ అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాదు, సీపీవో శేషశ్రీ, డీఈవో రేణుక, జిల్లా ఉపాధి శాఖ అధికారి దుర్గాబాయి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా పరిశ్రమల జీఎం జయలక్ష్మి, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏడీ పవన్‌కుమార్, సోషల్ వెల్ఫర్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

● గుంటూరు నగరంలోని వెంకట కృష్ణ థియేటర్, కృష్ణమహల్ సినిమా హాళ్లు శిథిలావస్థకు చేరాయని వాటిని కూల్చివేతకు అధికార యంత్రాంగం తరపున సహకారం అందించాలని కోరుతూ సినిమా హాళ్ల కో-ఓనర్ కడియాల వెంకటకృష్ణ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందించారు. నగరపాలక సంస్థ పర్యవేక్షణలో సినిమా హాళ్లను తీసివేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా థియేటర్ల తొలగింపునకు ఆదేశాలు ఇచ్చి సహకరించాలని కోరారు.

● రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఏపీ భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు అర్జీ అందజేశారు. గత ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. బోర్డు నిధులను ప్రభుత్వ అవసరాలకు వాడుకున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో పుప్పాల సత్యనారాయణ, రావుల అంజిబాబు, శ్రీనివాసరావు, రామా రావు తదితరులు ఉన్నారు.

● జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పెం డింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ బిల్లులను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.యశ్వంత్ అర్జీ అందజేశారు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారని అన్నారు. తక్షణమే బిల్లులను విడుదల చేయాలన్నారు.

● మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని మెప్మా ఆర్పీల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో అర్జీ అందజే శారు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఆర్పీలు జీవనానికి ఇబ్బందులు పడుతున్నార న్నారు. మరోవైపు రుణాల ఆడిటింగ్ పేరుతో రూ.1500 గ్రూపుల నుంచి వసూలు చేయ మని అధికారుల ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఆర్పీల ద్వారా బలవంతంగా చేస్తున్న వసూళ్ల ను ఆపాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో దండా లక్ష్మీనారాయణ, రమణ, రమాదేవి తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుంటూరు (విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం యువత కృషి చేయాలని ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దాని ని పరిరక్షించాలని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ సూచించారు. సోమవారం కళాశాలలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యులు కావాలన్నారు. విద్యార్థులు కళాశాల ఆవరణ లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ అండ్ డీ డైరెక్టర్ రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో...

స్థానిక టీజేపీఎస్ కళా శాలలో సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పరిధిలో వ్యాసరచన పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించి న పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ మద్దినేని సుధాకర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్య తేజో మూర్తి మాట్లాడారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో...

స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్ట్ విక్రయిస్తానంటూ

వైసీపీ నేత భార్య మోసం

గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): తాను చేస్తున్న అంగన్‌వాడీ పోస్టును విక్రయిస్తానంటూ వైసీపీ నాయకుడి భార్య వేలం వేయడమే కాకుండా రూ.రెండున్నర లక్షలు తీసుకొని మోసానికి పాల్పడింది. దీనిపై బాధి తురాలు సిరివెళ్ల అనురాధ సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసరావు తోట తొమ్మిదోలైన్‌కు చెందిన అనురాధకు కొరిటెపాడులోని అరుంధతినగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు కొరిటిపాటి విజయ్‌చంద్ర సతీమణి ప్రత్యూష పరిచయమైంది. ఆమె తుఫాన్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో టీచర్‌గా పని చేస్తుంది. తాను అంగన్వాడీ టీచర్ ఉద్యోగం మానేస్తున్నానని అందుకుగాను ఈ పోస్టును విక్రయించనున్నట్లు చెప్పుకుంది. దీంతో ఆమెను అనురాధ సంప్రదించింది. ఆ పోస్టును ఐదున్నర లక్షలకు మధ్య బేరం కుదిరింది. ఇందుకుగాను 2023 జూలైలో అనురాధ నుంచి ప్రత్యూష రెండున్నర లక్షలు తీసుకొని ఆమెకు తన అంగన్వాడీ పోస్టు విక్రయిస్తున్నట్లు ఒప్పంద పత్రం రాసి ఇచ్చింది. అనురాధను ప్రత్యూష వెంటబెట్టుకొని నాటి వైసీపీ పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి వద్దకు తీసుకెళ్లింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతవరకు అంగన్వాడీ పోస్ట్ మీకు రాబోతుందంటూ మాయ మాటలు చెప్పి కాలయాపన చేసింది. తన డబ్బు తనకు ఇవ్వమని అడుగుతుంటే బెదిరింపులకు పాల్పడుతోంది. దీంతో సోమవారం బాధితురాలు అనురాధ ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసాలు

బృందావన్ గార్డెన్స్ ఐదవలైన్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న కందుల నాగభూషణంకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ హైదరాబాదులోని తిరుమలగిరిలో ఉంటున్న గ్రంథ సరి మహేష్ లక్ష రూపాయలు తీసుకొని మోసం చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బు తనకు ఇవ్వాలని అడుగుతుంటే బెదిరిస్తున్నట్లు నాగభూషణం ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బీరువాలో దాచిన ఏడు లక్షలు మాయం

స్థానిక పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకట్రావు నగర్లో పాలపర్తి పద్మావతికి చెందిన రూ.ఏడు లక్షలు మాయమయ్యాయి. ఏడాది మే 25న తన ఇంట్లో దినం కార్యక్రమం ఉండడంతో బంధువులందరిని ఆహ్వానించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఇంట్లోనే బీరువా తెరిచి చూడగా అందులో ఉండాల్సిన 7 లక్షల రూపాయల నగదు మాయమైంది. దీనిపై బంధువులందరినీ విచారించిన ఎటువంటి ఆచూకీ తెలి యక పోవడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు అయితే ఇంతవరకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆమె పేర్కొంది. ఈ మేరకు సోమవారం బాధితురాలు పాలపర్తి పద్మావతి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగిస్తున్న మలినేని డైరెక్టర్ వెంకటేశ్వరరావు

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

- మలినేని డైరెక్టర్ వెంకటేశ్వరరావు

వట్టిచెరుకూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం వేగవంతంగా మారుతున్న ఈ యుగంలో విద్యార్థులు స్వయంగా ఆలోచించే శక్తిని పెంపొందించుకొనేందుకు బూట్ క్యాంపు ఎంతో దోహదపడు తుందని మలినేని విద్యాసంస్థల డైరెక్టర్ కే.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో తృతీయ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆరు రోజుల బూట్ క్యాంపు ఏ-1 ఐవోటీని సోమవారం డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మేక్ స్కిల్డ్ సీఈవో మధు పర్వత నేని పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కృత్రిమ మేధ ఐవోటీ వంటి రంగాల్లో ప్రావీణ్యం సాధిస్తే పరిశ్రమల్లో విశేష అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. మేక్ స్కిల్డ్ సీఈవో మధు పర్వతనేని మాట్లాడుతూ కార్యక్రమం ఆగస్టు 2 వరకు జరుగుతుందని, చివరి రోజు విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, ఈసీఈ విభాగాధిపతి డీ విజయసారథి పాల్గొన్నారు.

ధర్మస్థల హత్యోదంత దర్యాప్తును వేగవంతం చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మంజునాథ దేవాలయ ధర్మస్థలంలో యువతులు, మహిళలపై జరుగుతున్న హత్యోదంతం ఘటనలపై దర్యాప్తును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట భగత్‌సింగ్ విగ్రహం వద్ద సమైఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ హత్యోదంత పరంపర మనసును కలిచి వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాభవాని, కోటేశ్వరమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) పాట్నాలో ఆగస్టు 22 నుంచి 24 వరకు జరగనున్న జాతీయ లేజర్ పెంటాథ్లెన్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు పి.ఇందుమతి, ఎల్‌వీ ధనలక్ష్మి ఎంపికైనట్లు జిల్లా కార్యదర్శి జి.సాంబశివరావు తెలిపారు ఇటీవల నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్థానిక ఆర్‌వీఆర్ జేసీ కళాశాల విద్యార్థిని ధనలక్ష్మి జూనియర్ మహిళల విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా ఎన్నారై కళాశాల విద్యార్థిని ఇందుమతి అండర్ 19 విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కోబాల్డ్‌పేట, పట్టాభిపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలానే 11 కేవీ నిర్వహణలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాజేంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కూటమి పాలనలో వేగంగా నగరాభివృద్ధి

- మేయర్ రవీంద్ర



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే మాధవి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమ వారం పశ్చిమ నియోజక వర్గంలోని 23వ డివిజన్లో 50 లక్షలతో నగరం పాలెంలోని దర్గా వెనుక బీటీ రోడ్డు నిర్మించుటకు పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సం దర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనలో స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ఏర్పడ్డాక నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామ న్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేస్తున్న గుత్తే దార్లు పనులను నిర్దేశిత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది, స్థానిక కూటమి నాయ కులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజానికి సహకారం అందించాలి

గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం సమాజంలో అట్టడుగున ఉన్న పేదలను ఆర్థికంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ-4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. గుంటూరు ఎల్వీఆర్ క్లబ్‌లో చార్టెడ్ అకౌంటెంట్స్‌తో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న చార్టెడ్ అకౌంటెంట్స్ పేదరిక నిర్మూలనకు సహాయ సహకారాలు అందించాలని కోరగా, చార్టెడ్ అకౌంటెంట్స్ సానుకూలంగా స్పందించారు. ఆమె మాట్లాడుతూ బంగారు కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా మెరుగైన స్థితిలోకి తీసుకురావడానికి మార్గదర్శులు ముందుకురావాలని, చార్టెడ్ అకౌంటెంట్స్ ఆ దిశగా సహకరించాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 ఏర్పాటు ఆలోచనను చార్టెడ్ అకౌంటెంట్స్ అభినందించారన్నారు. పేదరికం లేని సమాజం కోసం చంద్రబాబు చేస్తున్న కృషికి తమ సహాయ సహకారాలు అందిస్తామని ముందుకు రావడం శుభపరిణామమన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 20 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని, ఆగస్టు 15లోపు బంగారు కుటుంబాలకు మార్గదర్శుల గుర్తింపు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు.

పద్మజ పేరుని సిఫార్సు చేయలేదు : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్తు పాలకవర్గంలో డైరెక్టర్ పదవికి మగదాల పద్మజ పేరుని తాను సిఫార్సు చేయలేదని ఎమ్మెల్యే గళ్లా మాధవి స్పష్టం చేశారు. సోమవారం రాత్రి ఫోన్‌లో ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. పద్మజ ఎన్నికల సమయంలో వైసీపీలో ఉన్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరారని పేర్కొన్నారు. ఎవరైతే టీడీపీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు కష్టపడ్డారో వాళ్ల పేర్లనే తాను సిఫార్సు చేస్తానన్నారు. ప్రాధాన్యక్రమంలో అందరికి పదవులు ఇప్పించేందుకు తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. పద్మజ నియామకం గురించి తనకు తెలియదన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో ఓటర్ల జాబితా పబ్లికేషన్

- ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

గుంటూరు కార్పొరేషన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 18న జరగనున్న ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను నేడు పబ్లికేషన్ చేశారని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలన్నింటిని నిబంధనలు షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ప్రస్తుతం 2,126 మంది (శాశ్వత సభ్యత్వం కలిగిన) ఓటర్లు ఉన్నారని, ఎన్నికలలో ఓటు వేయదలచిన ఓటర్లు తమ ఓటును తనిఖీ చేసుకొనుటకు వీలుగా ఎన్టీఆర్ స్టేడియంలో, రవీంద్రనగర్‌లోని స్విమ్మింగ్ వద్ద, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కూడా ఓటర్ల జాబితాలను పబ్లికేషన్ చేశామన్నారు. ఓటు హక్కును వినియోగించుకోదలచిన వారందరూ తమ ఓటును తనిఖీ చేసుకోవాలని కోరారు.

మెదడు, నరాల సంబంధిత వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ సూర ప్రదీప్‌కుమార్ రెడ్డి

గుంటూరు (తూర్పు), జూలై 28(ఆంధ్ర జ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర్వసామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కిమ్స్ శిఖర ఆస్పత్రి, గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మొదడు, నరాల సం బంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సంస్థ వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ లంకా వివేక్, డాక్టర్ సూర ప్రదీప్ కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌పై మెదడు, నరాలకు సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ మన్నే సుబ్బారావు, కోగంటి బసవనంది కేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.



ప్రకృతి వ్యవసాయ శిక్షణ శిబిరంలో పాల్గొన్న కేరళ బృందం, ఇనసెట్లో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

కేరళ బృందం ఫిదా..!

● ఏపీ రైతుల ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు ప్రశంసలు

గుంటూరు సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'ప్రకృతి వ్యవసాయానికి ప్రాణాధారం జీవవైవిధ్యం. 365 రోజుల పాటు పొలాన్ని పంటలతో కప్పి ఉంచడంతో... రైతులే అత్యుత్తమ ఆవిష్కర్తలు, శిక్షకులు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ నమూనాలను ఊహించిన దానికంటే ఉత్తమంగా రైతులు ముందుకు తీసుకువెళ్తున్నారు.' అని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. కేరళ ప్రతినిధి బృందం మూడో రోజు శిక్షణలో భాగంగా గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సిఫార్సు చేసిన పద్ధతులను మించి, కొత్త ఆవిష్కరణలు చేయడం ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. ప్రకృతి వ్యవసాయం ఒక సుస్థిర, వ్యాప్తి చెందగల రైతు ఆధారిత ఉద్యమంగా మారిందని కేరళ బృందం సభ్యులు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రైతులు ప్రదర్శించిన వినూత్న పద్ధతులను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పంటల వైవిధ్యం, నేల ఆరోగ్య నిర్వహణ, జీవ ఉత్ప్రేరక తయారీ వంటి అంశాలు వారిని ఆకట్టుకున్నాయి. రైతులు ప్రకృతి వ్యవసాయ సూత్రాలను అనుసరించడమే కాకుండా వాటిని మెరుగు పరుస్తూ ముందుకెళ్తున్నారని వారు పేర్కొన్నారు. సీనియర్ సలహాదారు డాక్టర్ వరప్రసాద్ ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేసి, ఏపీలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శాస్త్రీయ అధ్యయనాలు, ఆధారాలను వివరించారు. సీనియర్ కన్సల్టెంట్ మహేశ్వరి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం బహుముఖ దృష్టి కోణాన్ని కలిగి ఉందని, నేల నిర్మాణాన్ని బలపరుస్తుందన్నారు. సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీదుర్గ (వర్చువల్‌గా) మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా పోషక భద్రత సాధ్యమవుతుందన్నారు. పాఠశాలలు, అంగన్వాడీలకు రసాయన రహిత ఉత్పత్తులను అందించడం, ఆహార వైవిధ్యం పెంచడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. రైతు సాధికార సంస్థ సిబ్బంది డాక్టర్ డీవీ రాయుడు, జేబీఆర్ చక్రవర్తి, గోపిచంద్, వి.కృష్ణారావు సమావేశంలో బృందానికి తోడ్పడ్డారు.

ప్రయాణికుల జాగారం

● స్పెషల్ ట్రైన్స్ రాక గంటల తరబడి నిరీక్షణ

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల - వినుకొండ మధ్యన ఉన్న నెమలిపురి, రొంపిచర్ల రైల్వేస్టేషన్లలో ప్రయాణీకులు రాత్రి అంతా జాగారం చేయాల్సి వస్తోన్నది. నంబరు. 07189 నాందేడ్ - తిరుపతి రైలుని నడికుడి - శ్రీకాళహస్తి మార్గంలో పూర్తి అయిన వినుకొండ సెక్షన్‌లో ప్రవేశ పెట్టారు. ఈ రైలు ప్రతీ శుక్రవారం అర్ధరాత్రి 1 గంటకు నెమలిపురి రావాలి. అయితే ఇది తెల్లవారజామున 4 గంటలు దాటిన తర్వాతనే వస్తున్నది. ఈ కారణంగా తిరుపతి వెళ్లేందుకు టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న ప్రయాణీకులు రాత్రి అంతా మేల్కొని స్టేషన్‌లో ఎదురు చూడాల్సి వస్తున్నది. ఈ రైలు తిరుపతికి మధ్యాహ్నం 12.30కి చేరుకొని 2.20 కల్లా శనివారం తిరుగు ప్రయాణం కావాలి. తిరుపతికి వెళ్లడమే రెండు గంటలకు పైగా ఆలస్యం అవుతుండటంతో ప్లాట్‌ఫాం మీదనే క్లీనింగ్ చేసి లోకో రివర్స్ చేస్తున్నారు. ఈ కారణంగా తిరుగు ప్రయాణమయ్యే రైలు నంబరు. 07190 తిరుపతి - నాందేడ్ స్పెషల్ రీషెడ్యూల్ చేయాల్సి వస్తున్నది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు రొంపిచర్లకు రాత్రి 10.25కు చేరుకోవాలి. రీషెడ్యూల్ కారణంగా అర్ధరాత్రి దాటాక 3.30కి వస్తున్నది. దాంతో నెమలిపురికి వెళ్లేసరికి మరో పావు గంటకు పైగా సమయం పడుతున్నది. ఈ నేపథ్యంలో ఆపరేటింగ్ అధికారులు షెడ్యూల్ ప్రకారం ఈ స్పెషల్ ట్రైన్‌ని నడిపేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

పిచికారీ.. ప్రమాదం లేకుండా

● పురుగుమందు చల్లేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
● ఊపిరితిత్తులు, క్యాన్సర్ బారిన పడే ప్రమాదం
● ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో కలుపుమందులు వినియోగం



తెనాలిరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు ప్రారంభ సమయం కావడంతో పంటలసాగుకు భూములను శుభ్రం చేసే పనిలో రైతులు హడావిడిగా ఉన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు తెరిపివ్వడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తెనాలి మండలంలో 18వేల ఎకరాల్లో వెద సాగుపనులు జరుగుతున్నారు. చేలు చుట్టూ ఉన్న గట్లు శుభ్రం చేసుకుని పంటపొలాల్లో ఉన్న గడ్డిజాతి మొక్కలను ఏరివేసే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో కూలీలతో చేయించే ఈ పనులను సాగుకు ఖర్చు భారంగా మారుతుందన్న ఉద్దేశంతో అధిక సంఖ్యలో కలుపు నివారణ మందుల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఈ రసాయనాలు ప్రమాదకరమన్న విషయాన్ని మరిచి వీటిని పిచికారి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యసమస్యల బారిన పడే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఏటా కలుపు నివారణ, పురుగు మందులు పిచికారి చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అనేక అనారోగ్య సమస్యల బారినపడి మృతి చెందుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య శాఖ సైతం జరిపిన సర్వేలో వెల్లడైంది.





రసాయన ద్రావణం ప్రమాదకరం - డాక్టర్ శ్రీకాంత్

పంటపొలాలకు వినియోగించే కలుపు నివారణ, పురుగు నివారణ మందులు అత్యంత ప్రమాదకరమని జిల్లా ప్రభుత్వవైద్యశాల ఎండీ డాక్టర్ శ్రీకాంత్ చెబుతున్నారు. పంటపొలాల్లో పిచికారి చేసే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాల మీదకు వస్తుందని చెబుతున్నారు. తక్కువ మోతాదులో పీల్చుకునే మందు వల్ల కాలక్రమేణా అనారోగ్య సమస్యలు తలెత్తుతూ క్యాన్సర్, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. మందును బట్టి కేవలం 100 - 200 ఎంఎల్ అతి తక్కువ మోతాదులోనే ఒంట్లోకి ప్రవేశిస్తే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుందన్నారు.

రసాయనాలు కలిపే సమయంలో తప్పనిసరిగా గ్లౌజులు ధరించాలి


కలుపు లేదా పురుగు మందుల రసాయన ద్రావనాన్ని కలిపే సమయంలో తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు ధరించాలి. రసాయనం కలపడం పూర్తి అయ్యేంత వరకూ ఎట్టిపరిస్థితుల్లో తినుబండారాలు తినకూడదు. ధూమపానం కూడా చేయకూడదు. గ్లౌజులు తీసిన తరువాత సబ్బుతో శుభ్రంగా కడుకోవ్వాలి

పిచికారి చేసే సమయంలో..

పురుగు, గడ్డి మందుల రసాయన ద్రావణాన్ని పిచికారి చేసే క్రమంలో తలకు టోపి, ముక్కుకు, నోటికి మాస్కు, కళ్లజోడు ధరించాలి. శరీరం మొత్తం కప్పి ఉంచేలా దుస్తులు కానీ, సేఫ్టీ కిట్లు వినియోగించడం అత్యుత్తమం.

సంతానోత్పత్తి కేంద్రాలను.. తనిఖీ చేయండి

● లోపాలుంటే సమగ్ర నివేదిక అందజేయండి
● వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వ ఆదేశాలు



గుంటూరు మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సంతానోత్పత్తి కేంద్రాలను తనిఖీ చేసి వాటిలో లోపాలు ఉంటే వెంటనే సమగ్ర నివేదిక అందజేయాలని సోమవారం ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించింది. ఇటీవల విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలుగా సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ సరోగసీ పేరిట అక్రమాలకు పాల్పడినట్లు తేలిన నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంతానోత్పత్తి సెంటర్లను తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. సంతానోత్పత్తి సేవలందిస్తున్న ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వహణకు జిల్లా స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేస్తారు. అనంతరం నిర్వహణ నియమాల మేరకు పనిచేసే విషయాన్ని కూడా డీఎమ్‌హెచ్‌ఓలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. నియమాలను ఉల్లంఘించే ఆసుపత్రులపై తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అధికారిక సమాచారం మేరకు రాష్ట్రంలో పనిచేస్తున్న సంతానోత్పత్తి కేంద్రాల సంఖ్య, గూగుల్ ద్వారా వెదికినపుడు వచ్చిన ఫెర్టిలిటీ సెంరట్లకు సంఖ్యలో చాలా వ్యత్యాసమున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో... రాష్ట్రంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం జిల్లాలో మొత్తం ఎన్ని ఐవీఎఫ్/సరోగసీ కేంద్రాలకు అనుమతులిచ్చారు? అనుమతులు లేకుండా ఎన్ని పనిచేస్తున్నాయి? 2024-25 సంవత్సరంలో జిల్లాలో ఎన్ని కేంద్రాలను పరిశీలించారు? లైసెన్స్ లేకుండా పని చేస్తున్న కేంద్రాలు ఎన్ని తేలాయి? ఆయా ఫెర్టిలిటీ సెంటర్ల పనితీరుపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు? ఎన్ని కేంద్రాలకు అనుమతులు నిరాకరించారు? నియమాలమేరకు ఈ ఫెర్టిలిటీ సెంటర్లు పని చేసేలా చూడటానికి ఎటువంటి చర్యలు చేపట్టారు? అనే అంశంపై సమగ్ర నివేదికను అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు

గతంలో గుంటూరులోనూ అవకతవకలు...

సరోగసీ పేరిట దంపతులను మోసం చేసి ప్రస్తుతం జైలు ఊచలు లెక్కబెడుతున్న గైనకాలజిస్ట్ డాక్టర్ నమ్రత, గతంలో గుంటూరులోని కొత్తపేటలో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వహించి మోసాలకు పాల్పడ్డారు. అప్పట్లో సంతానం కోసం వచ్చిన దంపతులకు మగ పిల్లాడిని మాత్రమే పుట్టించే అమెరికన్ టెక్నిక్ తమ దగ్గర ఉందని డాక్టర్ నమ్రత నమ్మబలికించి వారి నుంచి రూ.లక్షలు కాజేశారు. అయితే ఐవీఎఫ్ చికిత్సల్లో రెండు సార్లు ఆ దంపతులకు ఆడ బిడ్డ జన్మించడంతో దంపతులు, అప్పటి డీఎంహెచ్‌వో డాక్టర్ గోపీనాయక్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు జరిపిన విచారణలో డాక్టర్ నమ్రత వారిని మోసం చేసినట్లు తేలడంతో డీఎంహెచ్‌వో గోపీనాయక్, సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను సీజ్ చేశారు. ఆమె తప్పించుకొని విజయవాడ వెళ్లిపోయారు. అప్పటి నుంచి సదరు డాక్టర్ తన పద్ధతి మార్చుకోలేదని తాజా సంఘటన చెబుతోంది.

విజయవాడలో మరో సెంటర్ ఆమెదే!

ఇది ఇలా ఉంటే సోమవారం ఎన్‌టీఆర్ జిల్లా డీఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, విజయవాడలో పనిచేస్తున్న యూనివర్సల్ హెల్త్ కేర్ సెంటర్ పై తమ బృందంతో కలసి తనిఖీకి వెళ్లగా ఆ కేంద్రం మూసి ఉన్నట్లు ఆమె మంత్రి కార్యాలయానికి తెలిపారు. అక్రమాల ఆరోపణలతో అరెస్ట్ అయిన డాక్టర్ నమ్రత పేరిటనే యూనివర్సల్ ఫెర్టిలిటి సెంటర్ మంజూరు అయిందని ఆమె వెల్లడించారు. తనిఖీ సమయానికి ఈ సెంటర్ సిబ్బంది ఎవరు లేకుండా మూసి ఉండటం అనుమానాలకు దారి తీస్తోందని, ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి తగు చర్యలు చేపడతామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని తెలిపారు.



ఉచిత ప్రయాణంపై కసరత్తు

● ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న ఆర్టీసీ యంత్రాంగం
● రేపు గుంటూరులో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు సమావేశం
● మహిళలకు ఉచిత ప్రయాణంపై దిశా నిర్దేశం

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఆర్టీసీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్వీసులు, మహిళా ప్రయాణీకుల వివరాలు వంటి వివిధ అంశాలపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులకు దిశానిర్దేశం చేసేందుకు ఆర్టీసీ మేనేజింగ్ డైరక్టర్ సీహెచ్ ద్వారకా తిరులమరావు ఈనెల 30న గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ పర్యటనకు వస్తున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ పర్యటన షెడ్యూల్‌ను జిల్లా అధికారులకు తెలియజేశారు. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో)గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ విమల ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్ళటంతో ఆమె స్థానంలో గుంటూరు ఇన్‌ఛార్జ్ డీపీటీవోగా బాపట్ల డీపీటీవో స్వామ్రాజ్యం ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. కాగా నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పల్నాడు డీపీటీవో అజితకుమారితో పాటు డిపోల మేనేజర్లతో ఎండీ తిరుమలరావు సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వం ఆగస్టు 15నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలన్న పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. దాంతో ముందుగా సన్నాహాలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్ని సర్వీసులు ఉన్నాయి. రోజువారీ ప్రయాణీకుల సంఖ్య ఎంత, ఇందులో మహిళా ప్రయాణీకుల సంఖ్య ఎంత శాతం ఉంది, ఎన్ని కిలోమీటర్లు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయనే అంశాలపై అధికారులు గణాంకాలు తీస్తున్నారు. మరోవైపు ఉచిత ప్రయాణం అమలుచేస్తే మహిళా ప్రయాణీకుల సంఖ్య 20నుంచి 30శాతం వరకైనా పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా గణాంకాలతో అధికారులు సమీక్షకి రావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత ప్రయాణంపై అధికారుల్లో ఆందోళన....

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలుపై అధికారుల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు వెయ్యి వరకు సర్వీసులు ఉన్నాయని, అందులో అత్యధికశాతం డొక్కు బస్సులు ఉన్నాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాదిలో పది శాతం వరకు డొక్కు బస్సులను తొలగించారని, మిగిలిన బస్సులతో నెట్టుకొస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంపై ఏ విధంగా అమలు చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు. మరో వైపు ఉచిత ప్రయాణంపై ఇప్పటికే ఐదు కేటగిరీల బస్సులకు అందజేయనున్నట్లు ప్రభుత్వ పెద్దల నుంచి ప్రకటనలు వినిపిస్తున్నాయి. అయితే ఆయా కేటగిరీలపై స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు. ప్రస్తుతమున్న సర్వీసులకు అదనపు సర్వీసులు అవసరం తప్పదని, అందుకు అనుగుణంగా సిబ్బంది కూడా కావాల్సి ఉందని ఉద్యోగ సంఘాల నుంచి ఇప్పటికే పలు విజ్ఞాపనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఎండీ అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు.



దుగ్గిరాల స్టేషన్ ఆవరణలో నిర్మించిన ప్రయాణికుల బ్రిడ్జి

దుగ్గిరాల రైల్వే స్టేషన్‌కు నూతన హంగులు



సర్వాంగ సుందరంగా ముస్తాబైన దుగ్గిరాల రైల్వేస్టేషన్

● నేటి నుంచి కొత్త భవనంలో టిక్కెట్ బుకింగ్
● నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సిగ్నలింగ్ వ్యవస్థ



దుగ్గిరాల స్టేషన్ సూపరింటెండెంట్ ఆధీనంలో ఉండే అత్యాధునిక సిగ్నల్ వ్యవస్థ

దుగ్గిరాల, జూలై 28(ఆంధ్రజ్యోతి): పసుపునకు ప్రఖ్యాతిగాంచిన దుగ్గిరాలలోని రైల్వేస్టేషన్ ఆధునికీకరణతో సర్వాంగ సుందరంగా మారింది. మంగళవారం నుంచి నూతనంగా నిర్మించిన బుకింగ్ కేంద్రం ద్వారానే ప్రయాణికులకు టిక్కెట్లు ఇవ్వనున్నట్లు రైల్వేస్టేషన్ అధికారులు చెబుతున్నారు. 322 కిలోమీటర్లమేర నిర్మాణం పూర్తిచేసుకున్న మూడవ లైన్ నిర్మాణ అనంతరం.. 137 ఏళ్ల క్రితం 1888లో ని ర్మించిన దుగ్గిరాల రైల్వేస్టేషన్ పాతభవనం తొలగించాల్సివచ్చింది. ఇప్పటికే మూడోలైన్‌పై పలుమార్లు ట్రైల్‌రన్ నిర్వహించారు. సిగ్నల్ వ్యవస్థ, క్యాబిన్ నిర్మాణంతోపాటు కొత్తగా ఇతర ప్లాట్ ఫాంలకు వెళ్లేందుకు అదనపు బ్రిడ్జి కూడా నిర్మించారు. తెనాలివైపు మూడోలైన్ కోసం రైల్వేబ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టారు. దుగ్గిరాల రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం వందల రైళ్లు వెళ్తుంటాయి. గతంలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు పసుపు పంట తరలించేందుకు దుగ్గిరాల వాణిజ్య కేంద్రంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యేక లూప్‌లైన్ గూడ్స్‌షెడ్ కూడా ఉండేది. కాలక్రమేణా ఎగుమతులు తగ్గుముఖం పట్టడం, లారీల ద్వారా రవాణా చేయడం ప్రారంభించారు. గతంలో తిరుమల, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లు దుగ్గిరాల స్టేషన్‌లో ఆగేవి. ప్రస్తుతం ప్యాసింజరు రైళ్లు, ఒక్క కృష్ణాఎక్స్‌ప్రెస్‌కు మాత్రమే ఇక్కడ హాల్టింగ్ ఉంది. భవిష్యత్తులో నైనా.. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపే అవకాశం ఉంటుందేమోనని పరిసర గ్రామాల ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు భారీ గుంతలతో అధ్వానంగా మారింది. రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



దుగ్గిరాల రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్

రియల్ మోసం

● అంపాపురంలో వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ దారుణం
● కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టి పరార్
● ప్లాట్లు కొన్నవారి స్థలాల్లో మరో రిజిస్ట్రేషన్
● మోసపోయిన వారిలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారు
● విశ్రాంత అధికారులతో పాటు ఆర్మీలో పనిచేసిన వారికీ టోకరా
● బాపులపాడు తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధితులు

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్) గన్నవరంలో మరో 'రియల్' మోసం వెలుగుచూసింది. గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం అంపాపురంలో భారీ వెంచర్ వేసి ప్లాట్లు విక్రయించిన వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన బాధితులు పెద్దసంఖ్యలో ప్లాట్లు కొని మోసపోయారు. ప్లాట్లు విక్రయించిన వీవీఆర్ యాజమాన్యం అదృశ్యమైంది. కొనుగోలు చేసిన ప్లాట్లు వ్యవసాయ పొలాలుగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. ఏకంగా వారి పేరుతో రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. తమ ప్లాట్ల దగ్గరకు వెళ్తున్న కొనుగోలుదారులను చూసి.. స్థానికుల ఆ స్థలాలు మావి అంటూ అడ్డుకుంటున్నారు. దీంతో మొత్తం 80 మంది బాధితులు సోమవారం బస్సులో బాపులపాడు తహసీల్దార్ మురళీకృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మోసంలో కృష్ణాజిల్లాతో పాటు గుంటూరు, తెనాలికి చెందిన వందల మంది మధ్యతరగతి వారు బాధితులుగా ఉన్నారు. వీరిలో విశ్రాంత అధికారులతో పాటు ఆర్మీకి చెందినవారు కూడా ఉన్నారు.

జరిగింది ఇలా..

అంపాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 201-1, 203-1, 210-2, 213-2లో సుమారు 44 ఎకరాల్లో 33 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చినట్టు ప్రచారం చేసి 2010లో వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వెంచర్ వేసింది. కృష్ణా, గుంటూరు, తెనాలి జిల్లాలకు చెందిన సుమారు 443 మందికి ప్లాట్లను విక్రయించింది. నాటి పంచాయితీ అధికారి సంతకంతో కూడిన లేఅవుట్ ప్లాన్, పంచాయితీకి కట్టిన రశీదుల ఆధారంగా ఆ సంస్థ రిజిస్ట్రేషన్లు చేసింది. కాగా, 2020, ఆ తర్వాత కొందరు వ్యక్తులు వెంచర్ వేసిన ఈ భూమిలోని 13 ఎకరాలను వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో పాటు పట్టాదారు పాసు పుస్తకాలు కూడా పొందడం గమనార్హం. అయితే, వెంచర్‌లో ప్లాట్లు కొన్న వారిలో కొందరు కంచె వేసుకునే ప్రయత్నాలు చేయగా, స్థానికంగా కొందరు అడ్డుకున్నారు. అప్పటికే వీవీఆర్ నిర్వాహకులు పత్తా లేకుండాపోవడంతో మోసపోయామని గ్రహించిన కొనుగోలుదారులు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కొనుగోలు దారుల్లో 80 మందికిపైగా బాధితులు కమిటీగా ఏర్పడి సోమవారం బస్సులో వెళ్లి తహసీల్దార్ మురళీకృష్ణను కలిశారు. తమ దగ్గరున్న సర్వే నెంబర్లు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో కూడిన ఆధారాలను చూపించి న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయేతర భూమికి రెవెన్యూ వారు పట్టాదారు పాసు పుస్తకాలు ఎలా ఇచ్చారని, భీమవరపు సాంబిరెడ్డి అనే వ్యక్తికి వ్యయసాయ భూమిగా ఎలా అమ్మారని, దానికి రిజిస్ట్రేషన్ల శాఖ ఎలా అంగీకరించిందని ప్రశ్నించారు. వ్యవసాయేతర భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం రెవెన్యూ తప్పిదంగా భావించి ఆ పాసు పుస్తకాలను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపానని, ప్లాట్లను అప్పగించడం వంటి విషయాలు రెవెన్యూ పరిధిలోకి రావని మురళీకృష్ణ వారికి చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేయడం, అమ్మడం చేస్తూ మోసం చేస్తున్నారని కొనుగోలు చేసే ముందు అన్ని విషయాలు పరిశీలించాలని హితవు పలికారు.



అంపాపురంలో తమ ప్లాట్ల వద్ద బాధితుల ఆందోళన

మెమరీ

మతిమరుపు మామూలు విషయమే! అయితే కొన్ని సందర్భాల్లో అంతర్గత ఆరోగ్య సమస్యలకు అదొక సంకేతం కూడా! కాబట్టి మతిమరుపును తేలికగా కొట్టిపారేయకుండా, దాని మూల కారణాలను వెతికి వాటిని సరిదిద్దుకోవాలంటున్నారు వైద్యులు.



మతిమరుపు మతలబు ఇదే!

పైబడే వయసుతో జ్ఞాపకశక్తి నెమ్మదిగా క్షీణించడం సహజమే! అలాగే అడపాదడపా మనందర్లో కూడా అప్పుడప్పుడూ స్వల్ప మతిమరుపు తలెత్తుతూ ఉంటుంది. తాళాలు ఎక్కడ పెట్టామో గుర్తు లేక వెతుక్కుంటూ ఉంటాం. ఒక్కోసారి కళ్లజోడు ఎక్కడ పెట్టామో గుర్తుండదు. అయితే ఇలాంటి చిన్నా చితకా మతిమరుపులకు కంగారు పడవలసిన అవసరం లేదు. కానీ మునుపటి కంటే మతిమరుపు పెరిగినా, దాంతో దైనందిన జీవితంలో ఇబ్బందులు తలెత్తినా ఈ సమస్యను తీవ్రంగానే పరిగణించాలి. అయితే మెదడులోని నాడీ కణాల క్షీణత వల్ల, మెదడులోని జ్ఞాపకశక్తి కేంద్రాలు మార్పులకు గురవడం వల్ల పెద్ద వయసులో అల్జీమర్స్ వేధిస్తుంది. తేదీలు మర్చిపోవడం, దారులను గుర్తు పెట్టుకోలేకపోవడం, ఒక చోటకు వెళ్లి తిరిగొచ్చే దారిని గుర్తు తెచ్చుకోలేకపోవడం లాంటివన్నీ అల్జీమర్స్ లక్షణాలు. ఈ సమస్యను పూర్తిగా సరిదిద్దడం కష్టమే!

జ్ఞాపకశక్తి తగ్గడానికి కారణాలివే...

హైపోథైరాయిడిజం: ఈ సమస్యలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది.

విటమిన్ బి12: శాకాహారుల్లో ఈ విటమిన్ లోపం వల్ల జ్ఞాపకశక్తి తగ్గుతుంది.

లాంగ్ కొవిడ్: కొవిడ్ సోకిన వ్యక్తుల్లో దీర్ఘకాలం పాటు ఆ ప్రభావం కొనసాగి మతిమరుపు సమస్య వేధిస్తుంది.

మాదకద్రవ్యాలు: వీటి వాడకం వల్ల మెదడు ప్రభావితమై జ్ఞాపకశక్తి తగ్గుతుంది.

మందుల ప్రభావం: ఆందోళన, మానసిక కుంగుబాటు, నిద్రలేమి మందులతో మతిమరుపు తలెత్తుతుంది.

మద్యపానం: మద్యపాన ప్రియుల్లో బి6 విటమిన్ లోపించి, తత్ఫలితంగా మతిమరుపు మొదలవుతుంది.

మెదడులో గడ్డలు: మెదడులోని జ్ఞాపకశక్తి కేంద్రాల్లో క్యాన్సర్ రహిత గడ్డలు, క్యాన్సర్ గడ్డలు, క్షయ తలెత్తడం వల్ల జ్ఞాపకశక్తి లోపిస్తుంది.

సబ్‌డ్యురల్ హెమటోమా: మెదడు ఉపరితలంలో రక్తం గడ్డకట్టే సమస్య ఇది. పెద్దల్లో కనిపిస్తూ ఉంటుంది. తలకు చిన్న చిన్న దెబ్బలు తగిలినప్పుడు, అవి అంత తీవ్రమైనవి కాకపోయినా, వీరిలో సబ్‌డ్యురల్ హెమటోమా తలెత్తి, ఫలితంగా మతిమరుపు మొదలవుతుంది.

మెదడు పదును పెరిగేలా...

మెదడును ఎంత చురుగ్గా ఉంచుకుంటే జ్ఞాపకశక్తి అంత మెరుగ్గా ఉంటుంది. కాబట్టి మెదడుకు నిరంతరం పని పెడుతూ ఉండాలి. అందుకోసం....

- కొత్త అభిరుచిని అలవరుచుకోవాలి.
- డిజిటల్ డిటాక్స్ అనుసరించాలి.
- కథలు, వ్యాసాలు చదవడం, విశ్లేషించడం చేయాలి.
- సామాజిక సంబంధాలు కొనసాగించాలి.
- పజిల్స్, సుడోకులు సాధన చేయాలి.
- ఖాళీగా కూర్చునే బదులు మెదడుకు పని కల్పించే పనులకు పూనుకోవాలి.

ధూమపానం: ఈ అలవాటు వల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి, బ్రెయిన్ స్ట్రోక్ లేదా స్మాల్ వెజెల్ ఇస్కీమియాలతో జ్ఞాపకశక్తి కూడా తగ్గుతుంది

అయితే ఇవన్నీ సరిదిద్దే వీలున్న సమస్యలు. వీటి మూల కారణాలను సరిదిద్దుకోగలిగితే కోల్పోయిన జ్ఞాపకశక్తిని తిరిగి పొందవచ్చు.

తలకు దెబ్బలు తగిలినప్పుడు...

తలకు తగిలే దెబ్బలు కంకషన్, కంట్యూషన్, లాసిరేషన్ అనే మూడు రకాలుగా ఉంటాయి.

కంకషన్: కంకషన్‌లో తలెత్తే మతిమరుపు తాత్కాలికమైనది. ఆ సమయంలో ఏం జరిగిందో, ఎక్కడున్నారో గుర్తుండదు. ఇలా స్వల్ప కాలపు మతిమరుపును వైద్య పరిభాషలో ల్యూసిడ్ ఇంటర్వెల్ అంటారు. ఇది తాత్కాలిక మతిమరుపు మాత్రమే! తర్వాత మళ్లీ వాళ్ల జ్ఞాపకశక్తి మునుపటిలాగే మెరుగుపడుతుంది

కంట్యూషన్: కంకషన్‌కూ లాసిరేషన్‌కూ మధ్య స్థితి. మెదడు ఉపరితలానికి దెబ్బ తగిలి రక్తం గూడు కట్టుకోడాన్ని కంట్యూషన్‌గా భావించాలి. ఆ స్థితిలో కూడా మతిమరుపు తలెత్తుతుంది. ఈ దెబ్బ తగిలిన వ్యక్తుల్లో 70% మందికి సర్జరీ అవసరం ఉండదు. మందులతోనే పరిస్థితి మెరుగుపడుతుంది. కంట్యూషన్ స్థితి తీవ్రమైన సందర్భాల్లో మిగతా 30% మందికి మాత్రమే సర్జరీ అవసరమవుతుంది.


లాసిరేషన్: మెదడు ఉపరితలంతో పాటు మెదడు లోపలి భాగం కూడా దెబ్బతినే సమస్య ఇది. ఈ సమస్యలో మతిమరుపు ఉంటుంది. 70% మేరకు సర్జరీతో మతిమరుపు సమస్యను కూడా సరిదిద్దవచ్చు. అయితే సర్జరీ ఆలస్యమైనా, పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నా, సర్జరీ తదనంతరం కోలుకున్న తర్వాత కూడా మతిమరుపు సమస్య పూర్తిగా తొలగిపోకపోవచ్చు.

పసికందుల్లో మెదడు సమస్యలు

కొందరు పసికందుల్లో పుట్టుకతోనే సెరిబ్రల్ హైపోక్సియా సమస్య వెంటతెచ్చుకుంటారు. ఈ సమస్యలో మెదడు ఎదుగుదల తక్కువగా ఉంటుంది. ఈ పిల్లలు ఎదిగిన తర్వాత కూడా వీరిలో జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుంది. మద్యపానం, ధూమపానం అలవాట్లతో గర్భం దాల్చిన సందర్భాల్లో పుట్టే పిల్లలు తక్కువ బరువుతో పుడుతూ ఉంటారు. ఈ పిల్లల్లో మెదడు ఎదుగుదల కూడా పూర్తి స్థాయిలో ఉండదు కాబట్టి తర్వాతి కాలంలో మతిమరుపు సమస్య కూడా ఎక్కువగానే ఉంటుంది.

మతిమరుపు నియంత్రణ ఇలా...

- ధూమపానం మానేయాలి.
- మద్యపానంలో మితం పాటించాలి.
- పోషకాహారం తీసుకోవాలి.
- క్రమం తప్పక వ్యాయామం చేయాలి.
- మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో ఉంచుకోవాలి.
- క్రమం తప్పక ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలి.
- రోజుకు 7 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి.



డాక్టర్ రంగనాథం
సీనియర్ న్యూరో సర్జన్,
యాస్టర్ ప్రైమ్ హాస్పిటల్,
హైదరాబాద్.

బరువు తగ్గించే 'బెండ'

అధిక పీచుతో పాటు శరీరం శక్తిని ఖర్చు చేసుకోగలిగే ప్రయోజనాలను కలిగి ఉన్న బెండకాయలతో తయారయ్యే పానీయం బరువు తగ్గించే పానీయంగా సర్వత్రా ఆదరణ పొందుతోంది. ఎందుకో తెలుసుకుందాం!



విటమిన్ సి, మెగ్నీషియం, ఫోలేట్‌లతో పాటు నీటిలో కరిగే పీచును కలిగి ఉన్న బెండ జీర్ణశక్తిని పెంచడంతో పాటు ఎక్కువ సమయం పాటు ఆకలిని కూడా నియంత్రించగలుగుతుంది. అలాగే బెండకాయల్లోని పీచు రక్తంలో చక్కెర మోతాదులను స్థిరంగా ఉంచుతుంది. బెండకాయల్లోని జిగురు, పేగులు చక్కెరను శోషించుకునే విధానాన్ని నెమ్మదింపజేసి, కొవ్వు నిల్వతో సంబంధమున్న ఇన్సులిన్ పెరుగుదలను నియంత్రిస్తుంది. అయితే అలాగని నచ్చిన సమయంలో బెండకాయ నీళ్లు తాగితే ఫలితం ఉండదు. అందుకోసం కొన్ని నియమాలు తప్పక పాటించాలి. ఈ నీళ్లను ఉదయం అల్పాహారానికి ముప్పై నిమిషాల ముందు తాగాలి. ఈ నీళ్ల తయారీ కోసం నాలుగు బెండకాయలను పలుచని చక్రాల్లా తరిగి, సీసా నీళ్లలో కలిపి రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచాలి. ఉదయాన్నే ఈ నీళ్లను వడగట్టి బ్రేక్‌ఫాస్ట్‌కు అరగంట ముందు తాగాలి. ఇలా చేస్తే, ఈ నీళ్లలోని పోషకాలన్నిటినీ శరీరం సమర్థంగా శోషించుకోగలుగుతుంది.

అధ్యయనం

మద్యం మాన్పించే నేసల్ స్ప్రే

మద్యం మీదకు మనసును మళ్లించే ఆక్సిటోసిన్ హార్మోన్‌ను ప్రభావితం చేయడం ద్వారా ఆ అలవాటును మాన్పించే దిశగా పరిశోధకులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. వివరాల్లోకి వెళ్తే....

లవ్ హార్మోన్‌గా పేర్కొనే ఆక్సిటోసిన్ సహాయంతో వ్యసనానికి ప్రతికూలంగా స్పందించేలా మెదడులో మార్పు తీసుకొచ్చే ప్రయత్నాలకు పరిశోధకులు పూనుకున్నారు. నేసల్ స్ప్రే ద్వారా ఆక్సిటోసిన్‌ను విడుదల చేసినప్పుడు, మద్యానికి అలవాటు పడిన ఎలుకల మెదళ్లలోని రివార్డ్ సెంటర్స్ స్పందన తీవ్రత తగ్గినట్టు పరిశోధనలో తేలింది. అలాగే అత్యధిక క్యాలరీలు కలిగి ఉన్న



ఆహారాన్ని తినడం ద్వారా కొందర్లో ఈ రివార్డు సెంటర్లు విపరీతంగా స్పందిస్తూ, సదరు వ్యక్తులను ఆహార వ్యసనపరులుగా మారుస్తూ ఉంటాయి. ఆక్సిటోసిన్ నేసల్ స్ప్రేను ఉపయోగించినప్పుడు, ఈ హార్మోన్ ఆకలితో సంబంధమున్న మెదడులోని ప్రదేశాన్ని ప్రేరేపించి, కడుపు నిండిపోయిన భావనకు లోను చేస్తుందనీ, ఫలితంగా అదనపు క్యాలరీల సమస్య కూడా తప్పుతుందని కూడా పరిశోధకులు అంటున్నారు. ఈ ప్రభావాలతో పాటు, శరీరం కొవ్వును ఖర్చు చేసుకునే వేగం, ఇన్సులిన్ సున్నితత్వం, గ్లూకోజ్ వినియోగం మొదలైన బరువుతో సంబంధమున్న అంశాలపరంగా కూడా ఆక్సిటోన్ ప్రభావాన్ని కనబరుస్తుందని పరిశోధకులు చెప్తున్నారు. భద్రత, ప్రభావాలపరంగా ఈ నేసల్ స్ప్రే ప్రయోగాలు సఫలీకృతమైతే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది మద్యపాన వ్యసనపరులు ఈ దురలవాటు ఉంచి విముక్తి పొందగలుగుతారు.

స్కిన్ కేర్



వానల్లో చర్మం ఇలా క్షేమం

వానాకాలంలో అడపా దడపా తడుస్తూ ఉంటాం. వర్షపు నీళ్లలో తడుస్తూనే పనులు చేసుకుంటూ ఉంటాం. అయితే ఇలా నీళ్లలో ఎక్కువగా తడవడం, నానుతూ ఉండడం వల్ల ఈ కాలంలో కొన్ని చర్మ సమస్యల ముప్పు పొంచి ఉంటుంది. వాటి గురించిన అవగాహన కలిగి ఉండడం అత్యవసరం అంటున్నారు చర్మ వైద్యులు.

వానలో తడవడం మనందరం ఇష్టపడతాం! వాతావరణంలోని కాలుష్య కారకాలు, సూక్ష్మక్రిములు వాన నీళ్లలో కలుస్తాయి, వాటి వల్ల చర్మ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వానలో తడిచిన వెంటనే శుభ్రంగా స్నానం చేయడం మంచిది. అలాగే వానలో తడిచిన దుస్తుల్లో ఎక్కువ సమయం పాటు ఉండిపోవడం వల్ల జ్వరం, చర్మం మీద దద్దుర్లు వేధిస్తాయి. అలాగే బాహుమూలలు లాంటి ప్రదేశాల్లోని చర్మపు ముడతల్లో తేమ నిల్వ ఉండిపోయి, ఫంగస్ పెరిగే అవకాశం ఎక్కువ. కాబట్టి ఆయా ప్రదేశాలను కూడా ఈ కాలంలో పొడిగా ఉంచుకోవాలి. వానలో దుస్తులతో పాటు బూట్లు, సాక్సులు కూడా తడిచిపోతూ ఉంటాయి కాబట్టి ప్రతి రోజూ సాక్స్ మారుస్తూ ఉండాలి. అలాగే ఈ కాలంలో గాలి ధారాళంగా చొరబడే సాక్సులు ఎంచుకోవాలి. అలాగే ఇంట్లో ఉన్నప్పటికీ చెప్పులు వేసుకునే నడుస్తూ ఉండాలి.

పాదాలు పాచితే?

నీళ్లలో ఎక్కువగా నానినప్పుడు పాదాలు, వేళ్లు పాచిపోతూ ఉంటాయి. ఇలాంటి ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు దూరంగా ఉండాలంటే తడిచిన పాదాలను వెంటనే పొడి వస్త్రంతో శుభ్రం చేసుకుంటూ ఉండాలి. రాత్రి పడుకోబోయే ముందు పాదాలకూ, వేళ్లకూ మాయిశ్చరైజర్ పట్టించడం మంచిది. ఒకవేళ పాదాలకు ఫంగల్ ఇన్‌ఫెక్షన్ సోకితే యాంటీ ఫంగల్ క్రీమ్‌ను పూసుకోవాలి. దీంతో ఇన్‌ఫెక్షన్ మరింత తీవ్రమవకుండా ఉంటుంది. ఈ జాగ్రత్తలతో కూడా ఇన్‌ఫెక్షన్ అదుపులోకి రానప్పుడు చర్మ వైద్యులను కలవాల్సి ఉంటుంది. యాంటీ ఫంగల్ మాత్రలతో ఈ తరహా ఇన్‌ఫెక్షన్లు



సమర్థంగా అదుపులోకి వస్తాయి. ఈ ఇన్‌ఫెక్షన్‌ను నిర్లక్ష్యం చేస్తే, అన్ని వేళ్లకూ పాకి, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ కూడా సోకి సమస్య మరింత క్లిష్టమవుతుంది. కాబట్టి వెంటనే అప్రమత్తమవుతూ ఉండాలి.

ఇలాంటి చెప్పులు మేలు

ఈ కాలానికి తగ్గట్టు గాలి చొరబడే చెప్పులు, బూట్లు ఎంచుకోవాలి. తడిచిన చెప్పులు, బూట్లు పూర్తిగా ఆరిన తర్వాతే వేసుకోవాలి. ఈ కాలంలో రబ్బరు, ప్లాస్టిక్ చెప్పులను ఎక్కువగా వాడుతూ ఉంటాం. కానీ వీటిలోకి చొరబడిన నీరు అక్కడే నిల్వ ఉండిపోయి, ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతుంది. కాబట్టి వీటికి బదులుగా స్లిపాన్స్ లాంటి బ్రీతబుల్ చెప్పులు ఎంచుకోవాలి. అలాగే ప్రతి ఉదయం, రాత్రి నిద్రకు ముందు పాదాలకూ, వేళ్లకూ తేలికపాటి మాయిశ్చరైజర్ పూసుకుంటూ ఉండాలి.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు దూరంగా...

ఈ కాలంలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు అత్యంత సహజం. వాతావరణంలో పెరిగే తేమ, చెమటల వల్ల చర్మపు ముడతల్లో, గోళ్ల అడుగున ఫంగల్ ఇన్‌ఫెక్షన్ తలెత్తుతుంది. దాంతో దురదలు మొదలవుతాయి. ఆ ప్రదేశంలో గోకడం వల్ల, గోళ్ల ద్వారా ఇన్‌ఫెక్షన్ ఇతర ప్రదేశాలకు సోకుతుంది. కాబట్టి ఈ ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండాలంటే పూర్తిగా ఆరిన దుస్తులే వేసుకోవాలి. వేసవిలో మాదిరిగా ధారాళంగా గాలి చొరబడే దుస్తులే వేసుకోవాలి. బిగుతుగా ఉండే జీన్స్ లాంటి వాటికి ఈ కాలంలో దూరంగా ఉండడమే మేలు. అలాగే చర్మపు ముడతల్లో యాంటీ ఫంగల్ పౌడర్లు వాడుకోవడం ద్వారా ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ పొందవచ్చు. ఈ ఇన్‌ఫెక్షన్ పెరిగి ఆ ప్రదేశమంతా ఎర్రగా మారి, దురద పెడుతుంటే తప్పనిసరిగా చర్మ వైద్యులను కలవాల్సి ఉంటుంది.

ఇతరత్రా సమస్యలు కూడా...

వానాకాలంలో చర్మ సమస్యలతో పాటు ఇంకొన్ని సమస్యలు కూడా పెరుగుతాయి. అవేంటంటే...

- **మొటిమలు:** ఈ కాలంలో వాతావరణంలో తేమ పెరగడం వల్ల చర్మంలోని నూనె గ్రంథులు ఎక్కువ నూనెలను స్రవించడం మొదలుపెడతాయి. దాంతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి, బ్యాక్టీరియా పెరిగిపోతుంది. ఫలితంగా అప్పటికే ఉన్న మొటిమల సమస్య మరింత తీవ్రమవుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. నాన్ గ్రీజీ మాయిశ్చరైజర్లు వాడుకోవాలి. అలాగే వానాకాలంలో ఎండ తక్కువగానే ఉన్నప్పటికీ సన్‌స్క్రీన్ తప్పనిసరిగా వాడుకోవాలి.
- **చుండ్రు:** ఈ కాలంలో వెంట్రుకల కుదుళ్లలో నూనె గ్రంథులు ఎక్కువ నూనెలను స్రవించడం వల్ల, ఫంగస్ పెరిగి, దాంతో పాటు చుండ్రు సమస్య పెరుగుతుంది. వెంట్రుకలు కూడా ఎక్కువగా రాలిపోతూ ఉంటాయి. ఈ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ఈ కాలంలో యాంటీఫంగల్ షాంపూలు వాడుకోవాలి.
- **కీటకాలతో తిప్పలు:** ఈ కాలంలో కీటకాలు కూడా విజృంభిస్తూ ఉంటాయి. ఇవి శరీరం మీద వాలినప్పుడు, కుట్టినప్పుడు, వాటి నుంచి కొన్ని స్రావాలు వెలువడి చర్మం మీద దద్దుర్లు లాంటి ఇన్‌సెక్ట్ బైట్ రియాక్షన్లు తలెత్తుతాయి. కాబట్టి కీటకాలు ఇంట్లోకి చొరబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



డాక్టర్ కె. క్రాంతి వర్మ
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
రెనోవా హాస్పిటల్స్,
సనత్ నగర్, హైదరాబాద్

తెలుసుకుందాం

పుట్టుక మర్మం డీఎన్‌ఏలో భద్రం

ఎగ్ ఫ్రీజింగ్.. ఎంబ్రియో ఫ్రిజింగ్.. డీఎన్‌ఏ పరీక్షలు.. ఇలా ప్రతి రోజు వార్తల ద్వారా అనేక పదాల గురించి వింటూ ఉంటాం. వీటన్నింటికీ ఉన్న సంబంధం ఏమిటి అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.



డీఎన్‌ఏ టెస్ట్


ప్రతి వ్యక్తికి తన తల్లిదండ్రుల ద్వారా డీఎన్‌ఏ సంక్రమిస్తుంది. ఇది ఆ వ్యక్తికి మాత్రమే ప్రత్యేకంగా ఉంటుంది. ఈ డీఎన్‌ఏలో ఆ వ్యక్తి పుట్టుక రహస్యాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి. ఒకప్పుడు ఈ పరీక్షలను ఒక వ్యక్తి ఉన్న జన్యు లోపాలను గుర్తించటానికి చేసేవారు. ఆ తరువాతి కాలంలో ఒక బిడ్డకు తల్లితండ్రులెవ్వరనే విషయాన్ని తెలియజేయటానికి కూడా ఈ పరీక్షలు చేయడం మొదలుపెట్టారు. డీఎన్‌ఏ పరీక్ష ప్రక్రియలో మొదట తల్లితండ్రుల నుంచి, వారికి పుట్టిన బిడ్డ నుంచి రక్తనమూనాలను సేకరిస్తారు. వాటి నుంచి డీఎన్‌ఏ సంగ్రహిస్తారు. ఈ డీఎన్‌ఏలను పోల్చి చూసి... ఆ బిడ్డ ఆ తల్లితండ్రులకే పుట్టాడా? లేదా? అనే విషయాన్ని తెలుసుకుంటారు. ఈ మధ్య కాలంలో ఐవీఎఫ్ చికిత్సకు సంబంధించిన అంశాలపై వివాదాలు తలెత్తినప్పుడు వాటి పరిష్కారానికి డీఎన్‌ఏ పరీక్షలను చేస్తున్నారు. సాధారణంగా ఐవీఎఫ్ చికిత్స పద్ధతిలో భార్య నుంచి అండాన్ని, భర్త నుంచి వీర్యకణాలను సంగ్రహించి వాటిని ఫలదీకరణం చెందిస్తారు. అలా ఫలదీకరణం చెందిన పిండాన్ని భార్య గర్భంలో ప్రవేశపెడతారు. కొన్నిసార్లు అండం ఆరోగ్యకరంగా లేకపోయినా, వీర్యకణాలకు తగినంత సామర్థ్యం లేకపోయినా... వాటిని ఇతర దాతల నుంచి సేకరిస్తారు. గర్భం దాల్చటానికి అనుకూలమైన పరిస్థితులు లేనప్పుడు... ఇంకొక ఆరోగ్యకరమైన మహిళ గర్భంలో పిండాన్ని చొప్పిస్తారు. దీనినే 'సరోగసి' అంటారు. సాధారణంగా ఈ అంశాలన్నింటినీ చాలా రహస్యంగా ఉంచుతారు. కొన్నిసార్లు ఐవీఎఫ్ క్లినిక్స్‌లో సరైన ప్రొటోకాల్స్ పాటించకపోతే- అండాలు లేదా వీర్యకణాలు తారుమారయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో డీఎన్‌ఏ పరీక్షల ద్వారా అసలు తల్లితండ్రులెవ్వరనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ఈ పరీక్షల్లో ఫలితాలు 99.9 శాతం కచ్చితత్వంతో ఉంటాయి. ఒకప్పుడు కేవలం ప్రభుత్వ పరిశోధనాశాలల్లోనే డీఎన్‌ఏ పరీక్షలు చేసేవారు. ఇప్పుడు ప్రైవేట్ ల్యాబ్స్‌లో కూడా ఈ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి.

ఎగ్ ఫ్రీజింగ్

ప్రతి మహిళ శరీరంలోను అండాలు ఉంటాయి. ఈ అండాలలోకి వీర్యకణాలు ప్రవేశించినప్పుడే పిండం ఏర్పడుతుంది. ఇది సహజంగా జరిగే ప్రక్రియ. కానీ భవిష్యత్ అవసరాల కోసం అండాలను భద్రపరుచుకోవటాన్ని ఎగ్ ఫ్రీజింగ్ అంటారు. ఈ ప్రక్రియలో మహిళల అండాలను సబ్ జీరో టెంపరేచర్‌లో భద్రపరుస్తారు. వీటిని అవసరమైనప్పుడు బయటకు తీసి వాటిని పునరుత్పత్తికి ఉపయోగిస్తారు. ఈ మధ్యకాలంలో మహిళలు పునరుత్పత్తి ఎక్కువగా జరిగే వయస్సులో (20-35 ఏళ్ల మధ్య) తమ వృత్తుల్లో బిజీగా ఉంటున్నారు. ఆ సమయం దాటితే ఆరోగ్యకరమైన అండాల సంఖ్య తగ్గుతూ వస్తుంది. ఆ తర్వాత గర్భం ధరించటం కష్టమవుతుంది. ఈ వయస్సులో పిల్లలు కనటానికి ఇష్టం లేని వారు- ఆరోగ్యకరమైన తమ అండాలను భవిష్యత్తు కోసం దాచుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో 30 ఏళ్లు దాటిన మహిళలు తమ అండాలను దాచుకోవటం బాగా పెరిగింది. దీని కోసం ప్రత్యేక సంస్థలు వెలిసాయి. ఈ సంస్థలు ఎగ్ ఫ్రీజింగ్‌కు 1.5 నుంచి 2 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నాయి. దీనితో పాటు ప్రతి ఏడాది 30 నుంచి 40 వేల రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ అండాలు సుమారు 30 ఏళ్ల పాటు ఆరోగ్యంగా ఉంటాయి.

ఎంబ్రియో ఫ్రీజింగ్

పిండం ఏర్పడిన తర్వాత దానిని భద్రపరుచుకోవటాన్ని ఎంబ్రియో ఫ్రీజింగ్ అంటారు. ఈ పిండాన్ని జంటకు నచ్చిన సమయంలో గర్భంలో ప్రవేశపెట్టవచ్చు. ఇది కూడా 30 ఏళ్ల వరకు ఆరోగ్యంగానే ఉంటుంది. చాలా మంది పిండం ఏర్పడిన తర్వాత దానిని భద్రపరిస్తే భవిష్యత్తులో అది పనికిరాదని భావిస్తూ ఉంటారు. కానీ ఇది నిజం కాదని పునరుత్పత్తి నిపుణులు చెబుతున్నారు. ఈ మధ్యనే 30 ఏళ్ల పాటు భద్రపరిచిన పిండం ద్వారా ఒక మహిళ గర్భం దాల్చింది. ఎంబ్రియో ఫ్రిజింగ్‌కు 2.5 లక్షల రూపాయల దాకా ఖర్చు అవుతుంది. ప్రతి ఏడాది సుమారు 60 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది.



తాను పుట్టకముందే ప్రత్యర్థి హంపికి గ్రాండ్ మాస్టర్ హోదా.. ఎన్నో అంతర్జాతీయ టోర్నీలు గెలిచిన అనుభవం.. అయితేనేం, యువ కెరటం దివ్యా దేశ్‌ముఖ్ సంచలన ఆటతీరుతో అదరగొట్టింది. తనకంటే రెట్టింపు వయసున్న హంపిని ఓడించి.. వరల్డ్‌కప్ సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించింది. టీనేజ్‌లోనే అద్భుతం చేసిన 19 ఏళ్ల దివ్య.. 64 గళ్ల ఆటలో యువరాణిగా చెస్ ప్రపంచాన్ని శాసించేందుకు సిద్ధమైంది.

దివ్య చరితం

మహిళల చెస్ ప్రపంచకప్ విజేత దేశ్‌ముఖ్

- ఈ ఘనత సాధించిన పిన్నవయస్కురాలిగా రికార్డు
- ఫైనల్ టైబ్రేక్‌లో హంపికి నిరాశ

గ్రాండ్ మాస్టర్ హోదా కూడా సొంతం

ఇది ఆరంభమే

"ఈ విజయాన్ని జీర్ణించుకోవడానికి నాకు కొంత సమయం కావాలి. ఒక్క జీఎం నార్మ్‌కూడా లేని నాకు.. ఈ తరహాలో గ్రాండ్ మాస్టర్ హోదా దక్కడాన్ని నమ్మలేకపోతున్నా. అంతా అదృష్టంగా భావిస్తా. ఈ విజయం ఆరంభం మాత్రమే..!" — దివ్యా దేశ్‌ముఖ్

- ఫిడే మహిళల ప్రపంచకప్ నెగ్గిన దివ్యకు, రన్నరప్ హంపికి అభినందనలు. ఫైనలిస్టులు ఇద్దరు భారత్ నుంచే కావడం గర్వించదగ్గ అంశం. మన దేశంలో మహిళలకు అపారమైన ప్రతిభ ఉందనేందుకు ఇదే నిదర్శనం. - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అద్భుతమైన ఇద్దరు భారత క్రీడాకారిణుల మధ్య చరిత్రాత్మక ఫైనల్. విజేత దివ్యకు అభినందనలు. అమోఘమైన పోరాటం ప్రదర్శించిన హంపికి కూడా అభినందనలు. -ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రపంచకప్ గెలవడం, జీఎం హోదా దక్కడం, క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించడం.. ఒకేసారి ఇన్ని ఘనతలు అందుకున్న దివ్యకు అభినందనలు. ఉత్కంఠభరితమైన పోరు. హంపి గొప్ప పోరాటస్ఫూర్తిని కనబర్చింది. భారత చదరంగానికి అతిపెద్ద సంబరం తీసుకొచ్చిన క్షణం. - విశ్వనాథన్ ఆనంద్

చెస్‌లో మనదే ఆధిపత్యం

ప్రస్తుతం ప్రపంచ చదరంగంలో భారత్‌దే ఆధిపత్యం. ఏకంగా ఐదు టైటిళ్లు మన ఖాతాలోనే ఉండడమే ఇందుకు నిదర్శనం.

1 ప్రపంచ చాంపియన్ - గుకేశ్
2 పురుషుల ఒలింపియాడ్ విజేత - భారత్
3 మహిళల ఒలింపియాడ్ విజేత - భారత్
4 మహిళల ప్రపంచ ర్యాపిడ్ విజేత - హంపి
5 మహిళల ప్రపంచ కప్ విజేత - దివ్య

88వ భారత జీఎం..

వరల్డ్‌కప్ విజేతగా నిలవడంతో గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదాకు కావాల్సిన నార్మ్‌ను దివ్య సొంతం చేసుకొంది. ఈ క్రమంలో భారత 88వ గ్రాండ్ మాస్టర్‌గా అవతరించింది. హంపి, హారిక, వైశాలి తర్వాత దేశ నాలుగో మహిళా జీఎంగా రికార్డులకెక్కింది. 2002లో హంపి జీఎం హోదా సాధించింది. అప్పటికి దివ్య జన్మించనే లేదు. 2005లో పుట్టిన దివ్య గత మూడేళ్లలోనే కెరీర్‌లో వేగంగా ఎదిగింది.

ధోనీలాగే..

ధోనీ తరహాలోనే దివ్య కూడా ఒత్తిడిలో ఎంతో అద్భుతమైన ప్రదర్శన చేస్తుందని ఆమె మాజీ కోచ్ శ్రీనాథ్ చెప్పాడు. 'ఆమె ఎంతో దూకుడుగా ఆడేది. కానీ, అనుభవం పెరుగుతున్న కొద్దీ మూడు ఫార్మాట్లలోనూ ఆల్‌రౌండర్‌గా మారింది. ఎంతో ఒత్తిడిలోనూ కూల్‌గా ఆడడం దివ్య ప్రత్యేకత. ధోనీ ఎలా రిస్క్ తీసుకొని మ్యాచ్‌లు గెలుస్తాడో.. ఆమె కూడా నరాలు తెగే ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేస్తుంది' అని శ్రీనాథ్ ప్రశంసించాడు.



బటూమి (జార్జియా): ఎంతో ఉత్కంఠగా సాగిన మహిళల వరల్డ్‌కప్ టైబ్రేక్‌లో 19 ఏళ్ల దివ్యా దేశ్‌ముఖ్ అదరగొట్టింది. తెలుగు క్రీడాకారిణి కోనేరు హంపితో జరిగిన మెగా ఫైనల్లో సోమవారం జరిగిన టైబ్రేక్‌లో దివ్య 2.5-1.5తో విజయం సాధించింది. ఈ విక్టరీతో ప్రతిష్ఠాత్మక చెస్ వరల్డ్‌కప్ టైటిల్‌ను సొంతం చేసుకొన్న తొలి భారత, పిన్నవయస్కురాలిగా దివ్య చరిత్ర సృష్టించింది. అంతేకాదు.. గ్రాండ్ మాస్టర్ హోదాను కూడా దక్కించుకొంది. మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్స్, ప్రపంచకప్ మినహా అన్ని టైటిళ్లు నెగ్గిన హంపి.. చిరకాల స్వప్నానికి అడుగుదూరంలోనే నిలిచిపోయింది. విశ్వనాథన్ ఆనంద్ (2000, 2002) తర్వాత చెస్ వరల్డ్‌కప్ గెలిచిన భారత ప్లేయర్‌గా దివ్య రికార్డులకెక్కింది.

హోరా హోరీగా: టైటిల్ ఫైట్‌లో తొలి రెండు క్లాసిక్ గేమ్‌లు డ్రా కావడంతో హంపి, దివ్య 1-1తో సమంగా నిలిచారు. నిర్ణాయక టైబ్రేక్‌లో తొలి రెండు ర్యాపిడ్ గేమ్‌ల సెట్‌లో తీవ్ర ఒత్తిడి మధ్య దివ్య 1.5-0.5తో హంపికి ఝలకిచ్చింది. ర్యాపిడ్ గేమ్-1లో ఇద్దరూ బలగాలను నడిపించారు. 81 ఎత్తులపాటు పోరాడినా ఈ గేమ్ డ్రాగా ముగిసింది. తెల్లపావులతో ఆడిన దివ్య కింగ్ పాన్ ఓపెనింగ్ చేయగా.. పెట్రోఫ్ డిఫెన్స్‌ను ఎంచుకొన్న హంపి తొలి ఎత్తులోనే డ్రాకు ప్రయత్నిస్తున్నట్టు అర్థమైంది.

కూల్చేసిన 'సమయం': రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడిన హంపి కాటలాన్ ఓపెనింగ్ ఎంచుకోగా.. ముందుగానే సన్నద్ధమైన దివ్య అదే రీతిలో కౌంటర్ ఇచ్చింది. ఆరంభంలో దేశ్‌ముఖ్ వేగంగా ఎత్తులు వేస్తే.. హంపి మాత్రం కొంత సమయం తీసుకోవడంతో ఆమెపై క్రమంగా ఒత్తిడి పెరిగింది. అయితే, ఇద్దరూ బలగాల్లో సమంగా నిలిచారు. దీంతో ఈ గేమ్ కూడా డ్రాగానే భావించారు. కానీ, 40వ ఎత్తులో ఒక్కసారిగా సంయమనం కోల్పోయిన హంపి.. పాన్‌ను త్యాగం చేసి ప్రత్యర్థి కోటలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేసింది. మిడిల్ గేమ్‌లో వైట్ పాన్‌ను చంపిన దివ్య.. ఆ తర్వాత క్వీన్‌ను త్యాగం చేసింది. ఈ క్రమంలో 54వ ఎత్తులో ప్రత్యర్థి పాన్‌ను చంపిన హంపి తప్పిదం చేసింది. దీంతో ఎక్కువ ఖాళీ రావడంతో దేశ్‌ముఖ్ తన బలగాలను స్వేచ్ఛగా కదిలించగలిగింది. అయితే, ఎండ్‌గేమ్‌లో కోనేరు చేసిన తప్పిదం, సమయాభావంతో దివ్య గెలిచే స్థితిలో నిలిచింది. ఆఖరికి 75వ ఎత్తు అనంతరం హంపి రిజైన్ చేయడంతో.. దివ్య భావోద్వేగంలో మునిగిపోయింది.

ప్రైజ్‌మనీ
దివ్యకు - రూ. 43 లక్షలు
హంపికి - రూ. 30 లక్షలు



వచ్చేసింది.. యువరాణి

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అంచనాలను మించి రాణించడం. అద్భుత ఆటతీరుతో అబ్బురపరచడం. ఆమె నైజం. కీలక దశలో ఒత్తిడిని అధిగమించడం. పరాజయం తప్పదనుకున్న చోట గెలిచి చూపించడం. ఆమెకు అలవాటు. 18 ఏళ్లకే జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్ నెగ్గడం.. 19 ఏళ్లకే సీనియర్ ప్రపంచ కప్‌ను ముద్దాడడం.. పిన్న వయసులోనే ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికవడం.. ఇలా ఎన్నెన్నో ఘనతలు చిరుప్రాయంలోనే సొంతం చేసుకున్న దివ్యా దేశ్‌ముఖ్ పేరుకే టీనేజర్.. చెస్ బోర్డు ఎదురుగా ఉంటే తనదైన వ్యూహాలతో పావులు కదుపుతుంది.. ఎంత అనుభవమున్న ప్రత్యర్థినైనా గెలుపు ఎత్తులతో చిత్తు చేస్తుంది. అసాధారణ విజయాలతో ఇప్పుడు మహిళల చదరంగానికి యువరాణిగా పట్టాభిషేకం అందుకుంది.

అనుకోకుండా చెస్‌లోకి..: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన దివ్య తల్లిదండ్రులు జితేంద్ర, నమ్రత ఇద్దరూ డాక్టర్లు. ఐదేళ్ల వయసులో 2010లో దగ్గరలోని అకాడమీలో అక్కతో కలసి బ్యాడ్మింటన్‌లో కోచింగ్ కోసమని వెళ్లింది. అయితే, ఎత్తు తక్కువగా ఉండడంతో ఆమెను చెస్‌లో జాయిన్ చేశారు. క్రమంగా ఆటపై మక్కువ పెంచుకొన్న దివ్య రెండేళ్లలోనే పుదుచ్చేరిలో జరిగిన అండర్-7 నేషనల్స్‌లో స్వర్ణం సాధించింది. 2013లో ఇరాన్‌లో జరిగిన పోటీల్లో అండర్-8 ఆసియా విజేతగా నిలిచిన దేశ్‌ముఖ్.. వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకొంది. 2014లో అండర్-10 వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత 40 సార్లు దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె.. 35 సార్లు పోడియం ఫినిష్ చేసింది. 23 స్వర్ణ, 7 రజత, 5 కాంస్య పతకాలు కొల్లగొట్టింది. 2020లో భారత జట్టు చెస్ ఒలింపియాడ్ గెలవడంలో తనదైన పాత్ర పోషించింది. 18 ఏళ్ల వయసులో ఆసియా చెస్ కిరీటాన్ని అందుకొంది. గతేడాది జూన్‌లో వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గి పిన్నవయసులోనే ఈ ఘనత సాధించిన అమ్మాయిగా రికార్డు సృష్టించింది. జూనియర్ విభాగంలో నెంబర్‌వన్ ర్యాంక్‌ను సైతం సొంతం చేసుకొంది. దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటూ రెండేళ్ల క్రితమే ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదాను సొంతం చేసుకొంది. ఇప్పుడు భారత మహిళల చదరంగంలో నెంబర్‌వన్‌గా విరాజిల్లుతున్న హంపినే ఓడించి ప్రపంచ కప్‌తో సరికొత్త చరిత్ర సృష్టించింది.

మరో ఆటగాడిని అనుమతించాలి

గాయాలపై కోచ్ గంభీర్

మాంచెస్టర్: మ్యాచ్ సందర్భంగా క్రికెటర్ తలకు గాయమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అతడి స్థానంలో మరో ప్లేయర్‌ను అనుమతిస్తుంటారు. అలా వచ్చే ఆటగాడికి బ్యాటింగ్, బౌలింగ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే తల కాకుండా ఇతర శరీర భాగాలకు గాయాలైతే ఈ వెసులుబాటు లేదు. ఇదే విషయమై భారత జట్టు కోచ్ గంభీర్ స్పందించాడు. 'ఓ ఆటగాడి గాయం తీవ్రతను రెఫరీ, అంపైర్ పరిశీలించాక సబ్‌స్టిట్యూట్‌ను ఆడించడంపై నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో సిరీస్ హోరాహోరీగా సాగుతోంది. ప్రత్యర్థి 11 మంది ఆటగాళ్లతో ఆడుతుంటే మేం పది మందితో ఎలా పోరాడగలం?' అని గంభీర్ ప్రశ్నించాడు.

శార్దూల్, అన్షుల్ కష్టమే..

మాంచెస్టర్: నాలుగో టెస్టులో విఫలమైన పేసర్లు శార్దూల్ ఠాకూర్, అన్షుల్ కాంబోజ్‌లపై వేటు పడే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో గురువారం నుంచి జరిగే ఐదో టెస్టులో భారత్ పటిష్ఠ జట్టుతో బరిలోకి దిగాలనుకుంటోంది. ముఖ్యంగా బౌలింగ్ కూర్పుపై దృష్టిసారిస్తోంది. ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటర్లు ఉండాలనే ఉద్దేశంలో స్పెషలిస్ట్ బౌలర్ సేవలను కోల్పోవాల్సి వస్తోంది. 2014 తర్వాత ప్రత్యర్థికి 600+ పరుగులు సమర్పించుకున్న భారత్ ఈసారి ఎలాంటి తప్పూ చేయాలనుకోవడం లేదు. అన్షుల్ స్థానంలో ఆకాశ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ పోటీ పడనున్నారు. ఇక నాలుగో బౌలర్‌గా స్పిన్నర్ కుల్దీప్‌ను ఆడించే అవకాశం ఉంది. మరోవైపు భారత జట్టు మాంచెస్టర్ నుంచి సోమవారం రైలులో లండన్‌కు చేరుకుంది. అలాగే నేటి మధ్యాహ్నం 2 గంటల నుంచి తమ ప్రాక్టీస్‌ను ఆరంభించనుంది.

ఇంగ్లండ్ జట్టులోకి ఒవర్టన్

లండన్: భారత్‌తో జరిగే ఐదో టెస్టు కోసం పేసర్ జేమీ ఒవర్టన్‌ను ఇంగ్లండ్ తిరిగి రప్పించింది. తొలి మూడు టెస్టుల్లో అతడు జట్టుతో పాటే ఉండగా.. మాంచెస్టర్ మ్యాచ్‌కు ముందే కౌంటీల కోసం విడుదల చేశారు. అయితే నాలుగో టెస్టులో ఇంగ్లండ్ బౌలర్లు అలసిపోయారు. గురువారం నుంచే ఆఖరి టెస్టు జరుగనుండడంతో ముందు జాగ్రత్తగా పేస్ ఆల్‌రౌండర్ ఒవర్టన్‌ను రప్పించారు. భుజం నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ స్టోక్స్ చివరి టెస్టుకు అందుబాటులో ఉంటానని ప్రకటించాడు.

నేటి నుంచి మకావు ఓపెన్

మకావు: భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి ఈ సీజన్‌లో పలు టోర్నీలలో నిలకడగా రాణిస్తున్నా టైటిల్ మాత్రం అందడం లేదు. ఈనేపథ్యంలో మంగళవారం నుంచి జరిగే మకావు ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలవాలని వారు పట్టుదలగా ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, ప్రణయ్, ఆయుష్, మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, అనుపమ, ఆకర్షి తలపడుతున్నారు. డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా, ప్రియ/శ్రుతి, మిక్స్‌డ్‌లో ధ్రువ్/తనీష, రుత్విక/రోహన్ బరిలో ఉన్నారు.

మళ్లీ ద్విచక్ర వాహన మార్కెట్లోకి కైనెటిక్

కైనెటిక్ డీఎక్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ విడుదల



న్యూఢిల్లీ: కైనెటిక్ ఇంజనీరింగ్ ద్విచక్ర వాహనాల విభాగంలోకి తిరిగి ప్రవేశించింది. ఒకప్పుడు అద్భుతమైన ప్రజాదరణ పొందిన కైనెటిక్ డీఎక్స్ స్కూటర్‌లో విద్యుత్ వెర్షన్‌ను సోమవారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ స్కూటర్ ఒకసారి చార్జింగ్ చేస్తే 116 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. కైనెటిక్ డీఎక్స్, డీఎక్స్ ప్లస్ పేరుతో అందుబాటులో ఉండనున్న ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ధర వరుసగా రూ.1,11,449, రూ.1,17,499 (పుణె ఎక్స్‌షోరూమ్) గా ఉన్నాయి. కాగా ఉత్పత్తిని, సేల్స్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాబోయే 18 నెలల కాలంలో రూ.177 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నామని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ అజింక్యా ఫిరోడియా ఈ సందర్భంగా చెప్పారు. అప్పటికి 6-8% మార్కెట్ వాటాతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగంలో మూడు అగ్రగామి కంపెనీల్లో ఒకటిగా నిలవాలన్నది తమ ఆకాంక్ష అన్నారు. దశలవారీగా ఉత్పత్తిని పెంచుతూ ఆ సమయానికి 1.5 లక్షల యూనిట్ల అమ్మకాల లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నట్టు చెప్పారు.

మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ లాభంలో 35 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.22.40 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.16.53 కోట్లతో పోల్చితే 35.50 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం అమ్మకాలు కూడా 22.28 శాతం వృద్ధితో రూ.196.72 కోట్ల నుంచి రూ.240.55 కోట్లకు పెరిగాయి. నిర్వహణాపరంగా సామర్థ్యాలు పెంచుకోవటంతో పాటు ఉత్పత్తుల వివిధీకరణ, వినియోగదారు ఆధారిత వ్యూహాలపై ప్రధానంగా దృష్టి పెట్టడం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ వెల్లడించింది.



ప్రముఖ ఆభరణాల రిటైల్ సంస్థ జోయాలుక్కాస్.. గుంటూరులో 'బ్రిలియన్స్ డైమండ్ జువెలరీ షో' ప్రారంభించింది. ఈ జువెలరీ షోలో గుంటూరు పశ్చిమ శాసన సభ్యురాలు గల్లా మాధవి, జోయాలుక్కాస్ డీజీఎం (రిటైల్) రాజేశ్ కృష్ణన్, రీజినల్ మేనేజర్ రేజిష్ ఓఎస్ పాల్గొన్నారు.

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.67,000 కోట్లు

జూన్ చివరి నాటికి బ్యాంకుల్లో ఉన్న మొత్తం ఇది

న్యూఢిల్లీ: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల వద్ద అన్‌క్లెయిమ్డ్ (ఎవరూ తమవిగా క్లెయిమ్ చేయని) డిపాజిట్ల మొత్తం కొండలా పేరుకుపోతోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఈ మొత్తం రూ.67,003 కోట్లకు చేరుకుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద ఉన్న సొమ్ము రూ.58,330.26 కోట్లు కాగా ప్రైవేట్ బ్యాంకుల వద్ద ఉన్న సొమ్ము రూ.8,673.72 కోట్లు. ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయం తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.19,329.92 కోట్లు), ప్రైవేటు బ్యాంకుల్లో ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.2,063.45 కోట్లు) వద్ద గరిష్ఠంగా ఈ నిధులున్నాయి. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించిన సమాచార లభ్యతను సరళం చేసేందుకు ఆర్‌బీఐ ఉద్గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు-గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్) పేరిట కేంద్రీయ వెబ్ పోర్టల్ ఒకటి ప్రారంభించింది. ఈ పోర్టల్ ద్వారా రిజిస్టర్డ్ వినియోగదారులు అన్ని బ్యాంకుల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల సమాచారాన్ని పొందవచ్చు. జూలై ఒకటో తేదీ నాటికి 8,59,683 మంది యూజర్లు ఈ పోర్టల్‌పై రిజిస్టర్ అయ్యారు. డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ స్కీమ్, 2014 కింద నిధి నిర్వహణతో పాటు ఆ డిపాజిట్లలోని సొమ్ము వినియోగానికి సంబంధించిన అంశాలు పరిశీలించేందుకు ఒక కమిటీ ఉంటుందని మంత్రి వెల్లడించారు. డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణకు, ఆర్‌బీఐ నిర్దేశకత్వం మేరకు ఈ ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించిన ఇతర అంశాలకు ఈ నిధిని వినియోగించవచ్చు.



ఏ బ్యాంకు వద్ద ఎంత?

బ్యాంకు	సొమ్ము (రూ.కోట్లలో)
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	19,329.92
పంజాబ్ నేషనల్ బ్యాంక్	6,910.67
కెనరా బ్యాంక్	6,278.14
ఐసీఐసీఐ బ్యాంక్	2,063.45
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,609.56
యాక్సిస్ బ్యాంక్	1,360.16

'బీమా' సామర్థ్యాల పెంపు కోసమే ఎఫ్‌డీఐ పరిమితి పెంపు

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితి వంద శాతానికి పెంపు ఆ రంగం పూర్తి సామర్థ్యాలు వినియోగంలోకి వచ్చేందుకు దోహదపడుతుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు తెలిపారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ప్రపంచ వృద్ధిని మించి ఈ రంగం 7.1% వంతున వృద్ధి సాధిస్తుందని అంచనా. ఆర్థిక మంత్రి ఫిబ్రవరిలో ప్రతిపాదించిన 2025-26 కేంద్ర బడ్జెట్లో బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రస్తుత 74 శాతం నుంచి 100 శాతానికి పెంచనున్నట్టు ప్రతిపాదించారు. ఎఫ్‌డీఐ పరిమితి 74% ఉండడం వల్ల విదేశీ బీమా కంపెనీ మిగతా 26% వాటా కోసం దేశీయ భాగస్వామిని అన్వేషించుకోవలసివచ్చేది. కాని తాజా నిర్ణయం వల్ల దేశంలో బీమా కంపెనీ ఏర్పాటు చేయడం సరళం కావడంతో పాటు ఆ రంగంలోకి విదేశీ పెట్టుబడులు స్థిరంగా రావడానికి వీలు ఏర్పడుతుందని నిర్మల తెలిపారు. అలాగే టెక్నాలజీ బదిలీ కూడా తేలికవుతుందని, బీమా వ్యాప్తి, పోటీ సామర్థ్యం పెరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

బిజినెస్

10 నెలల కనిష్ఠానికి పారిశ్రామికం

న్యూఢిల్లీ/ముంబై : పారిశ్రామిక రంగం జూన్ నెలలో నిరాశావహమైన పనితీరు ప్రదర్శించింది. మైనింగ్, విద్యుత్ రంగాలు తీవ్ర వర్షాలకు ప్రభావితం కావడం ఈ రంగాన్ని కుంగదీసింది. ఫలితంగా జూన్‌లో పారిశ్రామిక వృద్ధి రేటు 10 నెలల కనిష్ఠ స్థాయి 1.5 శాతానికి పరిమితమైంది. గత ఏడాది ఆగస్టు తర్వాత ఈ రంగం వృద్ధి ఇంత కనిష్ఠ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ద్వారా మదింపు చేసే ఈ వృద్ధి రేటు గత ఏడాది జూన్‌లో 4.9% ఉంది. కాగా మే నెల పారిశ్రామికాభివృద్ధి గణాంకాలను జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) గతంలో ప్రకటించిన 1.2% నుంచి 1.9 శాతానికి సవరించింది. ఎన్ఎస్ఓ గణాంకాల ప్రకారం జూన్ నెలలో తయారీ రంగం వృద్ధి 3.5% నుంచి 3.9 శాతానికి పెరిగింది.

రెండింతలు పెరిగిన అపోలో మైక్రోసిస్టమ్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో మైక్రోసిస్టమ్స్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.17.68 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.8.42 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా రెండింతలు వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 46.49 శాతం వృద్ధితో రూ.91.78 కోట్ల నుంచి రూ.134.55 కోట్లకు పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ

హైదరాబాద్	400	విజయవాడ	475
వరంగల్	402	గోదావరి	445
చిత్తూరు	463	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	113
కర్నూలు	115	నెల్లూరు	118
విశాఖపట్నం	97	అనంతపురం	118
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,920 ▼	91,650 ▼	1,25,000 ▼
విజయవాడ	1,01,450 ▲	96,250 ▲	1,16,200 ▼
విశాఖపట్నం	1,00,840 ▼	91,600 ▲	1,26,000 ▼
రాజమండ్రి	99,930 ▼	91,600 ▼	1,18,000 ▼
ప్రొద్దుటూరు	98,900 ▲	90,990 ▲	1,16,300 ▼
ముంబై	98,446 ▼	90,177 ▼	1,12,984 ▼

రూ.12,000 లక్షల కోట్ల చెల్లింపులు..

65,000 కోట్ల లావాదేవీలు
గత 6 ఏళ్లలో జరిగిన డిజిటల్ పేమెంట్స్ ఇవి..



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల్లో భారత్ దూసుకెళ్తోంది. గత ఆరేళ్లలో (2019-20 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు) రూ.12,000 లక్షల కోట్లకు పైగా విలువైన 65,000 కోట్లకు పైగా డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు జరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు వెల్లడించారు. దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని మరింత పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), ఫిన్‌టెక్‌లు, బ్యాంక్‌లు, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సంబంధిత వర్గాలందరితో కలిసి పనిచేస్తున్నట్టు మంత్రి తెలిపారు. చిన్న నగరాలు, ఈశాన్య రాష్ట్రాలు, జమ్ము కశ్మీర్‌లో డిజిటల్ చెల్లింపుల స్వీకరణకు అవసరమైన మౌలిక వసతులను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ 2021లో పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఐడీఎఫ్)ను ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. 2025 మే 31 నాటికి పీఐడీఎఫ్ ద్వారా 4.77 కోట్ల డిజిటల్ టచ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ప్రపంచంలో అతిపెద్ద చెల్లింపుల వ్యవస్థగా యూపీఐ

కొవిడ్ సంక్షోభ సమయం నుంచి దేశంలో డిజిటల్ చెల్లింపులు ఊపందుకున్నాయి. పెద్ద నగరాల నుంచి పల్లెల వరకు అన్ని ప్రాంతాల్లోనూ డిజిటల్ చెల్లింపుల సాంకేతికత, మౌలిక వసతులు వేగంగా విస్తరించింది. దేశంలో చౌక డేటా సేవలతో స్మార్ట్‌ఫోన్ల వినియోగం అనూహ్యంగా పెరగడం ఈ విప్లవాత్మక మార్పునకు ప్రధాన చోదకంగా పనిచేసింది. ఎన్‌పీసీఐ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్ సిస్టమ్ (యూపీఐ) ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద రిటైల్ రియల్ టైమ్ చెల్లింపుల వ్యవస్థగా ఎదిగింది. ప్రపంచంలో అతిపెద్ద ఇంటర్ బ్యాంక్ పేమెంట్ సెటిల్‌మెంట్ ప్లాట్‌ఫామ్ వీసా రోజువారీ లావాదేవీల సంఖ్యకు చేరువలో ఉంది. గత నెల 2న యూపీఐ ద్వారా రికార్డు స్థాయిలో 65 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఎన్‌పీసీఐ డేటా ప్రకారం.. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మహారాష్ట్రలో అత్యధిక యూపీఐ లావాదేవీలు జరగగా.. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

కోటక్ షేర్లు పడేశాయ్..

సెన్సెక్స్ 572 పాయింట్లు పతనం ● రెండు నెలల కనిష్ఠానికి సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయి దాదాపు రెండు నెలల (జూన్ 4 తర్వాత) కనిష్ఠ స్థాయిలో ముగిశాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 687 పాయింట్లు క్షీణించింది. చివరికి 572.07 పాయింట్ల నష్టంతో 80,891.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156.10 పాయింట్లు కోల్పోయి 24,680.90 వద్ద క్లోజైంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు భారీగా క్షీణించడంతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ఇందుకు ప్రధాన కారణం. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 నష్టపోగా.. గత వారాంతంలో నిరాశాజనక త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన కోటక్ బ్యాంక్ షేరు ఏకంగా 7.50 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టీసీఎస్ 12,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించడంతో షేరు ధర 1.76 శాతం తగ్గింది.

అదానీకి అనుమతులు రద్దు

- గిరిజనులకు అన్యాయం చేస్తూ ఆనాడు ఆంధ్రా, ఒడిసా సరిహద్దులో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు
- వాటిని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, ఒడిసా సరిహద్దు ప్రాంతంలో గిరిజనులకు దక్కాల్సిన పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలను అదానీకి కట్టబెడుతూ మాజీ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. మన్యం పార్వతీపురం జిల్లా కురుకుట్టిలో 1200 మెగావాట్లు, కర్రివలసలో 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలకు గతంలో ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తూ సోమవారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రాజెక్టులు నిర్మించే ప్రాంతంపై ఆంధ్రా-ఒడిసాల మధ్య దశాబ్దాలుగా సరిహద్దు వివాదం నడుస్తోంది. ఈ ప్రాంతంలో తమ రాష్ట్రానికి చెందిన గిరిజనులతో పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలను నిర్మింపజేస్తామని కేంద్రానికి 2018-24 మధ్య కాలంలో ఒడిసా ప్రతిపాదనలు పంపింది. దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకోకుండా ఆంధ్రా, ఒడిసా రాష్ట్రాల ఇంధన శాఖల అధికారులతో సంప్రదింపులు జరిపింది. 2019లో జగన్ సీఎం అయ్యాక రెండు రాష్ట్రాల మధ్య వివాదాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా 2022లో అదానీ సంస్థకు అనుమతులు ఇచ్చారు. కురుకుట్టిలో 1200 మెగావాట్లు, కర్రివలసలో వీటి ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గిరిజనుల హక్కులను కాలరాస్తూ జగన్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ ఒడిసాతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనులు ఆందోళనకు దిగారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించి.. అదానీకి ఇచ్చిన పీఎస్పీ అనుమతులు రద్దు చేయాలంటూ ఇంధన శాఖను ఆదేశించారు.

గవర్నర్ నజీర్‌తో జగన్ దంపతులు భేటీ

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దంపతులు భేటీ అయ్యారు. సోమవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా జగన్ దంపతులు, గవర్నర్‌ను కలిశారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

'ఉచిత బస్సు' థీమ్‌తో 'ఆర్టీసీ' శకటం

- అమరావతిలో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో ప్రదర్శన

విజయవాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు వేడుకల్లో 'మహిళలకు ఉచిత బస్సు పథకం' థీమ్‌తో కూడిన ఆర్టీసీ శకటాన్ని ప్రదర్శించనున్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా, అమరావతి వేదికగా ఆగస్టు 15న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాల మేరకు శకటం తయారీకి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చర్యలు చేపట్టారు.

పెరిగిన ఎండ.. ఒంగోలులో 38 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి దూరంగా మధ్యప్రదేశ్‌లో అల్పపీడనం కొనసాగుతోంది. అదే సమయంలో బంగాళాఖాతంలో గానీ, దక్షిణాదిలో భూ ఉపరితలంపై గానీ ఆవర్తనాలు, ద్రోణులు లేవు. దీంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సోమవారం ఎండ తీవ్రత పెరిగింది. పలుచోట్ల వేసవిని తలపించేలా వేడి వాతావరణం నెలకొంది. ఒంగోలులో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల జీతాలు పెంచండి

- ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్‌కు ఉద్యోగ సంఘం వినతి

అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఫీడర్ అంబులెన్స్ సిబ్బందికి జీతాలు పెంచాలని 108ఫీడర్ అంబులెన్సుల ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఆ సంఘం గౌరవాధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు నేతృత్వంలో ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబును కలిసిన ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు.





గుడ్ల నుంచి బయటకు వచ్చిన కింగ్‌కోబ్రా పిల్లలు

కింగ్‌కోబ్రా గుడ్లను సంరక్షించి.. అడవిలోకి వదిలి!



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం జీనబాడు రెవెన్యూ పరిధిలోని శంకరం అటవీ ప్రాంతంలో అటవీ శాఖాధికారులు ఆదివారం 30 కింగ్‌కోబ్రా పిల్లలను విడిచిపెట్టారు. ఆ ప్రాంతంలో నెల రోజుల కిందట 30 కింగ్‌కోబ్రా గుడ్లను అటవీ శాఖాధికారులు, వైల్డ్ లైఫ్ సొసైటీ కో ఆర్డినేటర్ మూర్తి గుర్తించారు. ఆ గుడ్లకు రక్షణగా నెట్ ఏర్పాటు చేశారు. నెల రోజుల తర్వాత ఆ 30 గుడ్ల నుంచి పిల్లలు బయటకు రావడంతో.. వాటిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అంతరించిపోతున్న జాతుల్లో కింగ్ కోబ్రా ఒకటని, వాటి రక్షణకు కృషిచేస్తున్నామని అటవీ శాఖ అధికారులు శాంతిప్రియ, దివాన్ మొహిద్దీన్ చెప్పారు.

- అనంతగిరి-ఆంధ్రజ్యోతి

ఐటీలో ఉద్యోగాల ఊచకోత!

- టెకీల పాలిట భస్మాసుర హస్తంగా ఏఐ
- టీసీఎస్‌లో 12,000 మందికి ఉద్వాసన
- ఇదే బాటలో మిగతా కంపెనీలు..?

ఐటీ ఉద్యోగమంటే నిన్న మొన్నటి వరకు పెద్ద క్రేజ్. లక్షల్లో జీతం. వారానికి ఐదు రోజుల పని. ఏటా జీతాల పెంపు, రెండు మూడేళ్లకు ఒకసారి ప్రమోషన్లు. ఆ వ్యవహారమే వేరుగా ఉండేది. ఇప్పుడదంతా గతం. ఇప్పుడు ఉన్న ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి. ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందోనని హడలిపోతున్నారు. ఆటోమేషన్, కృత్రిమ మేథ(ఏఐ) కారణంగా దేశంలో లక్ష నుంచి మూడు లక్షల ఐటీ ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందన్న వార్తలు వారిని మరింత భయపెడుతున్నాయి. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) 12,000 మందికి పైగా ఉద్యోగులను ఇంటికి పంపించబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు కంపెనీని సిద్ధం చేయాలంటే ఈ చర్య తప్పడం లేదని తెలిపింది. టీసీఎస్ చేసిన ఈ ప్రకటన ఐటీ రంగంలో పెను సంచలనంగా మారింది. త్వరలో మిగతా ఐటీ కంపెనీలూ ఇదే బాట పట్టబోతున్నాయన్న వార్తలు ఐటీ ఉద్యోగులకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి.

కొత్త టెక్నాలజీల ప్రభావం

ఐటీ రంగంలో ఇప్పుడు ఆటోమేషన్, ఏఐ టెక్నాలజీలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ టెక్నాలజీల పుణ్యమా అని పునరావృత(రిపిటేటివ్) పనుల్లో ఉద్యోగుల అవసరం లేకుండా పోతోంది. మిగతా పనుల్లోనూ ఐటీ కంపెనీలు ఏఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. అందుకోసం ఉన్న ఉద్యోగులకే కొత్త డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి వినియోగించుకుంటున్నాయి. ఆ టెక్నాలజీలపై పట్టు సాధించలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. టీసీఎస్ తీసివేతలకు ఇది కూడా ఒక కారణమని తెలుస్తోంది.

ఆర్థిక అనిశ్చితి

ఆర్థిక అనిశ్చితి కూడా ఐటీ ఉద్యోగాలకు ఎసరు పెడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో అమెరికా, ఐరోపా దేశాల్లో అనిశ్చితి మరింత పెరిగింది. దీంతో అక్కడి కంపెనీల నుంచి భారత ఐటీ కంపెనీలకు పెద్దగా ప్రాజెక్టులు రావడం లేదు. దీంతో భారత్‌లోని ఐటీ కంపెనీల్లో బెంచ్ మీద ఉండే పనిలేని ఉద్యోగుల సంఖ్య పెరిగిపోతోంది. వీరిని ఇంటికి పంపించేందుకు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. టీసీఎస్ ఇప్పటికే ప్రతి ఉద్యోగి ఏటా కనీసం 225 రోజుల పాటు ఏదో ఒక ప్రాజెక్టుపై పని చేయాలని స్పష్టం చేసింది. ఏ ఉద్యోగి అయినా 35 రోజులకు మించి బెంచ్ మీద ఉంటే వారి ఉద్యోగానికి ఎసరు తప్పదని హెచ్చరించింది.

లక్ష నుంచి 11 వేలకు తగ్గిన నియామకాలు

ఐటీ, బీపీవో కంపెనీల్లో ఉద్యోగ నియామకాలు భారీగా తగ్గిపోయాయి. 2020లో దాదాపు లక్ష మందిని ఐటీ కంపెనీలు నియమించుకుంటే, 2024లో అది ఏకంగా 11,000కు పడిపోయింది. అదే సమయంలో గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు(జీసీసీ) 1.2 లక్షల మందిని నియమించుకున్నాయి. ఐటీ కంపెనీలు గతంలోలా ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్లి ఫ్రెషర్లకు పెద్ద సంఖ్యలో ప్లేస్‌మెంట్లు ఇవ్వడం లేదు. ఉన్న ఉద్యోగులకే కొత్త టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి పని కానిచ్చేస్తున్నాయి. ఇప్పుడు ఫ్రెషర్లకు కష్టాలు తప్పవని స్పష్టమవుతోంది.

ఆదాయమే ముఖ్యం

గతంలో ఐటీ కంపెనీల ఆదాయం పెరిగే కొద్దీ, ఉద్యోగుల సంఖ్య పెరిగేది. ఇప్పుడు కంపెనీలు ఉద్యోగాలకు కోత పెడుతూ ఆదాయం పెంచుకుంటున్నాయి. టీసీఎస్ సహా అన్ని ఐటీ కంపెనీలు ఇదే బాట పడతాయని నిపుణుల అంచనా. ఇప్పుడు కోడింగ్, ప్రోగ్రామింగ్ రాసే ఏఐ టూల్స్ కూడా వచ్చేశాయి. దీంతో ఐటీ కంపెనీలు ఉన్న ఉద్యోగులను ముఖ్యంగా అధిక జీతాలు ఉండే మిడ్, సీనియర్ ఉద్యోగులను వదిలించుకునే పనిలో పడ్డాయి. కొవిడ్ తర్వాత ఐటీ కంపెనీలకు ఇబ్బడి ముబ్బడిగా ప్రాజెక్టులు వచ్చాయి. కొవిడ్ కారణంగా ఐటీ కంపెనీలు అనుసరించిన 'ఇంటి నుంచి పని' విధానం ఉద్యోగులకు బాగా కలిసివచ్చింది. ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీలతో పరిస్థితులు మారిపోయాయి. ఏఐ కారణంగా ఐటీ కంపెనీలు ఉద్యోగాల కోత ప్రారంభించాయి.

- ఆంధ్రజ్యోతి బిజినెస్ డెస్క్

ఉద్యోగుల తొలగింపు అన్యాయం, అక్రమం

టీసీఎస్ నిర్ణయాన్ని జాతీయ ఐటీ ఉద్యోగుల సమాఖ్య నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనెట్(ఎన్ఐటీఈఎస్) తీవ్రంగా తప్పుపట్టింది. 'ఉద్యోగులు చెల్లించాల్సిన ఈఎంఐలు, ఇతర ఆర్థిక బాధ్యతలను నిర్వర్తించడం కష్టమవుతుంది. మానసికంగా, ఆర్థికంగా వారు అనుభవించే బాధ వర్ణనాతీతం' అంటూ ఎన్ఐటీఈఎస్ జాతీయ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలూజా కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖకు రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. లేకపోతే ఐటీ ఉద్యోగులు దేశవ్యాప్తంగా ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

మరీ నిరాశ వద్దు

ఏఐ గురించి మరీ అంతగా భయపడాల్సిన అవసరం లేదనే వాదనలూ వినిపిస్తున్నాయి. దీంతో కొన్ని ఉద్యోగాలు పోయినా ఏఐ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, ప్రాంప్ట్ ఇంజనీర్లు వంటి అనేక కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని టెక్ మహీంద్రా మాజీ సీఈఓ సీపీ గుర్నానీ వంటి పరిశ్రమ దిగ్గజాలు చెప్పడం విశేషం.

- ఉద్యోగుల సంఖ్యను బట్టి ఐటీ కంపెనీల ఆదాయాలను అంచనా వేసే రోజులు పోయాయి. ఇక ఏఐ ఆధారంగానే వాటి ఆదాయాలను లెక్కించాల్సి ఉంటుంది.
- సీపీ గుర్నానీ, మాజీ సీఈఓ, టెక్ మహీంద్రా
- కొంతకాలంగా ఐటీ కంపెనీల లాభాలపై ఒత్తిడి పెరిగింది. టీసీఎస్ నిర్ణయానికి ఇది కూడా ఒక కారణం. టీసీఎస్ ఉద్యోగాల కోతకు సిద్ధమైనప్పుడు ఇతర ఐటీ కంపెనీలు కూడా అందుకు సిద్ధంగా ఉన్నట్టు భావించాలి.
- అశుతోష్ శర్మ, రీసెర్చ్ డైరెక్టర్, ఫారెస్టర్ కన్సల్టెన్సీ
- కొన్ని ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల పూర్తికి నైపుణ్యాల కొరత ఉంది. ఆ లోటును పూడ్చుకునేందుకు పునర్ వ్యవస్థీకరణ తప్పదు.

- సి.విజయ కుమార్, ఎండీ,సీఈఓ,హెచ్‌సీఎల్ టెక్నాలజీస్

ఖాళీ స్థానిక సంస్థలకు 10న ఎన్నికలు

- 2 జడ్పీటీసీలు, 3 ఎంపీటీసీలు, 2 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్లు
- 30 నుంచి ఒకటో తేదీ వరకు నామినేషన్లు
- 2వ తేదీన వాటి పరిశీలన
5న మధ్యాహ్నం తర్వాత అభ్యర్థుల తుది జాబితా

అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీచేసింది. ఆగస్టు 10న పోలింగ్ జరుగుతుంది. కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలకు.. చిత్తూరు జిల్లాలోని రామకుప్పం మండలంలో మణీంద్రం, పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో వేపకంపల్లి, నెల్లూరు జిల్లా కావలి మండలం విడవలూరు-1 ఎంపీటీసీలకు.. ప్రకాశం జిల్లా కొండెపి సర్పంచ్, వార్డు సభ్యులకు.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక సర్పంచ్ స్థానానికి ఎన్నికల నిర్వహణకు ఈ నెల 30లోపు రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటీసు ఇవ్వాలని.. ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలని సూచించారు. 30వ తేదీ నుంచి ఆగస్టు 1 దాకా నామినేషన్లు స్వీకరించి.. ఆగస్టు 2న నామినేషన్లు పరిశీలిస్తారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అప్పీలు చేసుకునేందుకు 3వ తేదీ వరకు అవకాశమిచ్చారు. అప్పీళ్లను అప్పిలేట్ అథారిటీ 4వ తేదీన పరిష్కరిస్తుంది. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల దాకా గడువు ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. ఆగస్టు 10న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. ఏవైనా కారణాలతో రీపోల్ నిర్వహించాల్సి వస్తే 12న జరుపుతారు. జడ్పీటీసీ ఎన్నికలు జరిగే ప్రాంతంలో రెవెన్యూ డివిజన్ల పరిధిలో, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే చోట్ల ఆయా మండలాల పరిధిలో, సర్పంచ్‌లకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికల కోడ్ సోమవారమే అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

విద్యారంగ, ఆర్థిక సమస్యలపై ఆందోళనలు

- ప్రభుత్వానికి ఫ్యాప్టో నోటీసు

అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఆర్థికపరమైన సమస్యలపై ఆందోళనల్లో భాగంగా ఉపాధ్యాయ సంఘ సమాఖ్య(ఫ్యాప్టో) ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది. ఈ మేరకు ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్.చిరంజీవి సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఉపాధ్యాయుల సమస్యలపై పలుమార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని లేఖలో పేర్కొన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆగస్టు 2న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే 12వ తేదీన రాష్ట్రస్థాయి ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు.


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



ఇది వారి కింగ్‌డమ్

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన చిత్రం 'కింగ్‌డమ్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ ఆకట్టుకున్నాయి. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "మీ అభిమానం నాకు దేవుడిచ్చిన వరం. మీరు నా విజయాన్ని చూడాలని కోరుకుంటున్నాను. ఇది విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' కాదు. గౌతమ్ తిన్ననూరి, అనిరుధ్, ఎడిటర్ నవీన్ నూలితో పాటు సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లేలా పనిచేసిన చిత్రబృందానిది. ఇందులో నా బ్రదర్స్‌గా సత్యదేవ్, వెంకటేశ్ అదరగొట్టారు. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది" అని చెప్పారు. "విజయ్ ఓ అద్భుతమైన వ్యక్తి. ఏ సపోర్ట్ లేకుండా ఎదిగారు. ఆయనకు ఈ సినిమాతో గుర్తుండిపోయే హిట్ దక్కాలని కోరుకుంటున్నా. అనిరుధ్ పట్టిందల్లా బంగారం అవుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందంగా ఉంది" అని నటుడు సత్యదేవ్ చెప్పారు. "తెలుగు సినిమాల పరంగా నాకు నాగవంశీ మెంటార్. 'కింగ్‌డమ్' 'జెర్సీ'కి మించిన హిట్ అవుతుంది. నాపై తెలుగువారు చూపిస్తున్న ప్రేమకు రుణపడి ఉంటాను" అని సంగీత దర్శకుడు అనిరుధ్ తెలిపారు.

బర్త్‌డే స్పెషల్స్



'మహానటి', 'సీతారామం', 'లక్కీ భాస్కర్' వంటి విజయవంతమైన చిత్రాలతో టాలీవుడ్‌లో ప్రత్యేక ఫ్యాన్స్ బేస్‌ని ఏర్పరచుకున్నారు మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. ఇప్పుడు మరో రెండు చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించబోతున్నారు. సోమవారం దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 'కాంత' చిత్రం నుంచి టీజర్, సాయంత్రం 'ఆకాశంలో ఒక తార' సినిమాకు సంబంధించిన గ్లింప్స్ విడుదలయ్యాయి. సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తోన్న 'కాంత' చిత్రాన్ని రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. 1950-60ల్లో ఓ హీరో, డైరెక్టర్ మధ్య ఘర్షణ నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. తెలుగు-తమిళంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా సెప్టెంబరు 12న విడుదల కానుంది. ఇక తెలుగు దర్శకుడు పవన్ సాధినేని తెరకెక్కిస్తోన్న 'ఆకాశంలో ఒక తార' చిత్రాన్ని గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. గ్లింప్స్‌లో దుల్కర్‌ని ఓ సాధారణ కుర్రాడిగా చూపించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ్, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.



మోతెవరి నవ్విస్తాడు


తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో శివకృష్ణ బుర్రా తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'మోతెవరి లవ్ స్టోరీ'. అనిల్ గీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో నటించారు. మధుర శ్రీధర్, శ్రీరామ్ శ్రీకాంత్ నిర్మించారు. ఈ సిరీస్ ఆగస్టు 8న 'జీ5'లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో, దర్శకుడు తరుణ్ భాస్కర్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. మధుర శ్రీధర్ మాట్లాడుతూ 'తెలంగాణలో ఇలాంటి కొత్త కథలు రావడానికి తరుణ్ భాస్కరే స్ఫూర్తి. ఈ సిరీస్ తర్వాత మరెన్నో గొప్ప కథలు వస్తాయి. 'మోతెవరి లవ్ స్టోరీ' చాలా కొత్తగా ఉంటుంది. అందరినీ అలరిస్తుంది' అని అన్నారు.

బ్యూటిఫుల్ మెలోడీ



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కిస్తున్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు మేకర్స్. 'మల్లిక గంధ' అంటూ ఓ బ్యూటిఫుల్ మెలోడీని విడుదల చేశారు. సిద్ధు, రాశీ ఖన్నాల ప్రేమ ప్రపంచాన్ని అద్భుతంగా పరిచయం చేసిందీ గీతం. కృష్ణ కాంత్ రచించగా, సిద్‌శ్రీరామ్ ఆలపించారు. థమన్ సంగీతం అందించారు.

త్వరలోనే ఫైటర్



మణికంఠ, ఐరా బన్సల్ జంటగా ప్రభాస్ నిమ్మల తెరకెక్కిస్తున్న చిత్రం 'ఫైటర్ శివ'. సునీల్, వికాస్ వశిష్ఠ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నర్సింగ్ ఉన్నం, రమేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను దర్శకుడు సంపత్ నంది విడుదల చేశారు.

అదిరిపోయే అప్‌డేట్!



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ' చిత్రానికి సంబంధించి లేటెస్ట్ అప్‌డేట్ వచ్చింది. అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో నాగార్జున ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు ఆమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. రజనీకాంత్, నాగార్జున, ఆమీర్‌ఖాన్, ఉపేంద్ర.. పవర్‌ఫుల్ లుక్స్‌లో కనిపించిన ట్రైలర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. సురేశ్‌బాబు, దిల్‌రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ కలసి 'కూలీ' తెలుగు థియేట్రికల్ హక్కులు కొని ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కళానిధి మారన్ చిత్ర నిర్మాత.

ఆంధ్రజ్యోతి

పెన్సిల్ ముల్లుపై వైట్‌హౌస్.. ట్రంప్ ప్రశంసలు



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకంతో వైట్‌హౌస్ విడుదల చేసిన ప్రశంసా పత్రం


పెన్సిల్ ముల్లుపై వెంకటేశ్ తయారుచేసిన వైట్ హౌస్


సూక్ష్మ కళాకారుడు వెంకటేశ్

నక్కపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పెన్సిల్ ముల్లుపై అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌ను రూపొందించిన మన కళాకారుడు ట్రంప్ మనసు దోచుకున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చిన దొడ్డిగల్లు గ్రామానికి చెందిన గట్టెం వెంకటేశ్ ట్రంప్ ప్రశంసలు అందుకున్నారు. న్యూయార్క్‌లో ఆర్కిటెక్ ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న గట్టెం వెంకటేష్ పెన్సిల్ ముల్లుపై 2 సెం.మీ. పొడవు, 1 సెం.మీ. వెడల్పుతో వైట్‌హౌస్‌ను తీర్చిదిద్దారు. ఈ నెల 4న అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఎగ్జిబిషన్‌లో వెంకటేశ్ తన కళాఖండాన్ని ప్రదర్శించారు. వెంకటేశ్ తయారుచేసిన కళాఖండం గురించి వైట్ హౌస్ అధికారులు అధ్యక్షుడు ట్రంప్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో వెంకటేశ్‌ను ప్రశంసిస్తూ వైట్‌హౌస్ ప్రశంసాపత్రాన్ని విడుదల చేసింది.

సాహస నారి.. సైకిల్ యాత్ర!

» 44 రోజులు.. 1,300 కిలోమీటర్లు


హైదరాబాద్ నుంచి సైకిల్‌పై అరకులోయ చేరిన వెన్నెలను సత్కరిస్తున్న దృశ్యం

అరకులోయ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయ.. 44 రోజుల పాటు ఏకంగా 1,300 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర! సైక్లింగ్‌పై ప్యాషన్‌తో ఆ సాహసయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసింది తెలంగాణకు చెందిన వెన్నెల అనే ఓ యువతి. గతంలో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడంతో పాటు గత ఏడాది కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు కూడా సైకిల్ యాత్ర చేపట్టినట్లు ఆమె చెప్పారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనేది తన కోరిక అని పేర్కొన్నారు. వెన్నెల గత నెల 14న హైదరాబాద్ నుంచి సైకిల్‌పై బయలుదేరి.. తిరుపతి, తదితర ప్రాంతాలను సందర్శిస్తూ ఆదివారం అరకు లోయ చేరుకున్నారు. ఆమెకు ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ మోహన్, అరకు జనసేన ఇన్‌చార్జి చిరంజీవి, నేచర్ నెస్ట్ రిసార్ట్స్ యాజమాన్యం సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెన్నెల తన ప్రయాణ విశేషాలను సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఆ వివరాలు ఆమె మాటల్లో.. హైదరాబాద్ నుంచి అరకులోయ వరకు సైకిల్ యాత్ర చేయాలని సంకల్పించి.. గత నెల 14న అక్కడ నుంచి బయలుదేరాను. మహిళా సాధికారత, వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాను. ఈ ప్రయాణంలో చాలా మంది నన్ను ప్రోత్సహించారు. వారి ఇళ్లకు తీసుకెళ్లి ఆతిథ్యం ఇచ్చేవారు. కొన్నిసార్లు రాత్రి వేళల్లో పెట్రోల్ బంకుల వద్ద విశ్రాంతి తీసుకునే దాన్ని. నాకు తిరుపతి, అరకులోయ చాలా బాగా నచ్చాయి' అని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ఆమెను ఘనంగా సత్కరించి, అభినందించారు.

ప్రజలకు అవగాహన కల్పించాకే స్మార్ట్ మీటర్లు

» ఈపీడీసీఎల్ సమీక్షలో మంత్రి గొట్టిపాటి



విశాఖపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించాకే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. విశాఖలో సోమవారం ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ, డైరెక్టర్లు, సీజీఎంలు, జిల్లా అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే బహుళ ప్రయోజనాలను ప్రజలకు వివరించి, అపోహలు తొలగించాలి. అప్పటికీ వారు అంగీకరించకపోతే చెక్ మీటరు కూడా ఏర్పాటు చేసి, రెండింటిలో ఎటువంటి తేడా లేదని వారికి అర్థమయ్యేలా చేయాలి. ఎంపిక చేసిన వర్గాల (జర్నలిస్టులు, అపార్టుమెంట్ అసోసియేషన్లకు)కు ముందు ఏర్పాటుచేసి, పరిశీలించాలి. అధిక బిల్లులు, ఇతర చార్జీలు వస్తున్నాయని తేలితే సీఎం దృష్టిలో పెట్టి స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకునే ప్రయత్నం చేద్దాం' అని మంత్రి అన్నారు.

ప్రతిపక్ష హోదా కోసం అడుక్కుంటున్నారు: అనిత


ఆకివీడులో డయాలసిస్ బాధితుడితో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ఆకివీడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షం హోదా కావాలని అడుక్కునే పరిస్థితి జగన్‌కు వచ్చిందని హోం మంత్రి అనిత ఎద్దేవా చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 'చంద్రబాబును జైల్లో పెట్టి.. జగన్ తన గొయ్యి తానే తవ్వుకున్నాడు. డిప్యూటీ స్పీకర్ ట్రిపుల్ ఆర్ తనకు జరిగిన, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రతిరోజూ మీడియా, వీడియోల ద్వారా ప్రజలను మోటివేట్ చేశారు. వైసీపీ హయాంలో ప్రజలే కాదు.. మేమూ బాధితులమే' అని అనిత అన్నారు.

పర్యాటక రంగాన్ని పట్టాలెక్కించాం: మంత్రి దుర్గేశ్



తిరుమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'పర్యాటక రంగానికి గత ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. మేము మళ్లీ పట్టాలెక్కించి ముందుకు తీసుకెళుతున్నాం' అని మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. సోమవారం తిరుమల శ్రీవారి కల్యాణోత్సవ సేవలో పాల్గొన్న ఆయన, మీడియాతో మాట్లాడారు.'టూరిజం రంగానికి సంబంధించి హోటళ్లకు పారిశ్రామిక హోదా కల్పన, నూతన పాలసీ ప్రకటించడంతో తిరుపతి, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ఫైవ్ స్టార్ హోటళ్ల ఏర్పాటు చేసేందుకు పలువురు ముందుకొస్తున్నారు. సముద్ర తీరం పొడవునా బీచ్ రిసార్ట్స్, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేస్తాం. ప్రకాశం బ్యారేజ్ నుంచి శ్రీశైలం వరకు సీ ప్లేన్‌ను పూర్తి స్థాయిలో తీసుకురావడానికి చర్యలు తీసుకున్నాం' అని మంత్రి తెలిపారు.

అప్పు దొరకని స్థితికి తెచ్చాడు: మంత్రి పయ్యావుల



నందిగామ, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ పాలనలో జగన్ ఆర్థిక అరాచకాల వల్ల రాష్ట్రంలో అభివృద్ధికి అప్పులు తెచ్చే అవకాశం కూడా లేని దుస్థితి నెలకొంది' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం కూటమి ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'రాష్ట్రంలో అన్ని వనరులనూ ఆర్థిక నేరస్థుడైన జగన్ దోచుకున్నాడు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి దోచుకోవడానికే అడ్డగోలుగా అప్పులు చేశాడు. జగన్ అరాచక పాలన వల్ల నేడు రాష్ట్రానికి అప్పు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. ఇంత సంక్షోభంలోనూ సూపర్ సిక్స్ పథకాల అమలుకు సీఎం చంద్రబాబు కష్టపడుతున్నారు. ప్రజలు, పార్టీ నాయకులు కొంత సంయమనం పాటించాలి' అని మంత్రి కోరారు.

గ్రీన్ విలేజ్.. దోషులను శిక్షిస్తాం: సారథి

కైకలూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి గూడు నిర్మించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఏలూరు జిల్లా కైకలూరులో గృహ నిర్మాణ పథకం ప్రగతిపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన గృహాలపై రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ విచారణ జరిపించాం. అవకతవకలకు పాల్పడిన వారికి శిక్షలు తప్పవు. కైకలూరు గ్రీన్ విలేజ్‌లో మౌలిక వసతుల కొరకు రూ.6 కోట్లు కేటాయించాం. గ్రీన్ విలేజ్‌లో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిగింది. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని మంత్రి తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి అనిత మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకువెళుతోంది. అలా వెళ్లేందుకు దమ్ము, ధైర్యం కావాలి' అని అన్నారు.

గవర్నర్‌ను జగన్ ఎందుకు కలిశారో?: వర్ల

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): గవర్నర్‌ను జగన్ మాజీ సీఎం హోదాలో అధికారికంగా కలిశారా? లేక వ్యక్తిగతంగానా? అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా గవర్నర్‌ని కలిసి మాట్లాడిన విషయం ప్రజలకు జగన్ ఎందుకు తెలియజేయడంలేదని నిలదీశారు. నిజాలను బహిర్గతం చేయటానికి జగన్‌కు అంత భయం ఎందుకని నిలదీశారు.

దెయ్యాల్లా వైసీపీ సైకోల కుట్రలు : పల్లా

పునర్నిర్మాణం దిశగా రాష్ట్రం కొత్త పుంతలు తొక్కుతుంటే... దెయ్యాల్లా వైసీపీ సైకోలు అడ్డుపడేందుకు కుట్రలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. సోమవారం ఆయన ఈమేరకు ఒక ప్రకటన చేశారు. 'అభివృద్ధి అంటే తెలియని వైసీపీ నేతలు.. నేడు రాష్ట్ర అభివృద్ధిపై చీకటి రాజకీయాలు చేస్తున్నారు. వాస్తవాల్ని వక్రీకరించి దిగజారి మాట్లాడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు గుడ్డ కథలు చెప్పిన గుడివాడ అమర్నాథ్ నేడు మతి లేకుండా మాట్లాడుతున్నాడు' అని పల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీకి తెలిసింది విమర్శలు, వీరంగమే: నీలాయపాలెం

'జగన్ పాలనలో కొత్త కంపెనీలను తీసుకురాకపోగా.. ఉన్న కంపెనీలను తరిమికొట్టారు. నేడు వివిధ పాలసీలతో రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొస్తుంటే వైసీపీ నేతలకు కడుపు మండుతోంది' అని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ నేతలకు విమర్శలు, వీరంగం తప్ప ఏదీ చేతకాదు. అభివృద్ధి అనేది వారి నిఘంటువులోనే లేదు. జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం వెనుకబడిపోయింది. కూటమి ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళుతోంది' అని నీలాయపాలెం అన్నారు.

'మెగా పీటీఎం' @ గిన్నిస్

» డేటా ఆడిట్ తర్వాత గిన్నిస్ బృందం ధ్రువీకరణ

» 61 వేల పాఠశాలల సమాచారం విశ్లేషణ

» ఈనెల 10న మెగా పీటీఎం-2.0లో పాల్గొన్న 53.4 లక్షల మంది తల్లిదండ్రులు, టీచర్లు

» ఆగస్టు రెండో వారంలో పత్రం అందజేత



అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (మెగా పీటీఎం-2.0) గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించింది. మెగా పీటీఎం నుంచి సేకరించిన డేటాను ఆడిట్ చేసిన తర్వాత ఈ రికార్డును గిన్నిస్ బృందం ధ్రువీకరించింది. ఇందులో మూడు ఫొటోగ్రాఫ్‌లు, ఒక వీడియో, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఖ్య వివరాలు ఉన్నాయి. ప్రతి పాఠశాలలో డేటాకు ఆ బడికి సంబంధం లేని వ్యక్తులను సాక్ష్యులుగా పరిగణించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నియమించిన 40 మందికి పైగా ఆడిటర్లు.. 61 వేల పాఠశాలల నుంచి సమీకరించిన డేటాను విశ్లేషించారు. గిన్నిస్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని ఆగస్టు రెండో వారంలో అమరావతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నారు. ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మెగా పీటీఎం-2.0లో 53.4 లక్షల మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఇతర ఉద్యోగులు సహా మొత్తం 1.5 కోట్ల మంది మెగా పీటీఎంలో భాగస్వామ్యం అయ్యారు.


ప్రభుత్వ విద్యా వికాసానికి గుర్తింపు: లోకేశ్

మెగా పీటీఎం-2.0 గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించడంపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది ఉపాధ్యాయులకు అంకితమని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం ఐదో వార్షికోత్సవం జూలై 29కి ఒకరోజు ముందు మెగా పీటీఎం గిన్నిస్ రికార్డు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలను తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది గొప్ప ప్రోత్సాహంగా నిలుస్తుందన్నారు. ఈ అరుదైన రికార్డులో భాగస్వామ్యమైన టీచర్లు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యా వికాసానికి, సమ్మిళిత విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ చేస్తున్న కృషిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించడం హర్షణీయమన్నారు. మరోవైపు మెగా పీటీఎం గిన్నిస్ రికార్డు సాధించడం ఎనలేని ప్రోత్సాహాన్ని ఇచ్చిందని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. మంత్రి లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా ఏపీ మోడల్ విద్యా విధానం కోసం ఒక యజ్ఞంలా పనిచేస్తున్న విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఉపాధ్యాయులకు ఇది మరింత ప్రోత్సాహం ఇస్తుందన్నారు.

చంద్రబాబు పేరుతో ఫేక్ ప్రకటన

» రూ.22వేల పెట్టుబడితో భారీ లాభాలంటూ నకిలీ వీడియో

» ఇలాంటివి నమ్మొద్దంటున్న సైబర్ పోలీసులు



చంద్రబాబు పేరిట ఇన్‌స్టాలో వైరల్ అవుతున్న ఫేక్ ప్రకటన

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): సామాన్యుల్ని లక్ష్యంగా చేసుకుని రోజుకో కొత్త రకం మోసానికి పాల్పడుతున్న సైబర్ కేటుగాళ్లు.. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎంచుకున్నారు. టెక్నాలజీతో అద్భుతాలు సృష్టించొచ్చు అంటూ నిరంతరం యువతను ప్రోత్సహించే చంద్రబాబు గతంలో పలు చానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. అయి తే, ఇలా ఓ ఇంటర్వ్యూలో చంద్రబాబు మాట్లాడిన మాటలను సైబర్ నేరగాళ్లు వక్రీకరించి నకిలీ వీడియోను సృష్టించారు. '22వేల రూపాయలు పెట్టుబడి పెట్టండి.. ఫోన్ ద్వారా క్రమం తప్పకుండా ఆదాయం పొందండి' అని చంద్రబాబు చెబుతున్నట్లు ఫేక్ వీడియో సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈనకిలీ వీడియోతో చంద్రబాబుకు ఎలాంటి సంబంధమూ లేదని టీడీపీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. గతంలో ఇలానే ప్రధాని మోదీ పేరుతో '500పెట్టుబడి పెట్టండి.. 5వేలు లాభం పొందండి' అంటూ ప్రజల్ని మోసం చేసేందుకు ప్రయత్నించిన సైబర్ నేరగాళ్లు, రతన్ టాటా ఉచితంగా పది వేలు ఇస్తున్నారని, బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించాలంటూ షారుక్, అమితాబ్ పేరిట నకిలీ వీడియోలు సృష్టించారని తెలిపారు. ఇలాంటి నకిలీ ప్రకటనలు నమ్మి మోసపోవద్దని ఏపీ సైబర్ క్రైమ్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ ప్రజలకు సూచించారు. సైబర్ మోసగాళ్లను పట్టుకుంటామన్నారు.

వారిని లోకల్‌గానే పరిగణించండి

» ఆ విద్యార్థుల దరఖాస్తులు స్వీకరించండి

» ఎన్టీఆర్ వర్సిటీకి హైకోర్టు ఆదేశం

» తెలంగాణలో ఇంటర్ చదివినవారికి ఊరట

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో తమను లోకల్ అభ్యర్థులుగా పరిగణించి, దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ రాష్ట్రానికి చెందిన పలువురు విద్యార్థులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టు ధర్మాసనం అత్యవసర విచారణ జరిపింది. పిటిషనర్లను లోకల్ అభ్యర్థులుగా పరిగణించి, వారి దరఖాస్తులు స్వీకరించాలని ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంపై సవివరంగా కౌంటర్ దాఖలు చేయాలని యూనివర్సిటీకి స్పష్టం చేసింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నీట్‌లో అర్హత సాధించినా, ఇంటర్ తెలంగాణలో చదివామనే కారణంతో వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో తమను లోకల్ అభ్యర్థులుగా పరిగణించకపోవడాన్ని సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన ఎస్కే ఖమరుద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన సనపల వెంకటరమణ మరో 51మంది వేరొక పిటిషన్ వేశారు.

అడ్మిషన్లు 18% పెరిగాయ్

ఇంటర్ ప్రవేశాలపై రోతపత్రికలో అబద్ధాలు

» 2023-24లో 1,24,818 మంది విద్యార్థులు

» 2025-26లో 1,46,332 మంది చేరారు

» నెలాఖరు వరకు అడ్మిషన్లకు గడువుంది

» తప్పుడు రాతలపై చట్టపరంగా చర్యలు

» జగన్ పత్రిక కథనంపై లోకేశ్ మండిపాటు

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో 18 శాతం అడ్మిషన్లు పెరిగాయని మంత్రి లోకేశ్ వెల్లడించారు. యూడైస్ డేటా ఈ విషయాన్ని స్పష్టం చేస్తోందని, అయితే జగన్మోహన్ రెడ్డి అవినీతి విషపత్రిక, రోతపత్రికలో కాలేజీలు ఖాళీ అంటూ అబద్ధాలతో కథనాన్ని వండి వార్చారని మండిపడ్డారు. ఇంటర్ అడ్మిషన్లపై సోమవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. "ప్రభుత్వ ఇంటర్ విద్యలో గత ఏడాది కాలంగా మేం తెచ్చిన సంస్కరణల కారణంగా 2025-26లో 18 శాతం అడ్మిషన్లు పెరిగాయి. ఈ నెలాఖరు వరకు ఇంకా అడ్మిషన్లకు గడువుంది. ప్రకాశం జిల్లాలోని కనిగిరి లాంటి మారుమూల కాలేజీల్లో అడ్మిషన్లు రెట్టింపు కావడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనం. విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే తప్పుడు రాతలపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది" అని అన్నారు. ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో 2023-24లో 1,24,818 మంది చేరగా, 2025-26లో 1,46,332 మంది చేరారని వివరించారు. ఫస్టియర్ విద్యార్థుల సంఖ్య 67,148 నుంచి 74,838కి, సెకెండియర్ విద్యార్థుల సంఖ్య 57,670 నుంచి 71,494కు పెరిగిందని లోకేశ్ తెలిపారు. ఇంటర్ విద్యా శాఖ కూడా జగన్ పత్రిక కథనంపై ఖండన విడుదల చేసింది. కొన్ని కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినా తగ్గినట్లు వార్తలో ప్రచురించిందని తప్పుబట్టింది.

చిత్తూరులో ఇంటిగ్రేటెడ్ డైరీ ప్లాంట్

» 282.20 కోట్ల పెట్టుబడి... 400 మందికి ఉపాధి

» ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీ వర్తింపు

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ డైరీ ప్లాంట్, పశువుల దాణా ప్లాంట్ స్థాపన కోసం శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని ప్రకటించింది. రూ.282.20 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంట్లలో 2027, జూలై 31వ తేదీ నాటికి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించి 400 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆ కంపెనీ ప్రతినిధులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రతిపాదిత పెట్టుబడి మెగా ప్రాజెక్టు వర్గంలోకి వస్తుండటంతో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ (4.0) కింద కొన్ని ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని వర్తింపజేస్తూ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి చిరంజీవులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్టు స్థిర మూలధన పెట్టుబడిలో రూ.89.94 కోట్లు (32.94%) వరకు రాయితీని ఐదేళ్లలో కంపెనీకి చెల్లించనున్నారు. పాల ప్రాసెసింగ్ యూనిట్‌కు మూలధన పెట్టుబడిలో సబ్సిడీ కింద రూ.41.10 కోట్ల (30%) వరకు, పశుగ్రాసం యూనిట్ కోసం స్థిర మూలధన పెట్టుబడిలో రూ. 17.85 కోట్ల (35%) వరకు, ఉపాధి రాయితీ కింద రూ. 12.96 కోట్ల (8%) వరకు రాయితీలను ప్రకటించారు. విద్యుత్తు సబ్సిడీ యూనిట్‌కు ఒక రూపాయి చొప్పున ఐదేళ్లలో రూ.1.99 కోట్లు, వడ్డీ రాయితీ కింద గరిష్ఠంగా రూ.కోటి వరకు, ఐదేళ్లపాటు ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్ రూ.8.73 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించనుంది. భూమి రిజిస్ట్రేషన్, ప్రాజెక్టు సంబంధిత ఒప్పందాలపై స్టాంప్ డ్యూటీ పూర్తి రీయింబర్స్‌మెంట్ ప్రకటించింది.

5న విద్యుత్తు ఉద్యమానికి కదం తొక్కండి: సీపీఐ

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): వామపక్షాలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వచ్చేనెల 5న అన్ని జిల్లాల్లో విద్యుత్తు కార్యాలయాల వద్ద తలపెట్టిన విద్యుత్తు ఉద్యమాన్ని విజయవంతం చేసేందుకు కదం తొక్కాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమస్యపై వైసీపీ నోరు మెదపడం లేదని, అధికారంలో ఉన్నప్పుడు అదానీతో ఒప్పందాలు చేసుకోవడమే దీనికి కారణమని ఆయన విమర్శించారు. విద్యుత్తు చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, అదానీతో చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేసేందుకు ప్రభుత్వం దిగివచ్చేలా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని సోమవారం నిర్వహించిన జూమ్ మీటింగ్ ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఐఐటీ తిరుపతికి 2,313 కోట్లు

» కేంద్ర మంత్రి సుకాంత మజుందార్

న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఐఐటీ తిరుపతిలో మౌలిక సదుపాయాల విస్తరణ కోసం ఫేజ్-2లో భాగంగా రూ.2,313.02 కోట్లు మంజూరు చేశామని కేంద్ర సహాయ మంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. సోమవారం, లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. 'ఫేజ్-1లో భాగంగా ఐఐటీ తిరుపతి శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి రూ.1,091.75 కోట్లు విడుదల చేశాం. ఈ క్యాంపస్ అక్టోబరు 2023 నుంచి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2014 తర్వాత ఏర్పాటైన ఐదు ఐఐటీల్లో విద్య, మౌలిక సదుపాయాల విస్తరణకు రూ.11,828.79 కోట్లు మంజూరు చేశాం' అని మజుందార్ వివరించారు..

'పహల్గాం'.. భారత్ ఆత్మపై దాడి

» కుటుంబ సభ్యుల ముందే కాల్చి చంపారు

» ఆపరేషన్ సిందూర్ దేశ దృఢసంకల్పానికి నిదర్శనం

» లోక్‌సభ చర్చలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు



న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు చేసిన దాడిని "భారత్ ఆత్మపై జరిగిన దాడి"గా తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అభివర్ణించారు. పహల్గాం ఉగ్రదాడి "యుద్ధం కాదు. ఊచకోత. పౌరుల మతవిశ్వాసాల ఆధారంగా ఎంచుకుని వారి కుటుంబసభ్యుల ముందే కాల్చి చంపారు" అని చెప్పారు. సోమవారం లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి కశ్మీర్‌లోని శాంతిని, పర్యాటక అభివృద్ధిని ధ్వంసం చేసిందన్నారు. రాత్రికి రాత్రే అక్కడ పరిస్థితులు మారిపోయాయని చెప్పారు. భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ప్రతీకార చర్య కాదని, దేశ విలువలు, సంయమనం, దృఢసంకల్పానికి నిదర్శనమని కొనియాడారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ ఆర్టికల్ 51ని ఉటంకిస్తూ "ఉగ్రవాదం సరిహద్దులను దాటినప్పుడు, స్వీయ రక్షణ కేవలం హక్కు మాత్రమే కాదు, కర్తవ్యం అవుతుంది" అని పేర్కొన్నారు. క్లిష్ట సమయాల్లో భారత్ ఏమిచేయగలదో ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి తెలియజేసిందన్నారు. సమయం కోసం భారత్ వేచిచూస్తుంది కానీ ఉగ్రదాడులను ఎన్నటికీ మర్చిపోదనే సందేశాన్ని పాక్‌కు పంపిందని చెప్పారు. ప్రధాని మోదీ దృఢమైన, ధైర్యవంతమైన నాయకత్వంతో సిందూర్ విజయవంతమైందని తెలిపారు. సిందూర్ తర్వాత మన దేశ ఏడు దౌత్య బృందాలు 32 దేశాలను సందర్శించి ఒకే స్వరంతో, పార్టీలకతీతంగా మాట్లాడాయని తెలిపారు. మనం దలైలామాకు ఆశ్రయమిస్తే పాక్ మాత్రం ఒసామాబిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందని, భారత్ ఉపాధ్యాయులు, సాంకేతికతను ఎగుమతి చేస్తే పాక్ ఉగ్రవాదులను ఎగుమతి చేసిందని చెప్పారు. దేశ జాతీయ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచానికి నాయకత్వం వహించేందుకు కేంద్రానికి శ్రీకృష్ణదేవరాయలు సూచనలు చేశారు. ఉగ్రవాదాన్ని నిర్వచించేలా ఐరాసాపై ఒత్తిడి తేవాలని, ఇందుకోసం చేపట్టే కార్యక్రమాలకు భారత్ నాయకత్వం వహించాలని కోరారు.

పోలవరం-బనకచర్ల పనులు మొదలవ్వలేదు

» రాజ్యసభలో కేంద్ర మంత్రి చౌధరి

న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభంకాలేదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈమేరకు తమకు తెలియజేసిందని కేంద్రం వెల్లడించింది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌధరి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. సాంకేతిక, ఆర్థిక పరిశీలన కోసం ఆ ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదికను ఏపీ ప్రభుత్వం తమ మంత్రిత్వ శాఖలోని కేంద్ర జలసంఘానికి అందజేసిందని తెలిపారు. ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను కేంద్రప్రభుత్వం స్వీకరించిందని తెలిపారు.

గ్లోబల్ గ్రీన్ హైడ్రోజన్ క్యాపిటల్‌గా అమరావతి

» 2030 నాటికి తీర్చిదిద్దేలా పాలసీ అమలు

» ఉత్తర్వులు జారీ చేసిన ఇంధన శాఖ

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ గ్రీన్ హైడ్రోజన్ క్యాపిటల్‌గా 2030 నాటికి అమరావతిని తీర్చిదిద్దే పాలసీని అమలు చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖ ఉత్తర్వు జారీ చేసింది. రాష్ట్రంలో 2027 నాటికి రెండు గిగావాట్లు, 2029 నాటికి 5 గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2029 నాటికి ఏటా 1.50 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యం పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2029 నాటికి 25 గిగావాట్ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకునేలా గ్రీన్ ఎనర్జీ కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

విశాఖ భూకబ్జాలపై ప్రత్యేక నివేదిక

» వైసీపీ నేతలే కబ్జాలకు పాల్పడ్డారు: అనగాని


విశాఖ కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి

విశాఖపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పలువురు వైసీపీ నేతలే విశాఖలో భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. విజయనగరం జిల్లాకు చెందిన వైసీపీ నేత సతీమణి తన భూమి బలవంతంగా రాయించుకున్నారని ఒకరు ఫిర్యాదు చేశారని తెలిపారు. అలాగే ఎంపీగా పనిచేసిన వ్యక్తి నిర్మించిన భవనంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఫిర్యాదు చెప్పారు. విశాఖలో భూకబ్జాలపై రెవెన్యూ యంత్రాంగం నివేదిక తయారు చేస్తోందని తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక విధానం తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. 22-ఎ నుంచి తమ భూములను తప్పించాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయని తెలిపారు. పంచ గ్రామాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. భూకబ్జాల్లో కూటమి పార్టీ నేతలు ఉన్నా వదిలేది లేదని, చట్టం ముందు అందరూ ఒకటేనని స్పష్టం చేశారు.



ఆసియాలోనే రెండో అతి పెద్ద కంటైనర్ టెర్మినల్ పోర్టును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్

టువాస్ పోర్టు నిర్మాణంలో ఏఐ వినియోగం

- ఆసక్తి చూపించిన చంద్రబాబు బృందం
- అదే మోడల్‌లో ఏపీ పోర్టుల అభివృద్ధి
- నిర్మాణ దశలు, వ్యయంపై సీఎం ఆరా

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న టువాస్ పోర్టును ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. రెండు గంటలపాటు పోర్టు నిర్మాణాన్ని రాష్ట్ర మంత్రులతో కలసి పరిశీలించారు. ఆసియాలోనే రెండో అతిపెద్ద కంటైనర్ టెర్మినల్ పోర్టు ఇది. ఏపీలో పెద్దఎత్తున తీర ప్రాంతం ఉందని అక్కడి అధికారులకు చంద్రబాబు తెలిపారు. తీరప్రాంతం ఆధారంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలనే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నామన్నారు. టువాస్ పోర్టు పరిశీలనలో భాగంగా పోర్ట్ ఆఫ్ సింగపూర్ అథారిటీ ప్రాంతీయ సీఈవో విన్సెంట్‌తో సీఎం సమావేశమయ్యారు. పోర్టు నిర్మాణం, నిర్వహణ కార్యకలాపాలపై ఆరాతీశారు. పోర్టు కార్యకలాపాల నిర్వహణలో కృత్రిమ మేధ (ఏఐ) లాంటి సాంకేతికాంశాలను ఏవిధంగా వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. టువాస్ పోర్టులోని ఏఐతో కూడిన ఆటోమేషన్ వ్యవస్థను చంద్రబాబు బృందం పరిశీలించింది. పోర్టు నిర్మాణానికి అవుతున్న వ్యయం, ఎన్ని విడతలుగా నిర్మిస్తున్నారనేది తెలుసుకున్నారు. మొత్తంగా రూ.1,70 లక్షల కోట్ల వ్యయంతో పోర్టు నిర్మాణం చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. ఏపీలో ప్రతి 50 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఓ పోర్టును నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని చంద్రబాబు వెల్లడించారు. ఏపీ పోర్టులను సింగపూర్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దే అంశం గురించి అధికారులతో చంద్రబాబు బృందం సమీక్షించింది.

బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు భేష్

- చెట్లు కొట్టకుండా, నీటి వనరుల్ని పరిరక్షిస్తూ పర్యావరణహితంగా నివాస సముదాయాలు
- సింగపూర్‌లో 2గంటలపాటు కాలినడకన ప్రాజెక్టును పరిశీలించిన సీఎం

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనలు .. ఆధునికతల కలయికే అమరావతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉత్తమ విధానాలతో ఏపీకి భవిష్యత్ నగరం నిర్మిస్తున్నామని వెల్లడించారు. సింగపూర్-ఆంధ్రప్రదేశ్ మధ్య సహకారం కొనసాగాలని, ప్రభుత్వాల మధ్య అంతరం తగ్గించడమే పర్యటన ఉద్దేశమని స్పష్టం చేశారు. రెండో రోజు సింగపూర్ పర్యటనలో భాగంగా చంద్రబాబు సోమవారం రెండు గంటల పాటు కాలినడకన బిడదారి హౌసింగ్ ప్రాజెక్టును పరిశీలించారు. పర్యావరణహితంగా నివాస సముదాయ నిర్మాణంపై ప్రశంసలు కురిపించారు. పదివేల కుటుంబాలు నివాసం ఉండేలా బిడదారి ఎస్టేట్‌ను రూపొందించారు. రాష్ట్రంలో భారీ ఎత్తున అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలోనే ఈ హౌసింగ్ ప్రాజెక్టు ప్లాన్‌ను చంద్రబాబు బృందం పరిశీలించింది. 'సిటీ ఇన్ ఎ గార్డెన్' పేరుతో నిర్మించిన ఈ ప్రాజెక్టు విశిష్టతలను సింగపూర్ అధికారులు వివరించారు. మొత్తం 250 ఎకరాల్లో నిర్మించారు. ఈ సమయంలో సింగపూర్‌కూ, ఆంధ్రప్రదేశ్‌కూ మధ్య ఉన్న అనుబంధాన్ని అక్కడి అధికారులకు చంద్రబాబు వివరించారు. ఇదే సమయంలో రాజధాని నిర్మాణ ఉద్దేశాన్ని కూడా వెల్లడించారు. సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, రాజధాని నిర్మాణంలో ప్రపంచ బ్యాంకూ భాగస్వామి అయిందన్నారు. బిడదారి ఎస్టేట్‌లో గృహ సముదాయాల నిర్మాణం చేపట్టిన విధానాన్ని ఆయనకు సింగపూర్ అధికారులు వివరించారు. చెట్లు తొలగించకుండా సహజ నీటి వనరులు దెబ్బతినకుండా ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన విధానం గురించి తెలిపారు. ఆహ్లాదకరంగా గృహాలు ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చేపట్టిన ఈ ప్రాజెక్టుకు అయిన వ్యయం గురించి చంద్రబాబు ఆరాతీశారు. శ్మశాన ప్రాంగణాన్ని సుందర పార్కుగా సింగపూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్చడం అద్భుతంగా ఉందని అధికారులను చంద్రబాబు అభినందించారు.



సింగపూర్‌లో బిడదారి ఎస్టేట్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు నారాయణ, భరత్ తదితరులు

అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులకు సహకరించండి

అనంతరం సింగపూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, సింగపూర్ కార్పొరేషన్ ఎంటర్‌ప్రైజెస్‌తోపాటు ప్రపంచ బ్యాంకు అధికారులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీలో అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావాలని సింగపూర్ హౌసింగ్ అథారిటీని సీఎం కోరారు.

క్రీడలతో పర్యాటక, వాణిజ్య రంగాల్లో వృద్ధి

- సింగపూర్‌లో అత్యుత్తమ స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించిన సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'క్రీడలతోనూ పర్యాటక, వాణిజ్య రంగాల్లో వృద్ధి సాధ్యం. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. సోమవారం సింగపూర్‌లో ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, మంత్రులు, అధికారులతో కలసి సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. అత్యుత్తమ క్రీడాకారుల్ని తయారు చేయడంతో పాటు క్రీడా సదుపాయాలు, పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీ స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చామని చెప్పారు. అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయడంతో పాటు వినోదం, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రాలుగా స్పోర్ట్స్ స్కూళ్లు ఉండాలని సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఒంగ్ కిమ్ సూన్‌తో సీఎం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలన్న సంకల్పంతో పెద్దఎత్తున ప్రోత్సాహకాలను ఇస్తున్నట్లు చెప్పారు. ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న క్రీడా రిజర్వేషన్లను మూడు శాతానికి పెంచామని చెప్పారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన వారికి రూ.7 కోట్లు, రజతం సాధిస్తే రూ.5 కోట్లు, కాంస్య సాధిస్తే రూ.3 కోట్లు ప్రోత్సాహకంగా ఇస్తున్నామని వెల్లడించారు. ఏషియన్ గేమ్స్‌లో పతక విజేతలకు గ్రూప్-1 ఉద్యోగాలిస్తున్నామని చెప్పారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ, తిరుపతి, వైజాగ్, అమరావతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ తరహాలోనే కడప, విజయవాడ, విజయనగరంలో క్రీడా పాఠశాలల ఏర్పాటు యోచనలో ఉన్నామన్నారు. ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా సింగపూర్‌ని తీర్చిదిద్దేందుకు స్పోర్ట్స్ స్కూల్ ప్రయత్నిస్తోందని సీఎంకు ఆ సంస్థ ప్రిన్సిపాల్ ఒంగ్ కిమ్ సూన్ వివరించారు. సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్‌లో హైపెర్ఫార్మెన్స్ స్పోర్ట్స్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఇందుకు ఉన్నత ప్రమాణాలు, అత్యున్నత పనితీరు కలిగిన వ్యవస్థలను రూపొందించుకున్నామని అన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు ఇచ్చేలా నిబంధనలు రూపొందించామని చెప్పారు. విద్యార్థులకు 12 ఏళ్లు వచ్చిన తర్వాతే అడ్మిషన్లు ఇచ్చి క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు. జాతీయ క్రీడా సంఘాలు, అకాడెమీలతో స్కూల్‌ను అనుసంధానించామని వివరించారు.



సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్, ఆయన బృందంతో సమావేశమైన సీఎం చంద్రబాబు, మంత్రులు టీజీ భరత్, లోకేశ్

ఆ తప్పులు ఇక జరగవు

జగన్ ప్రభుత్వంలో జరిగిన వాటిని సరిదిద్దడానికే సింగపూర్ వచ్చా

- మాకు మీ సహకారం కావాలి
- గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లకు సహకరించండి
- ఆ దేశ మంత్రి లాంగ్‌తో చంద్రబాబు
- హౌసింగ్, సబ్ సీ కేబుల్ రంగాల్లో కలసి పనిచేసేందుకు సింగపూర్ సంసిద్ధత

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌తో గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ చేసిన తప్పులను పునరావృతం కానివ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. జగన్ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకే తమ బృందం సింగపూర్‌కు వచ్చిందని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీ రంగం, డేటా సెంటర్ల ఏర్పాటులో సింగపూర్ సహకారాన్ని కోరారు. సింగపూర్ పర్యటనలో భాగంగా రెండోరోజు సోమవారం ఆ దేశ విద్యుత్, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి టాన్ సీ లాంగ్, ప్రభుత్వ ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి బృందం సమావేశమైంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులను చేపడుతోందని, ఇందులో సింగపూర్ సహకారాన్ని ఆశిస్తున్నామని మంత్రి టాన్ సీ లాంగ్‌ను సీఎం చంద్రబాబు కోరారు. గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు తమది స్నేహపూర్వక ప్రభుత్వమని తెలిపారు. డేటా సెంటర్ల ఏర్పాటులో సింగపూర్ సహకారం కావాలని కోరారు. 'లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉంది. ప్రస్తుతం ఏపీలో పోర్టుల నిర్మాణం వేగవంతంగా సాగుతోంది. ఈ రంగాల్లో రాష్ట్రానికి సింగపూర్ చేయూత అవసరం. మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, వాణిజ్య విభాగాల్లో సింగపూర్ సహకరించాలి' అని కోరారు. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై టాన్ సీ లాంగ్‌తో చంద్రబాబు సమీక్షించారు. రికార్డులను సరిచేసేందుకు సింగపూర్‌కు వచ్చినట్లు సీఎం వెల్లడించారు. సింగపూర్‌ను చూశాకే హైదరాబాద్‌లో రాత్రి సమయంలో రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని సీఎం వివరించారు. ఏపీలో నవంబరులో విశాఖపట్నంలో జరగనున్న పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో పాల్గొనాలని టాన్ సీ లాంగ్‌ను ఆహ్వానించారు.

ఏపీతో కలిసి పనిచేస్తాం: సింగపూర్

గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగాల్లో ఏపీతో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని సింగపూర్ ప్రకటించింది. రాష్ట్రంలో ఈ రంగాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగస్వాములు అవుతామని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో ప్రపంచ బ్యాంకుతో కలసి పనిచేస్తున్నామని వెల్లడించారు. గతంలో హైదరాబాద్ వచ్చినప్పుడు చంద్రబాబుతో కలసి చర్చించిన విషయాలను లాంగ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమావేశంలో మంత్రులు పి.నారాయణ, లోకేశ్, టీజీ భరత్, అధికారులు పాల్గొన్నారు.

మీ పెట్టుబడులకు మాదీ పూచీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాజధాని అమరావతి మాస్టర్‌ప్లాన్ కోసం 2014లో సింగపూర్ వచ్చానని.. సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలతో ఏపీతో సింగపూర్ ప్రభుత్వ సంబంధాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన పర్యటనతో సత్సంబంధాల పునరుద్ధరణ జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సింగపూర్ అవినీతిరహిత దేశమని.. అందుకే ఈ దేశమంటే తనకిష్టమని చెప్పారు. ఉద్యోగాల కల్పనలో ఈ దేశ ప్రభుత్వానిది అత్యుత్తమ మోడల్ అని ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ సమీపంలో సింగపూర్ టౌన్‌షిప్ నిర్మించామని గుర్తు చేసుకున్నారు. సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టాలని.. విశాఖ సదస్సుకు ప్రతిపాదనలతో హాజరు కావాలని కోరారు. అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుందామన్నారు. ఇంకా ఏం చెప్పారంటే..

రవాణా, సర్క్యులర్ ఎకానమీ అమలు..

2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించాలనే లక్ష్యంతో ప్రజల ఆర్థిక పురోగతి కోసం పని చేస్తున్నాం. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆకాశమే హద్దుగా అవకాశాలున్నాయి. పెట్టుబడులకు అనుకూలంగా ఉండడంతో పాటు వాటికి భద్రతా ఉంటుంది. అమరావతి, విశాఖలో లాజిస్టిక్ కారిడార్లు ఏర్పాటవుతున్నాయి. పెట్టుబడిదారులకు అవసరమైన నైపుణ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. తక్కువ వ్యయంతో రవాణా, సర్క్యులర్ ఎకానమీని అమలు చేయడం ద్వారా సుస్థిర భవిష్యత్ దిశగా అడుగులు వేస్తున్నాం. ఫ్యూచర్ టెక్నాలజీ కోసం అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం. సమీప భవిష్యత్‌లో సంప్రదాయ విద్యుత్ వినియోగం నుంచి గ్రీన్ ఎనర్జీకి మారిపోతున్నాం. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా.. రాష్ట్రం నుంచే మూడో వంతు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. పారిశ్రామికాభివృద్ధి కోసం 24 థీమాటిక్ విధానాలను ప్రకటించాం. ఎలక్ట్రానిక్ మొబిలిటీ, వేస్ట్ రీసైక్లింగ్, ప్రైవేట్ పారిశ్రామిక పార్కులు, ఏరోస్పేస్, రక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్ ఎంఎస్ఎంఈలు, మారిటైమ్ బోర్డు, మైనర్ మినరల్, స్పోర్ట్స్, టెక్స్‌టైల్ విధానాలు తెచ్చాం. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్, ఇన్నోవేషన్ పాలసీలను అమలు చేస్తున్నాం. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చాం. రాష్ట్రం అతివేగంగా అభివృద్ధి చెందుతోంది. సుదీర్ఘ తీర ప్రాంతం ఏపీ సొంతం. ప్రస్తుతం ఆరు ఆపరేషనల్ పోర్టులు అందుబాటులో ఉన్నాయి. మరో నాలుగు రేవులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో మారిటైమ్ కార్గో రంగంలో అపార అవకాశాలున్నాయి. మా ద్వారా పొరుగు రాష్ట్రాల నుంచీ పెద్దఎత్తున పోర్టు కార్గో హ్యాండ్లింగ్‌కు చాన్సుంది. ఏడు విమానాశ్రయాలు ఉన్నాయి. మరో 9చోట్ల గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు నిర్మిస్తున్నాం. విశాఖలో ప్రభుత్వ స్టీల్ ప్లాంటుకు సమీపంలోనే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ స్థాపిస్తున్నాం. విశాఖలో అదానీ గ్రూప్ డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. గూగుల్ కూడా ఇక్కడే డేటా సెంటర్ పెట్టబోతోంది. భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నాం. హైదరాబాద్, బెంగళూరు, అమరావతి, చెన్నై నగరాల్లోని ఐదు కోట్ల మందిని కలిపేలా త్వరలో బుల్లెట్ ట్రైన్ రానుంది. స్టార్టప్ ఎకోసిస్టమ్ కోసం ప్రత్యేక హబ్‌లు ఏర్పాటు చేయనున్నాం. సంపద సృష్టించడమే నా ధ్యేయం.

అప్పుడు పీ-3 ఇప్పుడు పీ-4

గతంలో పీ-3 అమలు చేశాం. ఇప్పుడు పీ-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) విధానం తీసుకొచ్చాం. పేదలు-ధనికుల మధ్య అంతరం తగ్గించడమే ఈ కార్యక్రమం లక్ష్య. పేదలకు చేయూతనివ్వడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. పెట్టుబడులే కాదు.. పేదలకు సాయం చేయాలని కూడా ఇదే వేదికగా కోరుతున్నాను.

నేడు మూడోరోజు సీఎం షెడ్యూల్..

- క్యారియర్, విల్మర్, టీవీఎస్, మురాటా ప్రతినిధులతో చర్చలు..
- సింగపూర్ అధ్యక్షుడు, మాజీ ప్రధానితో సమావేశం.. యూట్యూబ్ అకాడమీతో ఒప్పందం.
- ఐటీ ఎలక్ట్రానిక్స్ ఫిన్‌టెక్, ఆరోగ్య, పరిశ్రమలు, మౌలిక రంగాల్లో పెట్టుబడుల కోసం పారిశ్రామికవేత్తలతో భేటీ.
- గూగుల్ క్లౌడ్ ప్రతినిధులతోనూ సమావేశం. బిజినెస్ రౌండ్ టేబుల్ భేటీకి హాజరు.



సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్లో సీఎం చంద్రబాబు, పుల్లెల గోపీచంద్, మంత్రులు లోకేశ్, నారాయణ, భరత్

భవిష్యత్‌కు అనుగుణంగా కోర్సులు

రాష్ట్రంలో యువతను ఉద్యోగాల కోసమేగాకుండా.. భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలతో సిద్ధం చేస్తున్నామని లోకేశ్ చెప్పారు. అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలోని వర్సిటీల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశ పెడుతున్నామన్నారు. బలమైన విద్యా పర్యావరణ వ్యవస్థకు సింగపూర్ సహకరించాలని కోరారు. సింగపూర్ విద్యావేత్తలతో 'నైపుణ్యాల నుంచి సామర్థ్యాలకు శ్రామికశక్తి పరివర్తనను వేగవంతం చేయడం' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాభివృద్ధికి సంప్రదాయ విద్యావిధానం సరిపోదన్నారు. నాలుగో పారిశ్రామిక విప్లవం సాంకేతిక నైపుణ్యాలనే కాకుండా సామర్థ్యాలను కూడా కోరుకుంటోందని చెప్పారు. సంక్లిష్ట సమస్యలను స్వీకరించే, ఆవిష్కరించే, పరిష్కరించే సామర్థ్యం కూడా శ్రామికశక్తి కలిగి ఉండాలని పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలకు ఏపీ కేంద్ర బిందువు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వేగవంతమైన మార్పు కోసం సింగపూర్‌తో కలసి పనిచేస్తామని పేర్కొన్నారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లపై సింగపూర్ వర్సిటీలతో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేశ్ ప్రకటించారు.

ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పిస్తాం

- రాష్ట్రంలో ఎంఆర్ఓ హబ్‌కు సహకరించండి
- ఎయిర్‌బస్‌కు మంత్రి లోకేశ్ ఆహ్వానం
- ఆసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీతో భేటీ
- ఎవర్ వోల్ట్ చైర్మన్‌తోనూ సమావేశం
- విద్యావేత్తలతో రౌండ్ టేబుల్ భేటీ

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): సింగపూర్ పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి లోకేశ్ పారిశ్రామిక దిగ్గజ సంస్థల ప్రతినిధులను కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారిని ఆహ్వానించారు. సోమవారం ఆయన ఎయిర్‌బస్ ఆసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీ, ఎవర్‌వోల్ట్ చైర్మన్ సైమన్ టాన్‌లతో భేటీ అయ్యారు. విమానయాన రంగంలో మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ (ఎంఆర్ఓ) హబ్‌గా ఏపీ అభివృద్ధి చెందడానికి సహకరించాలని ఆనంద్ స్టాన్లీని కోరారు. పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, ఆగ్నేయాసియా మార్కెట్ల నుంచి విమాన సేవల డిమాండ్ పెరుగుతోందని, ఇది ఎంఆర్ఓ సేవలకు పెద్ద క్యాప్టివ్ మార్కెట్‌ను సృష్టించనుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో 850 కంటే ఎక్కువ ఎయిర్‌బస్ విమానాలు ఎగురుతున్నాయని వివరించారు. దక్షిణాసియాలో ఎయిర్‌బస్‌కు డెడికేటెట్ ఎమ్ఆర్ఓ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారే అవకాశం ఉందన్నారు. విమానయాన భాగస్వాములకు సమర్థవంతమైన సర్వీసింగ్ సేవల కోసం ఏపీతో కలసి పనిచేయాల్సిందిగా కోరారు. సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి, సింగపూర్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి సౌకర్యాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని సౌకర్యాలను చూసేందుకు ఒకసారి ఏపీకి రావాలని ఆనంద్ స్టాన్లీని ఆహ్వానించారు.



ఎవర్ వోల్ట్ గ్రీన్ ఎనర్జీ సంస్థ చైర్మన్ సైమన్ టాన్‌తో సమావేశమై చర్చిస్తున్న మంత్రి లోకేశ్



ఎయిర్ బస్ సంస్థ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీతో సమావేశమైన మంత్రి లోకేశ్

సోలార్ సెల్ యూనిట్ స్థాపించండి

రాష్ట్రంలో పెద్దఎత్తున సోలార్‌సెల్ మాడ్యూల్, బ్యాటరీ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఎవర్‌వోల్ట్ గ్రీన్ ఎనర్జీ చైర్మన్ సైమన్ టాన్‌ను లోకేశ్ కోరారు. రెన్యూ, సుజలాన్ వంటి భారీ కంపెనీలు ఇప్పటికే రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయని చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన సౌరశక్తి నిల్వ ఆవిష్కరణ కోసం ఎవర్ వోల్ట్ రీసెర్చ్ సెంటర్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలలో రెన్యూవబుల్ ఎనర్జీ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌కు సహకారం అందించాలని కోరారు. ఎంపిక చేసిన ఓ ఐటీఐలో దీనిపై ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ ఇస్తామని సైమన్ టాన్ హామీ ఇచ్చారు. తమ సంస్థ ఉన్నత స్థాయి బృందంతో మాట్లాడి ఏపీలో యూనిట్ ఏర్పాటు చేసే అంశంపై నిర్ణయం తీసుకుంటామని టాన్ వెల్లడించారు

మోదీ వచ్చినపుడు కృతజ్ఞతలు తెలపండి

గత ఐదేళ్ల విధ్వంస పాలన చూశాక రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు విదేశాల్లోని తెలుగు వారంతా ముందుకు రావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. తెలుగు డయాస్పోరా సమావేశాన్ని విజయవంతం చేసిన వలంటీర్లు సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని మోదీ త్వరలోనే సింగపూర్‌లో పర్యటిస్తారని... తెలుగువారంతా పెద్దఎత్తున పాల్గొని రాష్ట్రానికి సహకరిస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

ఎవరు 'మార్గదర్శులు'?

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శిగా నమోదు చేసుకోవచ్చు. అయితే మద్యం వ్యాపారులు ధనవంతులు కాబట్టి కొన్ని కుటుంబాలను వారికి అనుసంధానం చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల పీ4 అని కాకుండా కొంత నగదు ఇవ్వాలని ఎమ్మెల్యేలు అడుగుతున్నట్లు తెలిసింది. ఆ నగదుతో కుటుంబాలను దత్తత తీసుకునే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మద్యం వ్యాపారులు మార్గదర్శులుగా మారితే కొత్త చిక్కులు వస్తాయేమోనని ఎక్సైజ్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఆర్థికంగా కుటుంబాలను ఆదుకునే సాకుతో మద్యం వ్యాపారంలో ఉల్లంఘనలకు పాల్పడే అవకాశం ఉంటుందనేది వారి అభిప్రాయం. ప్రభుత్వం పీ4లో రెండు రకాలుగా కుటుంబాలను దత్తత తీసుకునే అవకాశం కల్పిస్తోంది. ఆర్థిక సాయంతో కుటుంబాలను పైకి తీసుకురావడం ఒక విధానం. ఎలా పైకి రావాలనే దానిపై కుటుంబాలకు మార్గదర్శనం చేయడం మరొక విధానం. వివిధ శాఖల అధికారులకు కలెక్టర్లు వ్యక్తిగతంగా టార్గెట్లు పెడుతుండగా వారు రెండో విధానాన్ని ఎంచుకుంటున్నారు. కలెక్టర్లకు ప్రభుత్వం టార్గెట్లు పెట్టినందువల్లే ఇలా వివిధ మార్గాల్లో మార్గదర్శులను పెంచే ప్రయత్నం చేస్తున్నారని మరో వాదన వినిపిస్తోంది.

ఆ ఉత్తర్వులు ఉపసంహరణ

ఉపాధ్యాయులను మార్గదర్శులుగా నమోదుచేయాలని ఇచ్చిన ఉత్తర్వులను ఏలూరు డీఈవో ఉపసంహరించుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లను తప్పనిసరిగా మార్గదర్శులుగా నమోదు చేయించాలని కొద్దిరోజుల కిందట డీఈవో ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలో 190 మంది టీచర్లను కచ్చితంగా నమోదుచేయించాలని స్పష్టంచేశారు. దీనిపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. 'మార్గదర్శకులుగా టీచర్లా' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది.

ఎవరినీ ఒత్తిడి చేయట్లేదు: కుటుంబరావు

పీ4 పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమమని, దీని నిర్వహణకు ఎలాంటి ఒత్తిళ్లూ చేయడం లేదని స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు స్పష్టం చేశారు. ఎవరికి ఇష్టమైతే వారు చేయవచ్చని, ఇష్టం లేకపోతే చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ సర్వే ద్వారా ముందే లబ్ధి అవసరమైన కొన్ని కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపికచేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 50 వేల మందికిపైగా నమోదు చేసుకున్నారని తెలిపారు.

ఆ నలుగురు అదనపు జడ్జీలకు శాశ్వత న్యాయమూర్తుల హోదా

- జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్ పేర్లను సిఫారసు చేసిన సుప్రీం కొలీజియం
- రాష్ట్రపతి ఉత్తర్వుల తర్వాత ప్రమాణం
- తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు


జస్టిస్ హరినాథ్


జస్టిస్ కిరణ్మయి


జస్టిస్ సుమతి


జస్టిస్ విజయ్

అమరావతి/న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పనిచేస్తున్న నలుగురు అదనపు న్యాయమూర్తులు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులు కానున్నారు. జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లను శాశ్వత జడ్జీలుగా నియమించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత వీరు శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేస్తారు. వీరు అదనపు న్యాయమూర్తులుగా 2023 అక్టోబరు 21న ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. కాగా.. గాడి ప్రవీణ్ కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్‌లను తెలంగాణ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా నియమించాలంటూ ఈ నెల 2న కొలీజియం చేసిన సిఫారసును కేంద్రం సోమవారం ఆమోదించింది.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణం


హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం ప్రమాణం చేశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ ఏడాది మే 26న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం.. జస్టిస్ దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి సిఫారసు చేయడం.. అందుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడం తెలిసిందే. రాష్ట్ర హైకోర్టులో 37మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా.. జస్టిస్ దేవానంద్ చేరికతో సంఖ్య 29కి చేరింది. సోమవారం జరిగిన ప్రమాణస్వీకారానికి హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబ శివప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథరెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, జస్టిస్ దేవానంద్ కుటుంబ సభ్యులు, ఏపీ, మద్రాస్ హైకోర్టు న్యాయవాదులు, మద్రాస్, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ అధికారులు, తదితరులు హాజరయ్యారు. జస్టిస్ దేవానంద్‌కు పలువురు న్యాయవాదులు, బంధువులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ ప్రతినిధులకు సన్మానం

జస్టిస్ దేవానంద్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం హాజరైంది. ఈ బృందాన్ని ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు నల్లారి ద్వారకానాథరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ చైర్మన్ పీఎస్ అమల్‌రాజ్, వైస్ చైర్మన్ వి.కార్తికేయన్, మద్రాస్ హైకోర్టు పీపీ హసన్ మహ్మద్ జిన్నా, తమిళనాడు హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఆర్.కృష్ణకుమార్, కార్యనిర్వాహక సభ్యుడు రమేశ్ ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదుల రక్షణ బిల్లును తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ప్రతినిధుల బృందం తెలిపింది.


నంద్యాలలో పర్యటన సందర్భంగా డప్పు కొడుతున్న పీవీఎన్ మాధవ్

గోదావరి జలాలతో సీమ సస్యశ్యామలం

- ప్రాంతాలకు అతీతంగా ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారు
- బీఆర్ఎస్ కాస్తా వీఆర్ఎస్ పార్టీగా మారింది: మాధవ్

నంద్యాల, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు గోదావరి జలాలను తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం ఆయన నంద్యాల జిల్లాలో పర్యటించారు. ముందుగా ఆయన బీజేపీ శ్రేణులతో నంద్యాలలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామ స్థాయినుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాయలసీమ ప్రాజెక్టులపై కేంద్రం ప్రత్యేక దృష్టిసారించింది. కృష్ణా, గోదావరి మిగులు జలాలను సీమకు తెచ్చే విధంగా కృషి చేస్తోంది. సీమలోని ప్రాజెక్టులు, ప్రాంత సంస్కృతికి పునర్వైభవం తెస్తాం. నీళ్లు, ప్రాజెక్టులు, ఉద్యోగాలు తేవడంతో పాటు పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. కృష్ణా, గోదావరి మిగులు జలాల అంశాన్ని పరిష్కరించే దిశగా కేంద్రం కృషి చేస్తోంది. అమరావతితో పాటు పోలవరం కూడా ఈ ఐదేళ్లలోపు పూర్తి అవుతుంది. సీమకు వాటా హక్కు ప్రకారం నీరందించి రాయలసీమను రతనాల సీమగా మార్చడం, కర్నూలు డిక్లరేషన్, ట్రిమెన్ జడ్జి, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశాలపై ఎన్డీయే ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంది. రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం. ఇందుకోసం యువత బీజేపీలో కీలక పాత్ర పోషించాలి' అని మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి వ్యాఖ్యానిస్తూ... 'ఏం చేయాలో అర్థం కాక ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. బీఆర్ఎస్ కాస్తా ఇప్పుడు వీఆర్ఎస్ పార్టీగా మారిపోయింది. ప్రాభవం కోల్పోయిన ఆ పార్టీ ఇప్పుడు ఏపీ వ్యవహారాల్లో తలదూర్చి ఇక్కడి వారిని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోంది' అని మాధవ్ ఆరోపించారు.

వైసీపీ ఎమ్మెల్సీ దౌర్జన్యాన్ని అడ్డుకోండి

- రెండేళ్లయినా లీజు డబ్బులు ఇవ్వలేదు.. కలెక్టరేట్ ఎదుట బాధితుడి ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితుడు వేముల మల్లికార్జున్, కుటుంబ సభ్యులు, మద్దతుదారులు

బాపట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): రెండు గ్రానైట్ ఫ్యాక్టరీలను లీజుకు తీసుకుని రెండేళ్లయినా వాటికి అద్దె ఇవ్వడం లేదని, అడిగితే బెదిరిస్తున్నారంటూ సంతమాగులూరుకు చెందిన వేముల మల్లికార్జున సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం మార్టూరుకు చెందిన మల్లికార్జునకు సంతమాగులూరులో రెండు గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిని 2022లో విశ్రాంత డీఐజీ, వైసీపీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం లీజుకు తీసుకున్నారు. అప్పటి నుంచి లీజు డబ్బులు ఇవ్వడంలేదని, అడిగితే 'నేను తలుచుకుంటే ఏదైనా చేయగలను. రెండు ఫ్యాక్టరీలను రెండున్నర కోట్లకు ఇచ్చెయ్' అని బెదిరిస్తున్నారని చెప్పారు. రూ. 6 కోట్ల విలువైన ఫ్యాక్టరీలను తక్కువకు ఎలా ఇస్తానని వాపోయారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు.

కొండాపూర్ రేవ్ పార్టీ సూత్రధారి కాజ వాసి

- వీకెండ్‌లో హైదరాబాద్‌లో అశోక్ జల్సాలు


అప్పికట్ల అశోక్‌కుమార్

మంగళగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కొండాపూర్‌లో పోలీసులు భగ్నం చేసిన రేవ్ పార్టీకి సంబంధించి కీలక సూత్రధారి గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన అప్పికట్ల అశోక్ కుమార్ నాయుడుగా టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. అశోక్ తండ్రి పాములు నాగార్జున వర్సిటీలో వంట పని చేస్తుంటారు. ఆయన భూముల రేటు తక్కువగా ఉన్నప్పుడు సుమారు 20 ఎకరాలు కొనుగోలు చేయడంతో వాటి ధరలు అమాంతం రూ.కోట్లలో పెరిగిపోయాయి. కొంత భూమి అమ్మిన డబ్బుతో అశోక్‌కుమార్ వీకెండ్‌లో ఏపీ నుంచి యువతను హైదరాబాద్ తీసుకువెళ్లి పార్టీల పేరిట జల్సాలు చేసేవాడు. కాజ గ్రామానికే చెందిన నాగళ్ల మణికంఠ సాయి అనే యువకుడు కూడా అశోక్ కుమార్‌కు రేవ్ పార్టీల్లో సహకరిస్తున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో కొండాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ జరుగుతుందనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించి 11 మందిపై కేసులు నమోదు చేశారు. ఏపీ39ఎస్ఆర్0001 నంబరు కలిగిన నలుపు రంగు ఫార్చ్యూనర్ కారుకు అశోక్‌కుమార్ రాజ్యసభ ఎంపీ స్టిక్కర్ అతికించుకుని తిరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఈ రేవ్ పార్టీలో మంగళగిరికి చెందిన అశోక్‌కుమార్ కీలకంగా వ్యవహరించాడనే వార్త ఈ ప్రాంత ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది.

జనసురక్షతో సామాన్యులకు భద్రత

- ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్

విజయవాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి): జన సురక్ష పథకాల ద్వారా సామాన్య ప్రజలకు భద్రత లభిస్తుందని ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ చెప్పారు. దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు నిర్వహిస్తున్న జన సురక్ష ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సోమవారం గూడవల్లిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) రీజనల్ హెడ్ ఎంవీ తిలక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు మాట్లాడుతూ అర్హులందరూ పథకాల్లో నమోదు చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

బిచ్చగాళ్ల వీర్యం.. అడ్డాకూలీల అండం!



- వీర్యం, అండాల దందాలో వికృత పార్శ్వాలు
- చదువురానివారికైతే.. బిర్యానీ, మందు ఇచ్చి, ఇతరులకు 4వేల వరకు చెల్లించి సేకరణ
- అండ దానం చేసే మహిళలకు 20-25 వేలు
- పోలీసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు

హైదరాబాద్ సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): బిచ్చగాళ్లకు బిర్యాని.. అడ్డా కూలీలకు మద్యం.. కొంచెం చదువుకున్న వారికైతే రూ.వెయ్యి నుంచి 4 వేలు! అదే మహిళలకైతే రూ.20 వేల నుంచి రూ.25 వేల దాకా ఇస్తారు!! వీర్యం, అండాల సేకరణ పేరుతో నగరంలో జరుగుతున్న వికృత దందా ఇది!! సంతాన భాగ్యం లేక దాతల నుంచి వీర్యం, అండాల వంటివి కోరుకునేవారు.. ఆ దాతలు బాగా చదువుకున్నవారై, మంచి తెలివితేటలు కలిగినవారై ఉండాలని భావిస్తారు. కానీ.. ఈ దందా నడిపేవారు వారికి అంటగడుతున్నది బిచ్చగాళ్లు, అడ్డాకూలీల వీర్యాన్ని, అండాలను! 'ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయో సిస్టమ్ క్లినిక్' పేరుతో సికింద్రాబాద్‌లో ఈ దందా నడుపుతున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. దీనిపై లోతైన దర్యాప్తు చేయగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఈ క్లినిక్ యజమాని, మేనేజర్‌గా వ్యవహరిస్తున్న పంకజ్ సోని తన వద్ద కొంతమందిని ఏజెంట్లుగా, టెక్నీషియన్లుగా నియమించుకున్నాడు. వారు.. బిచ్చగాళ్లకు, అడ్డాకూలీల వంటివారికి డబ్బు ఆశ చూపించి వారి నుంచి వీర్యం, అండాలు సేకరిస్తున్నారు. ఆర్ట్ (అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ) నిబంధనల ప్రకారం ఆరోగ్యవంతులైన వ్యక్తుల నుంచి, అదీ 21 నుంచి 55 ఏళ్లలోపు ఉన్నవారి నుంచి.. వారికి అన్నిరకాల వైద్యపరీక్షలూ నిర్వహించి, ఎలాంటి జన్యువ్యాధులు, అంటువ్యాధులు లేవని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే వీర్యం సేకరించాలి. ఒక దాత నుంచి గరిష్ఠంగా 25సార్లు మాత్రమే వీర్యాన్ని సేకరించాలి. ఒక దాత నుంచి తీసుకున్న వీర్యాన్ని ఒక మహిళకు ఒక సారి గర్భధారణకు మాత్రమే ఉపయోగించాలి. కానీ.. స్పెర్మ్ క్లినిక్‌లు ఈ నిబంధనలన్నింటినీ తోసిరాజని ఒకే వ్యక్తి నుంచి వారానికొకసారి చొప్పున వీర్యం సేకరిస్తున్నాయి. ఉదాహరణకు.. ఇండియన్ స్పెర్మ్‌టెక్ ఏజెంట్లు బిచ్చగాళ్లు, అడ్డాకూలీలను సంప్రదించి.. "వారానికోసారి ఇక్కడకు వచ్చి మేం చెప్పినట్లు చేస్తే మందుతో పాటు బిర్యానీ ఇప్పిస్తాం"అంటూ వారికి ఆశపెట్టేవారని తెలిసింది. లేదంటే రూ.500-1000 చేతిలో పెట్టి పంపేవారని సమాచారం. ఉచితంగా బిర్యాని, లిక్కర్ వస్తుండడంతో వారు తరచుగా క్లినిక్‌కు వచ్చి వీర్యం ఇచ్చి వెళ్తుండేవారని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. అలా వచ్చేవారు.. తమకు తెలిసిన మహిళలను తీసుకొస్తే.. వారి నుంచి అండాలు సేకరించేవారు. అది కొంచెం కష్టమైన పని కావడంతో మహిళలకు ప్రతిసారీ రూ.20 వేల నుంచి రూ.25 వేలు చెల్లించేవారని తెలిసింది. నిందితులను మరోసారి కస్టడీకి తీసుకొని దీనిపై మరింత లోతుగా విచారించేందుకు సిద్ధమైన గోపాలపురం పోలీసులు.. ఈ మేరకు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది.



సంతానోత్పత్తి కేంద్రాలపై దృష్టి పెట్టాలి

- మంత్రి సత్యకుమార్

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంతానోత్పత్తి సేవలందిస్తున్న కేంద్రాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి ఒక సమగ్ర నివేదిక అందించాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సోమవారం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఫెర్టిలిటీ సెంటర్‌లో అక్రమాలు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ మేరకు ఆయన ఆదేశాలు జారీచేశారు. కాగా, ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని తమ బృందంతో కలిసి విజయవాడలోని యూనివర్సల్ హెల్త్‌కేర్ సెంటర్‌కు తనిఖీకి వెళ్లగా అది మూసి ఉన్నట్టు మంత్రి కార్యాలయానికి తెలిపారు. హైదరాబాద్‌లో అక్రమాల ఆరోపణలతో అరెస్టయిన డాక్టర్ నమ్రత పేరుమీదే ఈ ఫెర్టిలిటీ సెంటర్ మంజూరై ఉంది.

ఆగస్టు 2న 'అన్నదాత-సుఖీభవ' నిధులు

- పీఎం కిసాన్ సొమ్ముతోపాటు రైతుల ఖాతాల్లో జమ
- రాష్ట్రంలోని 46.64 లక్షల కుటుంబాలకు లబ్ధి

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత నిధులను ఆగస్టు 2న విడుదల చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. షెడ్యూల్ ప్రకారం ఈ ఏప్రిల్-జూలై మధ్య 41.58 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిన నిధుల్ని ఆగస్టు 2న జమ చేస్తామని కేంద్రం ప్రకటించింది. 'సూపర్‌సిక్స్' హామీల అమలులో భాగంగా 'అన్నదాత-సుఖీభవ' పథకం నిధులను కూడా అదేరోజు విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. పీఎం కిసాన్ కింద ఏటా రూ.6వేలు ఇస్తుండగా, అన్నదాత-సుఖీభవ కింద రూ.14వేలు ఇస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. వీటిని కేంద్రంతోపాటు మూడు విడతలుగా ఇస్తామని అధికార వర్గాలు తెలిపాయి. దీని ప్రకారం.. ఆగస్టు 2న కేంద్రం రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు జమ చేస్తాయని సమాచారం. అయితే కౌలు రైతులకు కేంద్రం పీఎం కిసాన్ నిధులు ఇవ్వడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే అన్నదాత-సుఖీభవ కింద రెండు విడతల్లో రూ.20 వేలు చెల్లించాలని నిర్ణయించింది. దీనిలో మొదటి విడతగా వచ్చే అక్టోబరులో రూ.10వేలు చెల్లిస్తామని వ్యవసాయ శాఖ తెలిపింది. ఇప్పటివరకు అన్నదాత-సుఖీభవ పథకం కింద సుమారు 46.64 లక్షల రైతు కుటుంబాలను అర్హులుగా వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ పథకానికి అర్హులైన రైతుల భూ వివరాలను వెబ్‌ల్యాండ్ నుంచి తీసుకుని, అన్నదాత-సుఖీభవ పోర్టల్ ద్వారా గ్రామస్థాయిలో ధ్రువీకరణ చేశారు. భూమి లేని కౌలు రైతులు ఈ పథకం కింద లబ్ధి పొందటానికి కౌలు గుర్తింపు కార్డు పొంది, ఈ-క్రాపులో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు చెప్పారు. 2025-26లో ఇంతవరకు 5.9లక్షల కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పథకానికి అర్హత కలిగిన రైతులు ఇంకా ఉంటే గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరించి, అర్హులకు సాయం అందిస్తామని సోమవారం ప్రకటించారు.

అసలు మాయం.. నకిలీతో మోసం!

- అనంతపురం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో గోల్డ్ స్కామ్
- నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారంలో కొన్ని ఆభరణాలు

అనంతపురం క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): అందరూ జల్సాలకు అలవాటుపడ్డారు! సులభంగా డబ్బు సంపాదనకు వక్ర మార్గం పట్టారు!! ఏకంగా రుణాల కోసం ప్రజలు బ్యాంకులో పెట్టుకున్న బంగారాన్ని కొట్టేసి.. వాటిని ఇతర ప్రైవేటు గోల్డ్ లోన్ సంస్థలో తనాఖా పెట్టి భారీగా సొమ్ము కాజేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఈ ఘరానా మోసం వెలుగుచూసింది. ఈ స్కామ్‌లో సదరు బ్యాంకు గోల్డ్‌లోన్ ఆఫీసర్ కీలకంగా వ్యవహరించగా.. అతని స్నేహితులతో పాటు గోల్డ్ లోన్ సంస్థ మేనేజర్ భాగస్వామ్యమయ్యారు. రూ.2 కోట్ల బంగారానికి సంబంధించిన ఈ స్కామ్‌లో పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, కేసు వివరాలు వెల్లడించారు. బ్యాంకులో బంగారం రుణం గడువు తీరినవారు రెన్యువల్ చేసుకునేందుకు వస్తే.. 'లోన్ క్లోజర్' కాగితాలపై సంతకాలు చేయించుకొని, ఆ బంగారాన్ని తీసుకెళ్లి ప్రైవేటు గోల్డ్‌లోన్ సంస్థలో కుదువపెట్టి సొమ్ము కాజేశారని పేర్కొన్నారు. బ్యాంకు అధికారుల కళ్లుగప్పేందుకు అసలు బంగారం స్థానంలో నకిలీ బంగారాన్ని ఉంచారని తెలిపారు. ఈ క్రమంలో ప్రైవేటు గోల్డ్ లోన్ కంపెనీకీ కూడా టోకరా వేశారని, బ్యాంకులో కాజేసిన బంగారానికి కొంత నకిలీ కూడా కలిపి అక్కడ తాకట్టు పెట్టారన్నారు.

బ్యాంకు ఆఫీసరే రింగ్ మాస్టర్!

అనంతపురంలోని రాణినగర్‌కు చెందిన వెంకటంపల్లి సతీష్‌కుమార్ రామ్‌నగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో గోల్డ్ లోన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. జాకీర్ కొట్టాలకు చెందిన జయరాములు గతంలో ఇదే బ్రాంచిలో సేల్స్ ఆఫీసర్‌గా పనిచేశాడు. సతీష్‌కు గణేష్‌నగర్‌కు చెందిన సాయికృష్ణ స్నేహితుడు. నందమూరి నగర్‌కు చెందిన బోయ శ్రీనివాసులు.. సతీష్‌కు పరిచయమయ్యాడు. అలాగే అనంతపురంలోని కీర్తన ఫైనాన్స్‌లో మేనేజర్‌గా చేస్తున్న నరేష్‌తో సతీష్‌కు పరిచయాలు ఉన్నాయి. జల్సాలకు అలవాటు పడ్డ వీరంతా.. ఏకమై బంగారం స్కామ్‌కు పాల్పడ్డారు.

అసలు, నకిలీ కలిపి 2,180 గ్రాములు..

సతీష్‌కుమార్ మిగిలిన నలుగురితో కలిసి కుట్రను అమలు చేశాడు. బంగారం రుణాల రెన్యువల్ పేరిట కస్టమర్లతో డాక్యుమెంట్లపై సంతకాలు చేయించేవాడు. వాటి ఆధారంగా లోన్‌ను క్లోజ్ చేసి, కస్టమర్లు వెళ్లిన తర్వాత సీల్డ్ కవర్‌లో ఉన్న అసలు ఆభరణాలను బయటకు తీసి, నకిలీ ఆభరణాలను అందులో పెట్టేవాడు. కొన్ని అసలువి, కొన్ని నకిలీవి తీసుకెళ్లి కీర్తన ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రుణాలు పొందేవారు. అక్కడ మేనేజర్‌గా వీరి మిత్రుడు నరేష్ ఉండటంతో ఈ తతంగం సాఫీగా సాగిపోయేది. కీర్తన ఫైనాన్స్‌లో సాయికృష్ణ పేరిట 1,200 గ్రాములు, శ్రీనివాసులు పేరిట 650 గ్రాములు, జయరాములు పేరిట 330 గ్రాములు.. ఇలా మొత్తం 2,180 గ్రాములు తనఖా పెట్టారు. ఇప్పటి దాకా రూ.2 కోట్ల దాకా మోసం జరిగినట్లు గుర్తించారు. నిందితులు సతీష్, జయరాములు, సాయికృష్ణ, శ్రీనివాసులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మరో కీలక నిందితుడు నరేష్ పరారీలో ఉన్నాడు.

చెవిరెడ్డికి చుక్కెదురు

- బెయిల్ పిటిషన్ తిరస్కరించిన ఏసీబీ కోర్టు
- దిలీప్, చాణక్య పిటిషన్లపై విచారణ వాయిదా



విజయవాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో నిందితుడిగా ఉన్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కోర్టులో చుక్కెదురైంది. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. చెవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగియడంతో సోమవారం న్యాయాధికారి భాస్కరరావు తీర్పు వెలువరించారు. కాగా ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న పైలా దిలీప్, కోనేటి చాణక్య బెయిల్ పిటిషన్లు 30కి వాయిదా పడ్డాయి. ఇక 12 మంది నిందితులకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలిచ్చింది. ఈ కేసులో ఉన్న 12 మంది నిందితులను అరెస్ట్ చేయడానికి అనుమతి ఇవ్వాలని సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌కు కోర్టు అనుమతి ఇచ్చింది.

జైల్లో మిథున్‌రెడ్డిని కలిసిన తల్లి

- ములాఖత్‌లో చెల్లి, బావ కూడా..


మిథున్‌రెడ్డిని కలిసి బయటకు వస్తున్న తల్లి స్వర్ణలత, చెల్లి శక్తి రెడ్డి, బావ అఖిల్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాం కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఆయన తల్లి స్వర్ణలత, చెల్లి శక్తి రెడ్డి, బావ అఖిల్ సోమవారం ములాఖత్‌లో కలిశారు. సుమారు 45 నిమిషాలు పాటు వారు జైల్లో మిథున్‌రెడ్డితో మాట్లాడారు. మిథున్‌రెడ్డి కుటుంబసభ్యులను మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మజీ ఎంపీ భరత్ తదితరులు జైలు వద్ద కలిశారు. ములాఖత్ అనంతరం మిథున్‌రెడ్డి తల్లి మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు ఏ తప్పు చేయలేదన్నారు. ధైర్యంగా ఉండాలని తన కొడుక్కి చెప్పానన్నారు. టెర్రరిస్టులను చూసినట్టు కాకుండా తన కుమారుడిని బాగా చూసుకోవాలని కోరారు.

బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ వాయిదా

- వివేకా కేసులో సునీత పిటిషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితులు ఏ2 సునీల్ యాదవ్, ఏ3 గజ్జల ఉమాశంకర్ రెడ్డిల బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వీరి బెయిల్ రద్దు చేయాలని గతంలో వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. సోమవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట ఇవి విచారణకు వచ్చాయి. అయితే.. ఈ కేసులో ఇతర నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై సుప్రీంకోర్టులోనే విచారణ జరుగుతోందని, అన్ని పిటిషన్లు కలిపి ఒకేసారి విచారిస్తామని బెంచ్ తెలిపిందని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబరు 16కు వాయిదా వేసింది.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సరిగ్గా విచారణ జరగలేదని అఖిల భారత క్రైస్తవ సంఘాల సమాఖ్య ప్రతినిధులు ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. కేసును రీ-ఓపెన్ చేయించాలని, ప్రత్యేక కమిటీ ద్వారా ప్రవీణ్ పగడాల మృతిపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌బీఐలో రూ.37.92 లక్షలు చోరీ

- 10 కిలోల బంగారు ఆభరణాలు కూడా..
- గ్యాస్ కట్టర్‌తో కిటికీ గ్రిల్స్ తొలగింపు
- సేఫ్టీ లాకర్‌నూ తెరిచి సొత్తు అపహరణ
- శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన


సీసీ టీవీ ఫుటేజీలో నమోదైన దొంగ

హిందూపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): గ్యాస్ కట్టర్‌తో కిటికీ గ్రిల్స్ కట్ చేసి బ్యాంకులోకి చొరబడిన దొంగలు రూ.37.92 లక్షల నగదు, 10 కిలోల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం తూముకుంట పారిశ్రామికవాడలో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచిలో జరిగిందీ ఘటన. డీఎస్పీ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. బ్యాంకు సిబ్బంది శుక్రవారం విధులు ముగించుకుని, బ్యాంకుకు తాళం వేసి వెళ్లారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో తిరిగి సోమవారం ఉదయం వచ్చేసరికి బ్యాంకు తలుపులు తెరిచి ఉన్నాయి. ఓ టేబుల్‌పై తాళాలు కనిపించాయి. స్ట్రాంగ్‌రూమ్ తలుపులు కూడా తెరిచి ఉన్నాయి. దీంతో వెంటనే పోలీసులకు, బ్యాంకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ మహేష్, సీఐ అబ్దుల్ కరీం వచ్చి పరిశీలించారు. బ్యాంకు వెనుకవైపు కిటికీ కడ్డీలను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి దుండగులు లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. మొదట మాస్క్ ధరించిన వ్యక్తి కిటికీ గుండా లోనికి ప్రవేశించినట్లు సీసీ కెమెరాలలో రికార్డైంది. అతను సీసీ కెమెరాలు, సైరన్ వైర్లను కోసేశాడు. ఆ తర్వాత మరికొందరు లోనికి చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి 2 గంటలకు చోరీ జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. లాకరులో ఉన్న రూ.37.92 లక్షల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. సేఫ్టీ లాకర్‌ను గ్యాస్ కట్టర్‌తో తెరిచారు. ఓ బాక్సులో ఉన్న 10 కిలోల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించాయి. బ్యాంకులో వేలిముద్రలను సేకరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.